

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 17
సంచిక: 8

ఆదివారం 31-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


శ్రీ విశ్వశాంతి జూనియర్ కాలేజి
స్కూల్ విద్యలోనే కాదు... కాలేజి విద్యలో కూడా Super Senior Lecturersచే అత్యుత్తమ శిక్షణ...
JEE - Main & Advanced, NEET & EAMCETలలో... అద్భుత ఫలితాలు.
IIT - JEE MAIN ALL INDIA TOPPERS
99.92 99.87 99.75 99.68 99.54 99.43
99.38 99.33 99.28 99.11 99.06 99.05 99.02 98.99 98.98
98.96 98.92 98.82 98.81 98.65 98.58 98.55 98.52 98.47
98.44 98.28 98.27 98.24 98.01 97.66 97.57 97.53 97.43
97.41 97.34 97.29 97.20 97.19 97.14 97.07 97.06 96.85
96.76 96.70 96.62 96.42 96.38 96.30 96.14 96.09 96.07
PERCENTILE
OUR CAP
...Outstanding Achievements in... IIT, IIST, NIT & IIIT
OUR STUDENTS SECURED IN TOP UNIVERSITIES
OUR PRIDE IS OUR NEET RANKERS
JOINED IN PRESTIGIOUS MEDICAL COLLEGES
మా వద్ద విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను డాక్టర్లుగా... ఇంజనీర్లుగా తీర్చిదిద్దుతున్న విద్యాసంస్థ.
Single Campus with Limited Strength
SCHOOL & COLLEGE


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 8

SUNDAY Special | ఆదివారం 31-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పీవీకి భారతరత్న

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పీవీ నరసింహారావు తరఫున భారతరత్న అందుకుంటున్న ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు

మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం ప్రదానం చేశారు. పీవీ తరఫున ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు, చరణ్‌సింగ్ తరఫున మనవడు జయంత్ చౌదరి, స్వామినాథన్ తరఫున ఆయన కుమార్తె నిత్యారావు, కర్పూరీ ఠాకూర్ తరఫున కుమారుడు రాంనాథ్ ఠాకూర్ పురస్కారాన్ని అందుకున్నారు.

6లో



ఢిల్లీ మంత్రిని ప్రశ్నించిన ఈడీ

మద్యం స్కాం కేసులో ఢిల్లీ మంత్రి, ఆప్ నేత కైలాశ్ గహ్లోత్‌ను ఈడీ అధికారులు దాదాపు 5 గంటలపాటు ప్రశ్నించారు.

వివరాలు 6లో ▸



బీజేపీ మేనిఫెస్టో కమిటీ

మేనిఫెస్టో రూపకల్పన కోసం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలో 27 మంది సభ్యులతో బీజేపీ కమిటీని ఏర్పాటు చేసింది.

వివరాలు 6లో ▸



విపక్షాల ర్యాలీ నేడే

'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' నినాదంతో ఇండియా కూటమి నేడు ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనుందని జైరాం రమేశ్ తెలిపారు.

వివరాలు 6లో ▸

ద్రవిడ నేలపై కమలం వికసించేనా?

దక్షిణాదిని పాదాక్రాంతం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడుపై స్పెషల్ ఫోకస్ పెట్టింది.

వివరాలు 6లో ▸

అనంతపురం జిల్లా గుత్తిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న భారీ జనసందోహంలో ఓ భాగం





మీ ఓటుతోనే

మీ రాత మార్పు

కళ్లెదుట కనిపిస్తున్న అభివృద్ధిని ఇంటింటా వివరించండి

పత్తికొండ నియోజకవర్గం తుగ్గలిలో ప్రజలతో ముఖాముఖిలో సీఎం వైఎస్ జగన్

- ఈ 58 నెలల పాలనలో ఊరూరా సంక్షేమాభివృద్ధి
- ఇదివరకెన్నడూ లేని విధంగా ఇంటింటికీ లబ్ధి
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా విప్లవాత్మక మార్పులు
- రైతులు, అవ్వాతాతలకు అండగా నిలిచాం
- అక్కచెల్లెమ్మల నుంచి విద్యార్థుల వరకు అందరికీ మంచి చేశాం.. మీ ఊళ్లో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్‌లు నిర్మించి పాలన మీ ఇంటికే తెచ్చాం
- మరింత మంచి చేసేందుకు మీ బిడ్డను ఆశీర్వదించండి

7లో

కదం తొక్కిన స్టార్ క్యాంపెయినర్లు

- 'మేమంతా సిద్ధం' యాత్రకు అడుగడుగునా ఆదరణ
- కర్నూలు జిల్లాలో సీఎం జగన్ రోడ్‌షో సూపర్ హిట్
- అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో జన ప్రభంజనం
- రోడ్డుపై ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున అభిమాన జనం
- పూల వర్షం.. గజమాలలు.. జై జగన్ నినాదాలు

- వివరాలు 8లో

పింఛన్ల పంపిణీకి వలంటీర్లు దూరం

టీడీపీ అనుబంధ సంస్థ ఫిర్యాదు ఫలితం

అన్ని సంక్షేమ పథకాలకు వలంటీర్లను దూరం పెట్టండి

వాటి అమలుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోండి

వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు ఇతర పరికరాలనూ స్వాధీనం చేసుకోండి

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఫిర్యాదుల మేరకు ఎన్నికల సంఘం ఉత్తర్వులు

2లో



అవ్వాతాతలపై బాబు పగ

- వివరాలు 2లో

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ముసుగులో చంద్రబాబు కుట్ర..

నిజానికి ఇది ఆయన జేబు సంస్థ

దీనికి బాబు నమ్మినబంటు.. రాష్ట్ర ప్రధాన ఎన్నికల మాజీ అధికారి నిమ్మగడ్డ నేతృత్వం

ఫ్యాక్ట్‌చెక్

సిగ్గొదిలేసి పచ్చి అబద్ధాలు

- సీఎం జగన్ మాటలను వక్రీకరిస్తూ ఈనాడు తప్పుడు రాతలు
- మహిళలు, పిల్లల కోసం డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.2.83 లక్షల కోట్లు
- ఇందులో డీబీటీ ద్వారా మహిళల ఖాతాల్లో రూ.1.89 లక్షల కోట్లు.. నాన్ డీబీటీ ద్వారా మరో రూ.94,347 కోట్లు
- 99% హామీల అమలు జగమెరిగిన సత్యం..
- పేదల ఇళ్ల కోసం 17,005 జగనన్న కాలనీలు
- నాడు–నేడుతో స్కూళ్లకు కొత్త రూపు

5లో

- లైన్‌లో ఎన్నాళ్లున్నా నో ఛాన్స్

టీడీపీలో కోట్లకు సీట్లు

అభ్యర్థుల ఎంపికలో డబ్బుకే ప్రాధాన్యత ఇచ్చినట్లు తేటతెల్లం

- పార్టీ నేతలను కాదని బయటి వ్యక్తులకు సీట్లు ఇవ్వడానికి ఇదే కారణం
- అనంతపురం అర్బన్ సీటును రూ.30 కోట్లకు అమ్ముకున్నట్లు టీడీపీ నేతల ఆరోపణ
- గంటాకు భీమిలి వెనుకా భారీ డీల్
- దర్శి, గుంతకల్లు ఎమ్మెల్యే, ఒంగోలు ఎంపీ సీటు ఖరారుకీ ఇదే సూత్రం

5లో



అంతకుముందు ప్రకటించిన అనేక సీట్లలోనూ ఇదే పంచాయితీ.. రెండు రకాల డిపాజిట్లు చేస్తే కానీ సీటు ఖరారు కాలేదంటున్న అభ్యర్థులు

అనేక చోట్ల సీట్లు అమ్మేసుకున్నారని ఆరోపిస్తున్న టీడీపీ నేతలు.. మిన్నంటుతున్న ఆందోళనలు



డీఎస్సీ పరీక్షలు వాయిదా

- ఏపీ టెట్ ఫలితాల వెల్లడి కూడా..
- ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ఆపాలని ఈసీ ఆదేశాలు

12లో

వలంటీర్లపై ఈసీ నిర్ణయం దురదృష్టకరం

ఎన్నికల కమిషన్ తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి

- సీఎం వైఎస్ జగన్‌పై కక్షతో పేదల్ని ఇబ్బంది పెట్టేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు: మంత్రి అంబటి రాంబాబు
- వలంటీర్ల సేవలు నిలిపివేయించిన నీచుడు చంద్రబాబు: మంత్రి కారుమూరి
- చంద్రబాబు పెత్తందారీ పోకడలతో ప్రజలకు ఇబ్బందులు: ఎంపీ కేశినేని, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్
- వలంటీర్లను నియంత్రించడం ప్రజలను ఇబ్బందులు పెట్టడమే: ఎమ్మెల్యే కన్నబాబు

2లో

ఉత్తరాంధ్రలో ఆగ్రహజ్వాలలు

రాష్ట్ర వ్యాప్తంగా కూటమిలో ప్రకంపనలు

2లో

ఇంకుజెట్



జనసేనను చిదిమేసిన చంద్రబాబు

పొత్తు పేరుతో జనసేన ఉనికికే ఎసరు పెట్టిన టీడీపీ అధినేత

175 అసెంబ్లీ స్థానాల్లో ఇచ్చింది 21 మాత్రమే



- వివరాలు 9లో

- రాయలసీమలోని 52 సీట్లలో దక్కింది రెండే
- ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరులో 4 మాత్రమే జనసేనకు
- ఉభయ గోదావరి జిల్లాల్లో 34 స్థానాల్లో జనసేనకు 12
- విశాఖ జిల్లాలో 15 సీట్లలో ఇచ్చింది మూడే..
- ఇలా రెండు, మూడు జిల్లాలకే జనసేనను పరిమితం చేసిన బాబు.. వీటిలోనూ జనసేన నాయకులకు దక్కిన సీట్లు చాలా తక్కువ
- అధిక భాగం ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే సీట్లు
- మనకేదీ ప్రాధాన్యత అంటూ ప్రశ్నిస్తున్న అభిమానులు
- పవన్‌కు చెప్పుకుందామన్నా స్పందన లేక నిరాశ
- బాబుతో పొత్తున్న పార్టీలు ఎదగలేవంటూ ఆవేదన

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

నా గుండె చప్పుడు సీఎం జగన్



నేను గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నా. మేము వెల్దుర్తి ఎస్సీకాలనీలో నివసిస్తున్నాం. ఆదాయం అంతంత మాత్రమే. వచ్చిన ఆదాయంతోనే ఎలాగోలా జీవిస్తున్న తరుణంలో అనుకోకుండా గుండెకు సంబంధించిన సమస్య తలెత్తింది. హైదరాబాద్‌లో వైద్యులను సంప్రదిస్తే గుండె మార్పిడి ఆపరేషన్ చేయాలన్నారు. సుమారు రూ.33 లక్షలు ఖర్చవుతాయని చెప్పారు. అంతంత మాత్రం జీతంతో జీవిస్తున్న మాకు అంత డబ్బు ఎలా తేవాలో అర్థం కాలేదు. ఇక బతుకుపై ఆశ సన్నగిల్లింది. అప్పటికే వైద్య పరీక్షల నిమిత్తం సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశాం. ఏంచేయాలో పాలుపోలేదు. నా సమస్యను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి చెప్పాను. ఆయన ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లడంతో నాకు ప్రత్యేకంగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.33 లక్షలు మంజూరు చేశారు. ఐదు నెలల క్రితం తిరుపతి స్విమ్స్ వైద్యశాలలో డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నాకు ఆపరేషన్ చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి బ్రెయిన్ డెడ్ కావటంతో అతడి గుండెను నాకు అమర్చారు. ఇప్పుడు నేను ఆరోగ్యంగా ఉన్నాను. సీఎం జగన్ నాకు పునర్జన్మ ప్రసాదించారు. నా కుమారుడికి అమ్మఒడి కింద ఏడాదికి రూ.15 వేలు వంతున వస్తోంది. ప్రభుత్వం మా గ్రామంలోని జగనన్న కాలనీలో మాకు ఇంటి స్థలం కూడా మంజూరు చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సంతోషంగా జీవిస్తున్నాం. నా గుండె చప్పుడుగా మారిన జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– చాగంటి సుమతి, వెల్దుర్తి
(డి.వెంకటేశ్వర్లు, విలేకరి, వెల్దుర్తి)

మమ్మల్ని దేవుడిలా ఆదుకున్నారు



మాది నిరుపేద కుటుంబం. మా ఆయన గోవిందరావు రోజువారీ కూలీ. ఆయన అరకొర సంపాదనతోనే మా జీవితం సాగుతోంది. నేను దివ్యాంగురాలిని కావడంతో ఏ పనీ చేయలేను. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 30వ డివిజన్‌లోని రామకృష్ణాపురంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. మాకు వైష్ణవి అనే కూతురు ఉంది. ప్రస్తుతం 4వ తరగతి చదువుతోంది. గత ప్రభుత్వం మాలాంటి వారికి ఎలాంటి సాయం చేయలేదు. ఇటీవల నాకు అనారోగ్యంగా ఉండటంతో ఆస్పత్రిలో చూపించుకుంటే పరీక్షలు చేసిన డాక్టర్లు క్యాన్సర్‌గా నిర్ధారించారు. ఏం చేయాలో పాలుపోలేదు. అయితే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని చెప్పడంతో దాని ద్వారా శస్త్రచికిత్స చేయించుకున్నా. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నా. జగనన్న ప్రభుత్వం శస్త్రచికిత్స సమయంలో రూ.పది వేలు సాయం అందించింది. కీమో థెరపీ సమయంలోనూ రూ.ఐదు వేల చొప్పున అందిస్తున్నారు. దివ్యాంగురాలినైన నాకు పింఛను వస్తోంది. మా పాపకు మూడేళ్లుగా అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు వంతున వచ్చాయి. ఇంటి పట్టా కూడా మంజూరైంది. ఎటువంటి ఆసరా లేని మమ్మల్ని జగనన్న దేవుడిలా ఆదుకున్నారు. జగనన్నకు మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

– కుంటిమద్ది సుజాత,
రామకృష్ణాపురం, విజయవాడ
(సిద్దుబల్ల రాజేంద్రప్రసాద్, విలేకరి, పూర్ణానందంపేట)

కుటుంబానికి ఆసరా దొరికింది



నేను, నా భర్త సుధాకర్‌తో కలిసి కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు సునీల్‌శర్మ పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడు. మాది ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం చినమనగుండం. కూలినాలి చేసుకుని బతుకుతున్న తరుణంలో 2018లో నా భర్త ఆరోగ్యం దెబ్బతిన్నది. ఆస్పత్రిలో చూపిస్తే కిడ్నీ పాడైందని డాక్టర్లు చెప్పారు. ఈ సమస్య నుంచి ఎలా గట్టెక్కాలని దిగులుపడిన తరుణంలో 2019లో ముఖ్యమంత్రి జగనన్న కిడ్నీ బాధితులకు బాసటగా నిలిచారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కిడ్నీ ఆపరేషన్ చేయించారు. ప్రతి నెలా పింఛన్ రూ.5 వేలు మంజూరు చేశారు. పెద్ద కుమారుడికి దివ్యాంగ పింఛన్ రూ.3 వేలు ఇస్తున్నారు. నాకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 అందుతోంది. వైఎస్సార్ ఆసరా పథకం వర్తించింది. మా అమ్మాయికి వివాహం చేశాను. చిన్నబ్బాయి అనిల్‌వర్మకు ఏటా అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందింది. ఈ రోజు మా జీవితం బాగుండటానికి కారణమైన ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– కందుల ఎలీశమ్మ, చినమనగుండం
(నాగం వెంకటేశ్వర్లు, విలేకరి, కొనకనమిట్ల)

ఉత్తరాంధ్రలో ఆగ్రహ జ్వాలలు

రాష్ట్ర వ్యాప్తంగా కూటమిలో ప్రకంపనలు

- కార్యకర్తల సమావేశంలో భావోద్వేగానికి గురైన బండారు
- లాబీయింగ్‌కే టికెట్ అంటూ కిమిడి నాగార్జున కంటతడి
- గిరిజనులంటే చంద్రబాబుకు చిన్నచూపన్న గిడ్డి ఈశ్వరి
- అవినీతి గంటాకు భీమిలి టికెట్ ఇచ్చారని కోరాడ ధ్వజం
- కామవరపుకోటలో తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ
- టీడీపీ నమ్మకద్రోహంపై మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆవేదన



కామవరపుకోటలో కొట్లాడుకుంటున్న టీడీపీ శ్రేణులు



నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి మణికుమారి తదితరులు

పరవాడ/చీపురుపల్లి/పాడేరు/కామవరపుకోట/తిరుపతి తుడా: విపక్ష కూటమిలో ఏర్పడిన నిరసన జ్వాలలు రాష్ట్రవ్యాప్తంగా ఎగిసిపడుతూనే ఉన్నాయి. ఐదేళ్లపాటు డబ్బు ఖర్చు చేయించి తీరా టికెట్ కేటాయింపు వంతు వచ్చేసరికి డబ్బు మూటలతో దిగి, లాబియింగ్ చేసినవారికే కూటమిలో టికెట్ కేటాయిస్తున్నారంటూ టీడీపీపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారాలు చేస్తూ ఇంట్లో కూర్చున్నవారికి టికెట్ ఇస్తున్నారని, కనీసం పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు టికెట్‌లు కేటాయిస్తున్నారని తూర్పారబడుతున్నారు. టీడీపీ తనకు తీరని అన్యాయం చేసిందని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి భావోద్వేగానికి లోనయ్యారు. వెన్నలపాలెంలో బండారు స్వగృహంలో శనివారం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ తాను ఏ పాపం చేశానని టికెట్ కేటాయించలేదని ప్రశ్నించారు. కార్యకర్తల నిర్ణయం మేరకే తన భవిష్యత్తు ప్రయాణం ఉంటుందని చెప్పారు. నమ్మిన కార్యకర్తలకు అన్యాయం జరిగితే అండగా నిలుస్తానని బండారు వారికి హామీ ఇచ్చారు. దీంతో కార్యకర్తలు స్పందిస్తూ మీ బాటలోనే మేం కూడా నడుస్తామని స్పష్టం చేశారు. ఐదేళ్ల పాటూ



మాజీ మంత్రి బండారు



కిమిడి నాగార్జున

పార్టీకి దూరంగా ఉంటూ లాబీయింగ్ చేసుకుంటే టికెట్లు వచ్చే పరిస్థితి టీడీపీలో ఉన్నదని విజయనగరం జిల్లా చీపురుపల్లి టీడీపీ నాయకుడు కిమిడి నాగార్జున కంటతడి పెట్టుకున్నారు. చదువుకున్నప్పుడు రాజకీయాల్లోకి రావాలనుకున్నా గానీ.. వచ్చాక తెలిసింది నమ్మించి గొంతు కోస్తారని, యువత రాజకీయాల్లోకి రావద్దని, పొరపాటున వస్తే జీవితాలను చంద్రబాబు చిదిమేస్తారని విమర్శించారు. ఆయన ఇంటి ముందు టీడీపీ భవిష్యత్‌కు గ్యారెంటీ, సూపర్ సిక్స్ కరపత్రాలను పార్టీ కార్యకర్తలు తగలబెట్టారు.

చెడు సంప్రదాయాలకు టీడీపీ తెరతీసింది: కోరాడ రాజబాబు ధ్వజం

చంద్రబాబు చెడు సంప్రదాయానికి తెరతీసి అవినీతి అనకొండ గంటా శ్రీనివాసరావుకు భీమిలి టికెట్ ఇచ్చారని కోరాడ రాజబాబు ధ్వజమెత్తారు. శనివారం ఆనందపురంలోని తన నివాసంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీని పట్టించుకోకుండా వ్యాపారాలు చేసుకున్న గంటాకు టికెట్ ఇవ్వడం ఏమి సంప్రదాయమని ప్రశ్నించారు. వేలంలో టికెట్లు అమ్ముకోవాలనుకుంటే చంద్రబాబు ఒక రేటు పెడితే తాను కూడా టికెట్ కొనుక్కునేవాడినన్నారు. మూడు రోజుల్లో భవిష్యత్తు కార్యాచరణ తెలియచేస్తానన్నారు. పాడేరు టీడీపీ అభ్యర్థి కిల్లు వెంకట రమేష్‌నాయుడు ఓటమే ధ్యేయంగా పనిచేస్తామని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి స్పష్టం చేశారు. మూడు నెలల క్రితం పార్టీ కండువా కప్పుకున్న వ్యక్తికి టికెట్ ఎలా కేటాయిస్తారని గిడ్డి ఈశ్వరి ప్రశ్నించారు. గిరిజనులంటే చంద్రబాబుకు ఎందుకంత చిన్న చూపని ప్రశ్నించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు పాడేరు, కొయ్యూరులో చంద్రబాబు ఫ్లెక్సీలు, కరపత్రాలకు నిప్పంటించి నిరసన తెలిపాయి. మాజీ మంత్రి మణికుమారి డబ్బులు కోసం ప్రస్తావిస్తూ తన అభ్యర్థిత్వాన్ని ఈ ఎన్నికల్లో పరిశీలించాలని టీడీపీ పెద్దలను కోరానని, అయితే డబ్బు ఎంత ఖర్చు పెట్టగలవు అన్ని ప్రశ్నిస్తే డబ్బుతో తూగలేక ఈసారికి డ్రాప్ అవుతానని చెప్పానన్నారు.

కె.కోటలో కుమ్ములాటలు

ఏలూరు జిల్లా కామవరపుకోట మండలంలో టీడీపీ నాయకుల మధ్య వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. చింతలపూడి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ మండలంలో ఆ పార్టీ కార్యాలయ ప్రారంభానికి వచ్చిన సందర్భంగా గంటా మురళికి పార్టీలోని మరో వర్గానికి మధ్య వివాదం వచ్చింది. అప్పటికే రగిలిపోతున్న ఆ వర్గం గంటా మురళిపై దాడి చేసే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. గతంలో ఇక్కడ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కొత్తూరులో ఏర్పాటుచేసిన టీడీపీ జిల్లా నాయకుల సమావేశంలోనూ ఈ రెండు వర్గాలూ ఇదేవిధంగా కొట్లాటకు దిగాయి. పొత్తులో భాగంగా తిరుపతి ఎమ్మెల్యే స్థానాన్ని జనసేనకు, తిరుపతి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కట్టబెట్టడంతో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విలేఖరుల సమావేశంలో కంటతడి పెట్టుకున్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి బయటకు తోసేసిన వ్యక్తులను కూటమి అభ్యర్థులుగా ప్రకటించడాన్ని తప్పుబడుతూ ఆమె తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబు టీడీపీ నాయకుల తన గొంతుగోశారని ఆవేదన వ్యక్తం చేశారు.

అవ్వాతాతలపై బాబు పగ..

- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ముసుగులో చంద్రబాబు కుట్ర
- నిజానికి ఇది ఆయన జేబు సంస్థ
- దీనికి బాబు నమ్మినబంటు.. రాష్ట్ర ప్రధాన ఎన్నికల మాజీ అధికారి నిమ్మగడ్డ నేతృత్వం
- ఈయన ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి వలంటీర్లపై వరుస ఫిర్యాదులు



సాక్షి, అమరావతి : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో క్షేత్రస్థాయిలో ఎలాంటి పైరవీలు, లంచాలకు తావులేకుండా.. కుల, మత, ప్రాంత, వర్గాలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ సంక్షేమ పథకాలను ఠంఛనుగా అందజేయడంలో కీలకంగా ఉన్న వలంటీర్లపై చంద్రబాబు నేతృత్వంలోని ఎల్లో గ్యాంగ్ చివరకు తన పగ సాధించింది. అవ్వాతాతలకు ఏ కష్టం లేకుండా నెలనెలా ఒకటో తారీఖు పొద్దున్నే తలుపుకొట్టి మరీ పింఛన్లు అందజేస్తున్న ఈ వలంటీర్లపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మొదటినుంచీ రకరకాల వివాదాస్పద ఆరోపణలు చేస్తూ తమ అక్కసును, ఆక్రోశాన్ని వెళ్లగక్కుతూ వచ్చారు. ఇప్పుడు ఎన్నికల వేళ అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితర దాదాపు 66.40 లక్షల మంది లబ్ధిదారులను మళ్లీ టీడీపీ పాలనలో మాదిరిగా ఇబ్బందులకు గురిచేయడానికే చంద్రబాబు బరితెగించారు. ఇందుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థను పావుగా వాడుకున్నారు.

చంద్రబాబు సేవలోనే తరిస్తున్న నిమ్మగడ్డ..

నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఐఏఎస్ అధికారి అయినప్పటికీ.. ఆయన పూర్తిగా చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే మొదటి నుంచీ పనిచేసిన వ్యక్తి. స్థానిక సంస్థల నిర్వహణలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆయనపై ఆరోపణలు వెల్లువెత్తాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే నిమ్మగడ్డను రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా సిఫార్సు చేశారు. వాస్తవానికి.. 2018లో రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసినా.. 2019 సాధారణ ఎన్నికల ముందు ఆ ఎన్నికలు జరిగితే నాటి చంద్రబాబు ప్రభుత్వానికి రాజకీయ ఇబ్బందులు తలెత్తుతాయని భావించి నిబంధనలకు విరుద్ధంగా కోర్టు సాకుల పేరుతో సార్వత్రిక ఎన్నికలు ముగిసేవరకు సర్పంచి ఎన్నికలు జరగకుండా నిమ్మగడ్డ అడ్డుకున్నారు. ఇక జగన్ సీఎం అయ్యాక కూడా.. 2020 ఆరంభంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వానికి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ హోదాలో నిమ్మగడ్డ కరోనా పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలను అర్థంతరంగా వాయిదా వేశారు. అప్పట్లో ఈ నిర్ణయం కూడా తీవ్ర వివాదాస్పదమైంది.

వలంటీర్లపై సుప్రీంకోర్టులోనూ నిమ్మగడ్డ కేసులు..

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పదవీ విరమణ చేసిన తర్వాత తన పూర్తి సమయాన్ని ఆయన తన బాస్ చంద్రబాబుకే కేటాయించారు. ప్రస్తుత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన నేతృత్వంలో పలువురు ద్వారా చంద్రబాబు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థను ఏర్పాటుచేసి, ఆ సంస్థ ద్వారా వలంటీర్ల వ్యవస్థపై పెద్దఎత్తున ఫిర్యాదులు చేస్తూ కోర్టులోనూ కేసులు దాఖలు చేయించారు. వలంటీర్ల వ్యవస్థ చెల్లుబాటునే ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో కేసు నమోదు చేసి, ఆ తర్వాత తనంతట తానుగా ఆ కేసును ఉపసంహరించుకున్నారని అధికారులు చెప్పారు. ఆ తర్వాత వలంటీర్లకు వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టులోనూ కేసు దాఖలు చేశారని, రాష్ట్ర హైకోర్టులోనూ కేసులు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే.. ఈ ఏడాది ఫిబ్రవరి 23, 25 తేదీల్లో వరుసగా రెండుసార్లు వలంటీర్లపై కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఫిర్యాదు చేసింది.

బాబు జేబు సంస్థ ముసుగులో..

తన జేబు సంస్థ అయిన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థను చంద్రబాబు కొద్దిరోజుల ముందే ఏర్పాటు చేయించారు. దీని ముసుగులో చంద్రబాబు తన కుట్రలకు ఎప్పటినుంచో పదును పెట్టారు. ఎన్నికల సమయంలో ఈ వలంటీర్లను ఎలాగైనా విధుల నుంచి దూరం పెట్టాలని పచ్చ బ్యాచ్ కుట్ర పన్నింది. ఇందులో భాగంగా.. తన నమ్మినబంటు.. రాష్ట్ర ప్రధాన ఎన్నికల మాజీ అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఈ సంస్థకు నేతృత్వం వహించి బాబు డైరెక్షన్‌లో కేంద్ర ఎన్నికల సంఘానికి మొన్న ఫిబ్రవరి నుంచి అదే పనిగా వలంటీర్ల వ్యవస్థపై ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ఎలాంటి నగదు పంపిణీ చేపట్టవద్దంటూ ప్రభుత్వానికి తాజాగా ఆదేశాలు జారీచేసింది. ఈ విషయం ఈసీ కూడా తన ఉత్తర్వులో స్పష్టంగా పేర్కొంది.

నరకప్రాయమైన ఆ రోజులు మళ్లీ..


చంద్రబాబు బ్యాచ్ కుట్రలతో అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితర దాదాపు 66.40 లక్షల మంది లబ్ధిదారులు మళ్లీ రోడ్డున పడనున్నారు. అప్పట్లో చంద్రబాబు పాలనలో వీళ్లు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అవి మళ్లీ పునరావృతం కానున్నాయి. ఆ రోజుల్లో పింఛన్ల కోసం బ్యాంకులకు వెళ్తే చాంతాడంత క్యూలు.. మండే ఎండల్లో తిండి లేకుండా నిరీక్షణ.. ఈలోపు సమయం మించిపోతే మళ్లీ బ్యాంకుల నుంచి ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి. కానీ, 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వీరి కష్టాలన్నింటికీ మంగళం పాడుతూ వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఇది ఎప్పటికైనా తన పుట్టి ముంచుతుందని చంద్రబాబు గ్రహించి సందర్భం వచ్చినప్పుడల్లా వలంటీర్లపై తన అక్కసు వెళ్లగక్కేవారు.

రూ.లక్షల్లో లాయర్లకు ఫీజులు..

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ద్వారా వలంటీర్లపై మొత్తం కథ నడిపించిన చంద్రబాబు ఇందుకు లాయర్ల ఫీజుల నిమిత్తం రూ.లక్షల్లో వెచ్చించారు. సుప్రీంకోర్టులో ఇందుకు సంబంధించిన కేసులు వాదించేందుకు ఖరీదైన లాయర్లను వినియోగించారు. నిజానికి.. అంత పెద్ద లాయర్లను భరించడం ఈ సంస్థవల్ల కాదు కాబట్టి చంద్రబాబే వెనుకనుండి ఇదంతా నడిపిస్తున్నారు. ఇక ఈ కేసులను కపిల్ సిబాల్, సిద్ధార్థ దవే., పీబీ సురేష్ వంటి సీనియర్ లాయర్లు వాదిస్తున్నారు. వీళ్ల ఫీజులు రోజుకు రూ.లక్షల్లో ఉంటుందన్నది తెలిసిందే.

వలంటీర్లపై ఈసీ నిర్ణయం దురదృష్టకరం

- ఎన్నికల కమిషన్ తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి
- సీఎం వైఎస్ జగన్‌పై కక్షతో పేదల్ని ఇబ్బంది పెట్టేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం



సాక్షి, అమరావతి/సత్తెనపల్లి: వలంటీర్లపై ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం వల్ల పెన్షన్ తీసుకునే అవ్వాతాతలు, వికలాంగులు తీవ్రంగా ఇబ్బంది పడతారని, ఈసీ నిర్ణయం దురదృష్టకరమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఈసీ నిర్ణయంపై శనివారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కక్షతో పేదలను ఇబ్బంది పెట్టేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వలంటీర్లపై చంద్రబాబు, పవన్ అనేక పర్యాయాలు అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఇప్పుడు ఏకంగా నిమ్మగడ్డ రమేష్‌కుమార్ సాయంతో ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేయించారన్నారు. వారి ఒత్తిడికి తలొగ్గి వలంటీర్లను సంక్షేమ పథకాలు పంపిణీ చేయకుండా ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. కుట్రలతో చంద్రబాబు వలంటీర్లను బలి చేయాలనుకున్నారన్నారు. చంద్రబాబు తీరుతో రాష్ట్రంలో బలౌతున్నది వలంటీర్లు కాదని, అవ్వాతాతలు, వికలాంగులు, సంక్షేమ పథకాలు తీసుకుంటున్న లబ్ధిదారులని మంత్రి అన్నారు. ఇప్పటికైనా ఈసీ తన నిర్ణయాన్ని పునరాలోచన చేసి వృద్ధులు, వికలాంగులకు అవస్థలు లేకుండా చూడాలని కోరారు.

చంద్రబాబుకు బుర్రదొబ్బింది

అత్యంత ఖరీదైన నేటి రాజకీయ పరిస్థితుల్లో సామాన్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టికెట్లు ఇస్తున్న చాణక్యతను, ఎత్తుగడలను అర్థం చేసుకోలేక చంద్రబాబుకు బుర్ర దొబ్బిందని మంత్రి రాంబాబు ఎద్దేవా చేశారు. విద్యావంతుడు, దళితుడు, టిప్పర్ డ్రైవర్‌గా జీవనం వెళ్లదీస్తున్న వీరాంజనేయులుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వడంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. చంద్రబాబు డబ్బున్న కోటీశ్వరులకు, ఎన్నారైలకు, సంపన్నులకు టికెట్లు ఇస్తుండగా.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత సామాన్యులకు టికెట్లు ఇస్తూ సరికొత్త సంప్రదాయాన్ని తీసుకొస్తున్న వీరుడన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన మోసగాడని విమర్శించారు.

వృద్ధులు, వికలాంగులకు తీరని ద్రోహం: కారుమూరి



వలంటీర్ల విధులు నిర్వహించకుండా జిత్తుల మారిన నక్కలా చంద్రబాబు అడ్డుకుని వృద్ధులు, వికలాంగులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు తీరని ద్రోహం చేస్తున్నారని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. ఈసీ నిర్ణయంపై స్పందిస్తూ.. నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాయించి వలంటీర్ల సేవలు నిలిపి వేయించిన నీచుడు చంద్రబాబు అన్నారు. ప్రజలకు మేలు చేసే ఏ కార్యక్రమమైనా చంద్రబాబుకు ద్వేషమే అన్నారు. ఎవరైనా ఏడుస్తుంటే చంద్రబాబు ఆనందిస్తాడని, ప్రజలు సంతోషంగా ఉంటే చంద్రబాబు ఏడుస్తాడని అన్నారు. వలంటీర్లు రాకపోవడంతో ఎండల్లో గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి పెన్షన్ తీసుకునే అవ్వాతాతలు సొమ్మసిల్లి పడిపోతే చంద్రబాబుకు సంతోషమని మండిపడ్డారు. చంద్రబాబు, ఆయన తోక పార్టీలకు ఏనాడూ వలంటీర్లంటే ఇష్టం లేదని, వారిపై కక్షగట్టి విధులికపడ్డుకుని ప్రజలకు ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

'నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌తో ఫిర్యాదు చేయించడం దుర్మార్గం'



పెన్షన్ పంపిణీపై నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌తో చంద్రబాబు ఫిర్యాదు చేయించడం దుర్మార్గమని, చంద్రబాబు పెత్తందారీ పోకడలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టు ఇప్పుడు జరుగుతున్నది పేదలు, పెత్తందార్ల మధ్య యుద్ధమేనన్నారు. పేదలకు అందించే పెన్షన్లు నిలుపుదల చేయడం చాలా దారుణమన్నారు. మేధావుల ముసుగులో 64 లక్షల మంది పెన్షనర్ల నోట్లో మట్టికొట్టారన్నారు. నిమ్మగడ్డ రమేష్‌తో పాటు మరికొందరు చంద్రబాబు ఏజెంట్లుగా, తొత్తులుగా మారారన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే పెన్షన్లు ఇవ్వొద్దని చెప్పించారన్నారు. దీనికి టీడీపీ కచ్చితంగా బాధ్యత తీసుకోవాల్సిందేనని అన్నారు. చంద్రబాబు పాలనలో మూడు రోజులు క్యూలో నిలబడితేనే పెన్షన్లు వచ్చేవి కాదని, జగన్ పాలనలో ఇప్పుడు నేరుగా ఇంటికే అందిస్తున్నా చంద్రబాబు అండ్ కో కుట్రలు చేస్తున్నారన్నారు. వృద్ధుల ఉసురు బాబుకు కచ్చితంగా తగులుతుందన్నారు. పెన్షన్ల పంపిణీ అంశంపై ఎన్నికల కమిషన్ పునరాలోచించుకోవాలన్నారు.

వృద్ధుల్ని కష్టపెడతారా: వాసిరెడ్డి పద్మ



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటిగడప వద్దకే చేరుస్తున్న వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు, ఆయన బ్యాచ్ మొదటినుంచీ కుట్రలు చేస్తున్నారని, చివరకు ప్రజలకు సంక్షేమం అందకుండా చేయడానికి కూడా వెనుకాడలేదని వైఎస్సార్‌సీపీ మహిళా నేత వాసిరెడ్డి పద్మ మండిపడ్డారు. నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఫిర్యాదుతో సంక్షేమ పథకాల పంపిణీలో వలంటీర్లను ఉపయోగించవద్దంటూ శనివారం ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వడంపై వాసిరెడ్డి పద్మ స్పందించారు. ఇంట్లో మగాళ్లు లేనప్పుడు వలంటీర్లు వచ్చి తలుపులు కొడతారని, వలంటీర్లు మీ ఇంటికి వస్తే తరిమేయాలని చంద్రబాబు గతంలో అనేక మాటలు అన్నారన్నారు. చంద్రబాబు ,పవన్ , పచ్చ మీడియా కలిసి మొత్తం వలంటీర్ల వ్యవస్థనే తుంచేసే కుట్రలు చేశారన్నారు. ఎన్నికల కమిషన్ సైతం ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకోకుండా ఇటువంటి నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు.

'వలంటీర్లపై ఫిర్యాదు చేయడానికి సిగ్గులేదా'



చంద్రబాబు ప్రయోజనాల కోసం పనిచేస్తున్న కొంతమంది మేధావుల ముసుగులో వలంటీర్లపై కుట్రలు చేస్తున్నారని శాసనమండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. వలంటీర్లు జీతాలు కోసం కాకుండా సేవా దృక్పథంతో పనిచేస్తున్నారన్నారు. చంద్రబాబు సహా ప్రతిపక్ష నాయకులంతా వలంటీర్లపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థల ముసుగులో కుహనా మేధావులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు ఇవ్వడానికి వీలు లేదంటూ వలంటీర్లపై కంప్లైంట్స్ చేయటం దారుణమన్నారు. చంద్రబాబు ప్రయోజనాలను కాపాడటం కోసం నిమ్మగడ్డ రమేష్ పనిచేస్తున్నారన్నారు. పేదల కోసం పని చేసే వలంటీర్లపై ఫిర్యాదు చేయటానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు.

ప్రజల్ని ఇబ్బంది పెట్టడమే: ఎమ్మెల్యే కన్నబాబు



వలంటీర్లను నియంత్రించేందుకు చంద్రబాబు అండ్‌కో చేసిన ప్రయత్నాలు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. వలంటీర్లు ప్రజలకు గొప్పగా సేవలు అందిస్తున్నారన్నారు. ఈ ఐదేళ్ళ కాలంలో వలంటీర్లు లాంటి వ్యవస్థ పెట్టడానికి వేరే రాష్ట్రం ధైర్యం చేయలేకపోయిందన్నారు. ప్రజలకు గొప్ప సేవలందించే వలంటీర్లను నియంత్రించాలని చంద్రబాబు కుట్రలు చేస్తున్నాడన్నారు. సందర్భం వచ్చినప్పుడల్లా చంద్రబాబు, పవన్ వలంటీర్లపై దుర్మార్గమైన కామెంట్లు చేశారన్నారు. తాజాగా ఎన్నికల కమిషన్‌కు నిమ్మగడ్డ ద్వారా వలంటీర్లపై పిర్యాదు చేశారు. ఈ రెండు నెలలు పెన్షన్లు అందకుండా చేశామని చంద్రబాబు పండుగ చేసుకుంటున్నాడన్నారు. వలంటీర్లను నియంత్రిస్తే వైఎస్సార్‌సీపీని నియంత్రించామని అనుకోవడం చంద్రబాబు భ్రమ అన్నారు.

పెన్షన్ల పంపిణీకి వలంటీర్లు దూరం

- టీడీపీ అనుబంధ సంస్థ ఫిర్యాదు ఫలితం.. అన్ని సంక్షేమ పథకాలకు వారిని దూరంగా పెట్టండి
- వాటి అమలుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసుకోండి
- వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు ఇతర పరికరాలనూ స్వాధీనం చేసుకోండి
- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఫిర్యాదుల మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెన్షన్లతో సహా ఇతర అన్ని సంక్షేమ పథకాల నగదు పంపిణీ విధుల నుంచి వలంటీర్లను దూరంగా ఉంచాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఆదేశాలను జారీచేసింది. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ పదేపదే చేసిన ఫిర్యాదులకు తోడు.. అదే సంస్థ హైకోర్టులో వేసిన కేసు, వలంటీర్లకు వ్యతిరేకంగా పదేపదే వివిధ దినపత్రికల్లో వస్తున్న కథనాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఆదేశాలను జారీచేస్తున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొంది. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి సంక్షేమ పథకం కిందైనా నేరుగా నగదును ఇచ్చే విధుల నుంచి వలంటీర్లను తొలగించాలని స్పష్టంచేసింది. అదే విధంగా వలంటీర్లకు ఇచ్చిన సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు వంటి ఇతర పరికరాలన్నింటినీ కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పూర్తయ్యే వరకు డీఈఓకి అప్పజెప్పాల్సిందిగా ఆదేశించింది. ఇక పెన్షన్లు వంటి సంక్షేమ పథకాల నగదు పంపిణీ కోసం రెగ్యులర్ ఉద్యోగుల ద్వారా ఇప్పటికే రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలకు వినియోగిస్తున్న ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) వంటి ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్నికల సంఘం కోరింది.

ప్రభుత్వ ఉద్యోగుల ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ బకాయిల చెల్లింపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వం గత జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో మార్చి 31 నాటికి ఉద్యోగుల ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం బకాయిలను శుక్ర, శనివారాల్లో ఉద్యోగుల అకౌంట్లకు జమ చేసింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మిగిలిన బకాయిలు కూడా గత సమావేశంలో చెప్పిన షెడ్యూల్ ప్రకారం చెల్లిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

• తెలంగాణ

'కూల్చివేత'పై కుతకుత!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుందన్న వ్యాఖ్యలు మరోసారి దుమారం రేపాయి. బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేయాలని చూస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదానికి 48 గంటలు చాలంటూ బీజేఎల్పీ నేత మహేశ్వరరెడ్డి వ్యాఖ్యానించడంతో వివాదం మొదలైంది. ఆయన ఆరుగురు మంత్రులు బీజేపీతో టచ్‌లో ఉన్నారనడం.. మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే తరహాలో ఇక్కడ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యవహరించేందుకు సిద్ధమయ్యారనడం.. కోమటిరెడ్డి కేంద్ర మంత్రులు గడ్కరీ, అమిత్ షాలను కలసి ఈ విషయం చెప్పారనడం కలకలం రేపింది. గతంలో బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పడుతుందంటూ చేసిన వ్యాఖ్యలు మళ్లీ తెరపైకి వచ్చాయి. బీఆర్ఎస్ టార్గెట్‌గా కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ చేపడితే.. అదే సమయంలో అధికార పార్టీ నేతలను బీజేపీ టచ్‌లోకి తెచ్చుకుంటోందంటూ ప్రచారం మొదలైంది.

ఈడీ ప్రాథమిక జప్తు ఉత్తర్వులు కొట్టివేత

'అగ్రిగోల్డ్' కేసులో దర్యాప్తు కొనసాగించుకోవచ్చని హైకోర్టు స్పష్టీకరణ

- డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ఉద్దేశాలకు విఘాతం కలిగించేలా.. వారికి నష్టం చేకూర్చేలా ఈడీ ఉత్తర్వులు
- కానీ, సీఐడీ ఉత్తర్వులు డిపాజిటర్ల ప్రయోజనాలు పరిరక్షించేలా ఉన్నాయి
- ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వాదనను సమర్థించిన న్యాయస్థానం
- అన్ని విషయాలను ప్రత్యేక కోర్టు ముందే తేల్చుకోవాలని ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అగ్రిగోల్డ్ కుంభకోణం కేసులో ఆ సంస్థ ఆస్తులను ఆంధ్రప్రదేశ్ సీఐడీ జప్తు చేసి ఉండగా, తిరిగి అవే ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా జప్తుచేయడాన్ని రాష్ట్ర హైకోర్టు తప్పుబట్టింది. ఈడీ జారీచేసిన ప్రాథమిక జప్తు ఉత్తర్వులు ఏపీ డిపాజిటర్ల పరిరక్షణ చట్ట ఉద్దేశాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని.. పైగా డిపాజిటర్లకు కష్టం కలిగించేలా కూడా ఉన్నాయని స్పష్టంచేసింది. అందువల్ల ఈడీ ఉత్తర్వులను కొట్టేస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. అదే సమయంలో సీఐడీ జప్తు ఉత్తర్వులు డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించేలా ఉన్నాయని తేల్చిచెప్పింది. అలాగే.. 'డిపాజిటర్లందరూ ప్రధానంగా ఏపీకి చెందిన వారే. జప్తు ఆస్తులు కూడా ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. తమ కష్టార్జితాన్ని వారు డిపాజిట్ల రూపంలో కంపెనీలో పెట్టారు. తాము చెల్లించిన ఈ డిపాజిట్ల మొత్తాన్ని తిరిగి రాబట్టుకునేందుకు మనీలాండరింగ్ చట్టం కింద అడ్జుడికేటింగ్ అథారిటీ వద్దకు వెళ్లి తేల్చుకోవడం డిపాజిటర్లకు చాలా అసౌకర్యంగా ఉంటుంది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద ఏర్పాటైన ఏలూరులోని ప్రత్యేక కోర్టే ఈ మొత్తం వ్యవహారాన్ని తేల్చడం డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించినట్లవుతుంది. అందువల్ల ఈడీ జారీచేసిన ప్రాథమిక జప్తు ఉత్తర్వులను కొట్టేస్తున్నాం'.. అని న్యాయస్థానం పేర్కొంది. అంతేకాక.. అగ్రిగోల్డ్ ఆస్తులను సీఐడీ జప్తుచేయడాన్ని ప్రత్యేక న్యాయస్థానం కూడా సమర్థిస్తూ ఉత్తర్వులు జారీచేసిందన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను హైకోర్టు సమర్థించింది. డిపాజిటర్లను మోసంచేసి కూడబెట్టిన భారీ ఆస్తులను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాలను తిరిగి డిపాజిటర్లకు చెల్లించడమే డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ముఖ్యోద్దేశమన్న ప్రభుత్వ వాదనతో కూడా ఏకీభవించింది. అగ్రిగోల్డ్ కుంభకోణంపై దర్యాప్తు కొనసాగించుకోవచ్చని ఈడీకి హైకోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ఇటీవల తీర్పునిచ్చారు.

ఈడీ జప్తు ఉత్తర్వులపై పిటిషన్లు..

మరోవైపు.. అగ్రిగోల్డ్ నుంచి కొనుగోలు చేసిన తమ ఆస్తులను జప్తుచేస్తూ ఈడీ తాత్కాలిక జప్తు ఉత్తర్వులను సవాలుచేస్తూ ఆలిండియా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బ్యాంకులు నిర్వహించిన వేలంలో కొనుగోలు చేసిన వారూ అగ్రిగోల్డ్ ఆస్తులను ఈడీ జప్తుచేయడాన్ని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. అసలు అగ్రిగోల్డ్ కుంభకోణానికి ముందే అగ్రిగోల్డ్ కంపెనీ నుంచి తాము కొన్న భూముల్లో నిర్మించుకున్న అపార్ట్‌మెంట్లను సైతం జప్తు చేయడాన్ని సవాలు చేస్తూ ఆయా ఫ్లాట్ల యజమానులు కూడా పిటిషన్లు దాఖలు చేశారు. రుణం ఇచ్చాం కాబట్టి, ఆస్తులను వేలంవేసే హక్కు తమకుందంటూ బ్యాంకులు సైతం కొన్ని పిటిషన్లు దాఖలు చేశాయి. సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్, ఈడీ తరఫున సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్ జోస్యుల భాస్కరరావు, పిటిషనర్ల తరఫున పీఎస్‌పీ సురేష్‌కుమార్, పూజారి నరహరి, సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్‌లు వాదనలు వినిపించారు. అందరి వాదనలు విన్న కోర్టు గతేడాది ఆగస్టులో తీర్పు రిజర్వ్ చేశారు. ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ రవి ఈ వ్యాజ్యాలన్నింటిపై తన తీర్పును వెలువరించారు.

ఆస్తి జప్తు ద్వారా చట్టం ఉద్దేశం నెరవేరదు..

'జప్తు చేసిన ఆస్తుల విక్రయం ద్వారా వచ్చిన మొత్తాలను డిపాజిటర్లందరికీ సమానంగా పంచే అధికారాన్ని ప్రత్యేక కోర్టుకు డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కల్పిస్తోంది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టంలోని సెక్షన్–6లో ఉన్న ఏ నిబంధన కూడా మనీలాండరింగ్ చట్టం సెక్షన్–5లో లేదు. జప్తుచేసిన ఆస్తుల విక్రయం ద్వారా వచ్చిన మొత్తాలను డిపాజిటర్లకు సమానంగా పంపిణీ చేయాలన్న నిబంధన ఏదీ కూడా మనీలాండరింగ్ చట్టంలో లేదు. ఈ విషయంలో అడ్వొకేట్ జనరల్ వాదనతో ఈ కోర్టు ఏకీభవిస్తోంది. కేవలం ఆస్తి జప్తు చేయడం ద్వారా చట్టం ఉద్దేశం నెరవేరదు. ఆస్తి జప్తు బాధితులను రక్షించలేదు. ఈ కారణాలరీత్యా 2015లో సీఐడీ జప్తుచేసిన ఆస్తులను తిరిగి 2020లో ఈడీ జప్తుచేస్తూ జారీచేసిన ప్రాథమిక ఉత్తర్వులను కొట్టేస్తున్నా'.. అని జస్టిస్ రవి తన తీర్పులో పేర్కొన్నారు. ఆస్తుల జప్తునకు సంబంధించిన అన్నీ అంశాలను ఏలూరులోని ప్రత్యేక కోర్టు ముందే తేల్చుకోవాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

బీజేపీకి ఓటేస్తే ఒరిగేది ఏముంది?

- ప్రజాగళం సభలో చంద్రబాబు వ్యాఖ్యలు
- పథకాలను వైఎస్ జగన్ అందరికీ సమానంగా ఇచ్చారు
- కర్నూలు ప్రజలు నీళ్ల లేక స్నానాలు చేయడం లేదు..
- పెళ్లిళ్లు చేసుకోవడం లేదు



జనం లేక వెలవెలబోతున్న ప్రొద్దుటూరు 'ప్రజాగళం'.



మాట్లాడుతున్న చంద్రబాబు


సాక్షి, తిరుపతి/ప్రొద్దుటూరు/సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): 'బీజేపీకి ఓటేస్తే.. వాళ్ల వల్ల ఒరిగేది ఏముంది' అని శ్రీకాళహస్తి సభలో చంద్రబాబునాయుడు అన్నారు. తిరుపతి నుంచి బీజేపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న వరప్రసాద్‌కు ఓటేయాలని చెబుతూ ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో పొత్తు ఉన్నా కూడా చంద్రబాబు ఇలా మాట్లాడటం సభికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆయన మనసులో మాట బయటకు వచ్చేసింది అని కొంతమంది వ్యాఖ్యానించారు. ప్రజాగళం పేరుతో శనివారం ప్రొద్దుటూరు, నాయుడుపేట, శ్రీకాళహస్తిలో నిర్వహించిన సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. వైఎస్ జగన్ పథకాలను అందరికీ సమానంగా ఇచ్చారని, ప్రత్యేకంగా ఎవరినీ చూడలేదని బహిరంగంగా ఒప్పుకున్నారు. కర్నూల్‌లో నీళ్ల లేక స్నానాలు చేయడం లేదన్నారు. పెళ్లిళ్లు చేసుకోవడం మానేశారన్నారు. కాగా, ప్రొద్దుటూరులో సభకు అంతంతమాత్రంగానే వచ్చిన జనం ఎండకు తాళలేక విలవిలలాడారు. ఏకధాటిగా చంద్రబాబు గంటా పది నిమిషాలు మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో నాయుడుపేటకు హెలీకాప్టర్‌లో చేరుకున్న చంద్రబాబు జనం లేకపోవడంతో బసచేసే బస్సులోనే చాలాసేపు ఉండిపోయారు. సభలో బీజేపీ జెండా ఒక్కటీ కనబడలేదు.

మూడో చెవి వింటోంది జాగ్రత్త!

సులభంగా మారిపోయిన ఫోన్ ట్యాపింగ్

- ఎక్కడ కావాలంటే అక్కడ ఎవరి మాటలైనా రికార్డు చేసే టెక్నాలజీ

ఫోన్ ట్యాపింగ్.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ట్యాపింగ్ మాటున కొందరు అధికారులు సాగించిన దందా.. రోజు రోజుకూ వెలుగుచూస్తున్న సంచలన విషయాలు విస్తుగొలుపుతున్నాయి. దీనిపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు.. ఫిర్యాదుల వంటి విషయాలను పక్కనపెడితే.. అసలు ట్యాపింగ్ కథేంటి? దీనిని ఎలా చేస్తారు? ఇద్దరు వ్యక్తులు ప్రైవేటుగా మాట్లాడుకునే మాటలన్నీ మూడో వ్యక్తి ఎలా వినగలుగుతున్నాడు? ఓసారి చూద్దామా?



ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు టెలిఫోన్ లేదా మొబైల్ ఫోన్ లేదా ఇంటర్నెట్ ద్వారా జరిపే సంభాషణలను వారికి తెలియకుండా రహస్యంగా వినడం, రికార్డు చేయడాన్నే ట్యాపింగ్ అంటారు. వాస్తవానికి ట్యాపింగ్ చేయడం చట్టవిరుద్ధం. దేశ భద్రతకు సంబంధించిన అంశాల్లో ట్యాపింగ్ చేయాల్సి వస్తే.. నిర్దేశిత ప్రభుత్వ ఏజెన్సీలు కేంద్ర హోంశాఖ అనుమతి తీసుకోవాలి. ప్రైవేటు వ్యక్తులకు ఎట్టిపరిస్థితుల్లోనూ ట్యాపింగ్ చేయడానికి అనుమతి లేదు. అనుమతి పొందిన ప్రభుత్వ సంస్థలు సైతం ట్యాపింగ్ చేయడానికి బోలెడు నిబంధనలు పాటించాలి. ఎవరి ఫోన్ అయినా గరిష్ఠంగా 180 రోజులు మాత్రమే ట్యాపింగ్ చేయాలి. పైగా ప్రతి 60 రోజులకు ఓసారి తాజాగా అనుమతి తెచ్చుకోవాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో అనుమతి లేకుండా గరిష్ఠంగా 24 గంటలకు మించి ఫోన్ ట్యాపింగ్ చేయడానికి వీల్లేదు. ఒకవేళ సదరు ట్యాపింగ్‌కు కేంద్ర హోంశాఖ అనుమతి నిరాకరిస్తే అప్పటివరకు రికార్డు చేసిన సంభాషణలన్నీ 48 గంటల్లోగా ధ్వంసం చేయాల్సి ఉంటుంది.

ల్యాప్‌టాప్ సైజు పరికరంతోనే అన్నీ..

అక్రమంగా ట్యాపింగ్ చేసేవాళ్లకు పెద్దగా ఎక్విప్‌మెంట్ కూడా అక్కర్లేదు. ఓ ల్యాప్‌టాప్ సైజులో ఉండే సెల్యులర్ ఇంటర్‌సెప్షన్ మెషీన్‌ను కారులో పెట్టుకుంటే చాలు.. ఎవరి ఫోన్ అయినా సులభంగా ట్యాప్ చేసేయొచ్చు. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన వ్యక్తి ఇల్లు లేదా ఆఫీసు వద్ద కారు పార్క్ చేసుకుంటే చాలా అవతలి వ్యక్తి సంభాషణలన్నీ వినొచ్చు.. రికార్డు చేయొచ్చు. ఇందుకోసం ముందుగా ఆ వ్యక్తి ఫోన్ నంబర్‌ను మెషీన్‌లో ఫీడ్ చేయాలి. అనంతరం ఆ వ్యక్తికి ఫోన్ వస్తే.. ఆటోమేటిగ్గా మెషీన్‌లో రికార్డు అయిపోతుంది. సదరు వ్యక్తి గొంతును రికార్డు చేసి మెషీన్‌లో ఫీడ్ చేసినా సరే.. దాని ఆధారంగా ఆ కాల్‌ను మెషీన్ రికార్డు చేస్తుంది.

ట్యాపింగ్‌లో రకాలు..

సెల్యులర్ ఇంటర్‌సెప్టర్లు : వీటిని ఐఎంఎస్ఐ క్యాచర్స్ లేదా స్టింగ్‌రేస్ అని పిలుస్తారు. టవర్ల ద్వారా ప్రసారమయ్యే నిర్దేశిత మొబైల్ సిగ్నల్స్‌ను ఇవి అడ్డుకుంటాయి. అందులోని డేటాను క్యాప్చర్ చేయడమే కాకుండా.. మొబైల్ లొకేషన్ కూడా ట్రాక్ చేస్తాయి. కాల్స్‌తోపాటు ఎస్సెమ్మెస్‌లను సంగ్రహిస్తాయి.

వీఓఐపీ ఇంటర్‌సెప్షన్ సాధనాలు: వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్ (వీఓఐపీ) కమ్యూనికేషన్‌లను సంగ్రహించేందుకు రూపొందించిన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఆధారిత సాధనాలివి. వీఓఐపీ ప్రొటోకాల్స్‌లోని బలహీనతలను ఆసరాగా చేసుకుని ఇంటర్నెట్‌లో ప్రయాణించే డేటా ప్యాకెట్‌లను ఇవి అడ్డుకుని అందులోని డేటాను సంగ్రహిస్తాయి.

క్లోన్డ్ సిమ్ కార్డులు: ట్యాపింగ్ చేయాలనుకున్న వ్యక్తి సిమ్‌కు క్లోన్డ్ సిమ్ సంపాదిస్తే చాలు.. సదరు వ్యక్తి మొబైల్ ఫోన్‌కు వచ్చే కాల్స్ అన్నీ చక్కగా వినొచ్చు.

మానిటరింగ్ సాఫ్ట్‌వేర్: హానికరమైన సాఫ్ట్‌వేర్ లేదా స్పైవేర్‌ను నిర్దేశిత వ్యక్తి మొబైల్ ఫోన్‌లో వారికి తెలియకుండా చొప్పిస్తారు. ఆ ఫోన్ సంభాషణలను రికార్డు చేస్తాయి.

\- సాక్షి సెంట్రల్ డెస్క్



> క్షయమైన ఆహారముకొరకు కష్టపడకుడి గాని నిత్యజీవము కలుగ జేయు అక్షయమైన ఆహారముకొరకే కష్టపడుడి ; మనుష్య కుమారుడు దానిని మీకిచ్చును, ఇందుకై తండ్రియైన దేవుడు ఆయనకు ముద్రవేసియున్నాడు.
>
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** బ.షష్ఠి సా.5.23 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.7.14 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** తె.3.13 నుండి 4.43 వరకు (తెల్లవారితే సోమవారం), **దుర్ముహూర్తం:** సా.4.34 నుండి 5.22 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.11 నుండి 11.46 వరకు

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం : 6.08
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కంగనా రనౌత్ (బాలీవుడ్ స్టార్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రాణిలా బతకటం అంటే ఏమిటి? రాణిలా బతకటం మాత్రం కాదు!

అరిచేతుల్లో, గుండెలమీదా పెరిగే ఆడపిల్లలకు, అంతఃపుర రాణులకు అన్నీ ఉంటాయి. నేలపై పాదం మోపే స్వేచ్ఛే ఉండదు. పాదం మోపే స్వేచ్ఛ ఉన్నప్పుడే కదా అడుగు ముందుకు పడటానికీ, అడుగు వెనక్కు తీసుకోవటానికీ ఉంటుంది.

ఒకటి తెలుసా? అడుగు వెనక్కు తీసుకోవటానికి ఉండే స్వేచ్ఛే ఆడపిల్లను నిజంగా రాణిని చేస్తుంది. ఆమె వేసే వెనకడుగే కొత్త జీవితానికి ఆమె తొలి అడుగు అంటాన్నేను.

మెడిసిన్ చదవాలనుకున్నాం. సైన్స్ స్ట్రీమ్‌లో చేరిపోయాం. కాలేజ్‌లో ఒకట్రెండు క్లాస్‌లకు అటెండ్ కూడా అయ్యాం. ఇంటికి వచ్చాక, అద్దంలో చూసుకున్నప్పుడు మనది మెడిసిన్ చదివే ముఖంలా అనిపించలేదు. మరింత బ్రైట్ గా ఉంది! 'క్వీన్' ముఖంలా, 'సిమ్రాన్' ముఖంలా, 'మణికర్ణిక' ముఖంలా, ఇందిరాగాంధీ ముఖంలా... అమాయకత్వంతో, ఆత్మవిశ్వాసంతో, ప్రతీకారేచ్ఛతో, రాజనీతిజ్ఞతతో వెలిగిపోతూ ఉంది. అప్పుడు



వెనకడుగు వేసే స్వేచ్ఛ లేకపోతే.. ల్యాబ్‌లో చచ్చిన కప్పకు, మనకు ఏం తేడా ఉంటుంది?

మెడిసిన్ బయటికి నా వెనకడుగే... యాక్టింగ్‌లోకి నా ముందడుగు. క్వీన్, సిమ్రాన్, మణికర్ణిక... ఇంకా ఇందిరాగాంధీ పాత్రలు నేను నటించినవి కావు. వారే ఒక్కొక్కరుగా వచ్చి నా పాత్రలో నటించినవి.

ఈ మాత్రం కాన్ఫిడెన్స్ ఉండాలి అమ్మాయిలూ మనకు! మీరు ఏ రంగంలోనైనా ఉండండి... అక్కడి రణరంగంలో మీ ఆయుధం... సెల్ఫ్ కాన్ఫిడెన్స్.

రాజకీయాలు... ఇప్పుడు నేనున్న రంగం. మోదీజీ తర్వాత ఎప్పటికైనా నేను నా దేశానికి ప్రధానమంత్రిని అవుతానన్నది... నాకున్న సెల్ఫ్ కాన్ఫిడెన్స్.

రాజకీయాల్లో కాన్ఫిడెంట్‌గా ఉండాలి. అక్కడ మనల్ని ఒకరు ఒక మాట అన్నప్పటి కంటే... మనం ఒకర్ని ఒక మాట అన్నప్పుడే మనం గట్టిగా నిలబడాలి.

కానీ సుప్రియా శ్రీనేత్ నిలబడలేక పోయారు! సుప్రియ కాంగ్రెస్ లీడర్. అందంగా ఉంటారు. పొగరుగా ఉంటారు. మాటకు మాట అన్నట్లుంటారు. మాటంటే మాటే అన్నట్లుంటారు. బీజేపీ నాకు 'మండీ' లోక్‌సభ టికెట్ ఇవ్వగానే ఆమె... "మండీలో ఇప్పుడు రేటెంత పలుకుతోంది?" అని ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు!

ఆ మాటలోని అర్థం మగాళ్లకు తెలుస్తుంది. సుప్రియ నన్ను ఉద్దేశించే ఆ మాట అన్నారని నాకూ తెలుసు. అందుకు నేనేమీ వ్యథ చెందలేదు. సుప్రియను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, ఢిల్లీ పోలీస్ కమిషనర్, ఎలక్షన్ కమిషన్... అంతా చుట్టుముట్టినప్పుడు... ఆమె తన మాటపై తను నిలబడకుండా... 'ఆ కామెంట్‌ను పోస్ట్ చేసింది నేను కాదు...' అని ఆమె ఆ పోస్టును తొలగించటం కూడా నాకు ఆశ్చర్యాన్ని కలిగించలేదు.

కానీ... పోస్ట్ పెట్టినందుకు క్రమశిక్షణ చర్యగా కాంగ్రెస్ పార్టీ మహరాజ్‌గంజ్ లోక్‌సభ టికెట్‌ను తన నుంచి వాపస్ తీసుకుని, వీరేంద్ర చౌదరికి ఇచ్చినప్పుడు సుప్రియ మౌనంగా ఉండిపోవటం నన్ను తీవ్రమైన అసంతృప్తికి గురి చేసింది. సుప్రియ నాకేం కారు. తనకైనా తనేం కారా!!

ఏం?! మహరాజ్‌గంజ్‌లో ఇంకో మహారాణి లేరా? మగ మహారాజుకే టిక్కెట్ ఇవ్వాలా? ఆ మాట సుప్రియ ఎందుకు తన పార్టీని అడగలేకపోయారు?!

వెనకడుగు వెయ్యటం, మాటను వెనక్కు తీసుకోవటం తల దించుకోవలసిన పనులేమీ కావు. అందుకు శిక్షగా... సమాజం కానీ, పార్టీ అధిష్ఠానం గానీ అపరాధ రుసుమును విధించినప్పుడు నిశ్శబ్దంగా వెళ్లి, కౌంటర్ ముందు నిలబడి రుసుమును చెల్లించి రసీదును తెచ్చుకోవటమే మనల్ని మనం తగ్గించుకునే విషయం.

ఆడవాళ్లు ఎలా ఉండాలి! ఎలాగైనా ఉండొచ్చు, రాణుల్లా, రప్పల్లా మాత్రం కాదు.

పెత్తందారుకు టిప్పర్ సవాల్!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



మన సమాజం వర్గాలుగా విభజితమై ఉన్నమాట ఒక వాస్తవం. కులాలుగా విడిపోయి ఉన్న మాట కూడా నిజం. ఈ కుల–వర్గ వేర్పాటులో కొందరిది ఆధిపత్య స్థానం, మెజారిటీ ప్రజలది అణచివేతకు గురయ్యే స్థానం. అవమానాలను మోసే స్థానం. ఈ విభజన సత్యాన్ని గుర్తించే సాహసం మన రాజకీయ నాయకులు చేస్తే చేయరు. ఆ సత్యం మీద మసిపూసి మాయం చేస్తారు. అందరి క్షేమం తమ ధ్యేయమంటారు. సకల జనుల శ్రేయోరాజ్యం తమ ఆశయమంటారు. సర్వేజనాః సుఖినో భవన్తని ఆశీర్వదిస్తారు. అభివృద్ధి–సంక్షేమం తమకు రెండు కళ్లంటారు. 'పేదల కోసం సంక్షేమం, పెద్దలతోనే అభివృద్ధి' అనే చిత్ర రచన చేస్తారు. పేదలకు తిండి దొరకని పరిస్థితిని ఈ సంక్షేమం అరికట్టగలిగింది. లేబర్ మార్కెట్ నిక్షేపంగా నిలబడేందుకు ఈ సంక్షేమాన్ని మన పాలకులు వెదజల్లుతారు.

ఐదు రూపాయలకే భోజనం పెట్టేంత అపురూపమైన ఔదార్యాన్ని కూడా మన పాలకులు కనబరుస్తుంటారు. అది బాల్యవివాహమైనా సరే ఓ పాతిక వేలు సర్కారీ కట్నం చదివించి మంచి మనసును చాటుకుంటుంటారు. బాల్యవివాహం వల్ల పిల్ల చదువు ఆగిపోయినా లెక్క చేయరు. హిందూ, ముస్లిం, క్రైస్తవులకు ఒక్కో పండుగ చొప్పున ఓ సంచెడు ఉప్పూ, పప్పూ, చెక్కెర వగైరాలతో స్వయం పాకాన్ని అందజేస్తారు. పండు ముదుసళ్లను పదిసార్లు తిప్పించుకున్నప్పటికీ ఓ వేయి రూపాయలను పెన్షన్‌గా అందజేసేంత విశాల హృదయం మన సంక్షేమ పాలకుల్లో ఉన్నది. కానీ, పేదలు సాధికారత సంతరించుకునే అవకాశాలు వీరి కార్యక్రమంలో ఉండవు. ఈ తరహా రెండు కళ్ల సిద్ధాంత 'సంక్షేమ' పాలకుల్లో మన చంద్రబాబు నాయుడు కూడా ఉంటారు.

ఈ రెండు కళ్ల సిద్ధాంతంలో అభివృద్ధి – సంక్షేమం అనేవి రెండు సమాంతర రేఖలు మాత్రమే! ఒకదాన్నొకటి తాకదు. సంక్షేమం కోటాలోని జనం అభివృద్ధి కేటగిరీలోకి చేరిపోవడమనేది ఒక అరుదైన సన్నివేశం. లేబర్ మార్కెట్‌లోని ప్రజలు సంపన్న శ్రేణిలోకి చేరాలంటే వారికి నాణ్యమైన ఉచిత విద్య మొదటి షరతు. ఇక్కడే మన సంక్షేమ పాలకుల వర్గదృక్పథం బట్టబయలయ్యేది. నాణ్యమైన ఉచిత విద్యకు మన పాలకులు ససేమిరా అంగీకరించరు. విద్య అనేది ప్రభుత్వ బాధ్యత కాదని ముఖ్యమంత్రి హోదాలోనే చంద్రబాబు పలుమార్లు చెప్పిన విషయం గుర్తు చేసుకోవాలి. విద్యారంగాన్ని వ్యాపారస్థుల రేస్‌కోర్స్‌గా మార్చిన ఘనుల్లో నిస్సందేహంగా చంద్రబాబు అగ్రగణ్యుడు. విద్యాబేహారులకు ప్రభుత్వ పాలనలో పెద్ద పీట వేసినవాడు చంద్రబాబు. పేదపిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య అందకుండా ఎన్ని విధాలుగా అడ్డుపుల్లలు వేయడానికి ప్రయత్నించాడో మనం చూశాము.

నాణ్యమైన విద్యకు బదులుగా నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు ఎన్నికల సభల్లో చెప్పుకొస్తున్నారు. పైగా దాన్ని తక్కువ ధరలకే అందజేస్తారట. ఇంకో రెండు రోజులు పోతే డోర్ డెలివరీ కూడా చేస్తామంటారేమో! మద్యం ఆరోగ్యానికి హానికరమైనదని వైద్యులందరూ చెబుతారు. నాణ్యమైన మద్యమైతే నెమ్మదిగా చస్తారు. నాసిరకం మద్యమైతే వెంటనే చస్తారని ఆయన భావం కావచ్చు. ఈ చంపేయడంలో నాణ్యతా ప్రమాణాలు దేనికి? ప్రజలను సాధికారం చేసే విద్యలోనూ, ఆరోగ్య సమాజాన్ని నిర్మించే వైద్యంలోనూ నాణ్యతా ప్రమాణాలు నెలకొల్పడం ప్రభుత్వం పనికాదనీ, అది ప్రైవేట్ వ్యాపారుల క్రీడాస్థలమనేది చంద్రబాబు సిద్ధాంతం. అందువల్లనే ఆయన పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రిత్వ కాలంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు శిథిలమై పోయాయి. ఈ రెండు వ్యవస్థల్లోనూ కార్పొరేట్ రంగం రంకెలేసింది. ఐదేళ్ల జగన్ పరిపాలన అందుకు పూర్తి విరుద్ధం. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశ పెట్టడమే కాదు, అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతులు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో పేద విద్యార్థులందరికీ అందుబాటులోకి వచ్చాయి.

ప్రభుత్వాస్పత్రులు ఇప్పుడు బ్రహ్మాండంగా పని చేస్తున్నాయి. ఒక్క వైద్య ఆరోగ్య రంగంలోనే 58 వేల ఉద్యోగ ఖాళీలను 58 మాసాల కాలంలో భర్తీ చేయగలిగారు. అంటే నెలకు వేయి ఖాళీల చొప్పున భర్తీ. ప్రభుత్వం ఎంత ఉద్యమ

ఉచిత విద్య మొదటి షరతు. ఇక్కడే మన సంక్షేమ పాలకుల వర్గదృక్పథం బట్టబయలయ్యేది. నాణ్యమైన ఉచిత విద్యకు మన పాలకులు ససేమిరా అంగీకరించరు. విద్య అనేది ప్రభుత్వ బాధ్యత కాదని ముఖ్య మంత్రి హోదాలోనే చంద్రబాబు పలుమార్లు చెప్పిన విషయం గుర్తు చేసుకోవాలి. విద్యారంగాన్ని వ్యాపారస్థుల రేస్ కోర్స్‌గా మార్చిన ఘనుల్లో నిస్సందేహంగా చంద్రబాబు అగ్రగణ్యుడు. విద్యాబేహారులకు ప్రభుత్వ పాలనలో పెద్ద పీట వేసినవాడు చంద్రబాబు. పేదపిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య అందకుండా ఎన్ని విధాలుగా అడ్డుపుల్లలు వేయడానికి ప్రయత్నించాడో మనం చూశాము. నాణ్యమైన విద్యకు బదులుగా నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు ఎన్నికల సభల్లో చెప్పుకొస్తున్నారు. పైగా దాన్ని తక్కువ ధరలకే అందజేస్తారట. ఇంకో రెండు రోజులు పోతే డోర్ డెలివరీ కూడా చేస్తామంటారేమో! మద్యం ఆరోగ్యానికి హానికరమైనదని వైద్యులందరూ చెబుతారు. నాణ్యమైన మద్యమైతే నెమ్మదిగా చస్తారు. నాసిరకం మద్యమైతే వెంటనే చస్తారని ఆయన భావం కావచ్చు. ఈ చంపేయడంలో నాణ్యతా ప్రమాణాలు దేనికి?

స్ఫూర్తిని ప్రదర్శిస్తే ఇది సాధ్యమవుతుంది? వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వాస్పత్రులను ఆధునికం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో పీరియాడికల్‌గా ప్రభుత్వ వైద్యుడు పర్యటిస్తాడు. రోగగ్రస్తులందరి రికార్డు ఆయన దగ్గరుంటుంది. క్రమం తప్పకుండా ఆయనే వాళ్లను పరీక్షించి మందులిస్తాడు. ఆ రకంగా ప్రతి పేదరోగికీ ఒక ఫ్యామిలీ డాక్టర్‌ను అందుబాటులోకి తెచ్చిన ఉత్తమ విధానానికి ఈ ఐదేళ్లలోనే శ్రీకారం చుట్టారు.

అన్నం ఉడికిందో లేదో చెప్పడానికి ఒక్క మెతుకు చాలంటారు. విద్య, వైద్య రంగాల్లో ఏ పాలకుని వైఖరి ఏమిటో తెలిస్తే ఆ పాలకుని వర్గ స్వభావమేమిటో చెప్పవచ్చు. చంద్రబాబు పుట్టుకరీత్యా పేదవాడే కావచ్చు. కానీ ఎత్తుజిత్తులతో పెత్తందారీ శ్రేణిలో చేరిన ఆయన ఆ వర్గ ప్రయోజనాల రక్షణ కోసం ఒక ఉగ్రవాదిగా మారిపోయాడు. ఇందుకు పూర్తి భిన్నంగా సంపన్న కుటుంబంలో పుట్టిన జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఎజెండాను భుజానికెత్తుకున్నాడు. పేదవర్గాలు–మహిళల సాధికారతను తన పార్టీ సిద్ధాంతంగా ప్రకటించుకున్నాడు. సమాజంలోని రెండు వైరివర్గాల గురించి ప్రస్తావించడమే కాకుండా ఈ రెండు వర్గాల మధ్యన యుద్ధం జరుగుతున్నదనీ, ఈ యుద్ధంలో తాను పేద వర్గాల తరపున అర్జునుడి పాత్ర పోషిస్తాననీ కూడా ఆయన ప్రకటించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ పరిధిలో క్లాస్ వార్ (వర్గ పోరాటం) గురించి మాట్లాడిన మొట్టమొదటి నాయకుడు చరిత్రలో జగన్ మోహన్ రెడ్డి ఒక్కడే. కమ్యూనిస్టులు చెప్పే క్లాస్ వార్ వేరు. వర్గపోరు గురించి మాటలు చెప్పే కమ్యూనిస్టులు ఆచరణలో వర్గదృక్పథాన్ని కోల్పోయి ఉనికిని పోగొట్టుకున్న సంగతి మనకు తెలిసిందే. కమ్యూనిస్టులుగా ప్రకటించుకునే వారిలో కొంత మంది పెత్తందారీవర్గ ప్రవక్త చంద్రబాబు చుట్టూ చేరి చిడతలు వాయించే స్థితికి దిగజారిపోవడం కూడా చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పరిధిలోనే పేదల విముక్తి కోసం క్లాస్ వార్‌కు పిలుపునిచ్చి భారత రాజకీయాల్లో కొత్త ఒరవడిని జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించారు. ఈ క్లాస్ వార్ మరోసారి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభంజనాన్ని సృష్టించబోతున్నది. క్షేత్రస్థాయి ప్రజా స్పందనల అంచనా ప్రకారం 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతం కాబోతున్నాయి.

తాను పెత్తందారీ వర్గ ప్రయోజనాల కిరాయి మనిషిననే విషయాన్ని చంద్రబాబు తన చేతల్లోనే కాదు మాటల్లో కూడా పదేపదే వ్యక్తం చేస్తూనే ఉన్నాడు. అందులో భాగమే మొన్నటి టిప్పర్ ఎపిసోడ్. అనంతపురం జిల్లా సింగనమల నియోజక వర్గం నుంచి వీరాంజనేయులు అనే టిప్పర్ డ్రైవర్‌కు వైసీపీ టిక్కెట్ ఇచ్చింది. ఆయన విద్యాధికుడైనప్పటికీ బ్రతుకుతెరువు కోసం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పార్టీ కార్యకర్తగా కూడా పని చేస్తున్న అతని సేవలను గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డి అతడిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. పెత్తందారీ మనస్తత్వం నరనరాన జీర్ణించుకున్న చంద్రబాబు ఈ ఎంపికను అవహేళన చేస్తున్నారు. సింగనమలలో జరిగిన టీడీపీ సభలో మాట్లాడుతూ టిప్పర్ డ్రైవర్ అనే మాటను పదేపదే వెటకారంగా ఒత్తి పలికారు. ఇటువంటి నిశానీగాళ్లకు ఓటేస్తే ఎక్కడ పెట్టమంటే అక్కడ సంతకం పెడతారని ఎద్దేవా చేశారు. అంటే పేదవాళ్లు అజ్ఞానులనీ, వాళ్లు రాజకీయాలకు అనర్హులనే అర్థంలో మాట్లాడారు.

ఈవిధంగా మాట్లాడటం చంద్రబాబుకు కొత్తేమీ కాదు. 'ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?' అని మీడియా సమావేశంలోనే ఆయన తన మనస్తత్వాన్ని బయట పెట్టుకున్నారు. నాయీ బ్రాహ్మణ (బీసీ వర్గం) ప్రతినిధులను మీడియా సమక్షంలోనే 'మీ తోకలు కత్తిరిస్తాన'ని బెదిరించారు. బీసీలకు జడ్జీ పదవులు ఇవ్వొద్దని, వారందుకు తగరని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వానికే ఆయన స్వయంగా లేఖ రాశారు. 'కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా?' అని మహిళా విద్వేషాన్ని బహిరంగంగా వెళ్లగక్కారు. నాయకుడి నుంచి ఈ స్ఫూర్తిని తీసుకొని పేదవర్గాలపై ఆయన అనుచరగణం చేసిన దాష్టీకం అంతా ఇంతా కాదు.

ఎన్నికల యుద్ధంలో తలపడకుండా పేద వర్గాలను, సంఘ సేవకులను దూరం చేసిన భాగ్యశాలి కూడా చంద్రబాబే. ఎన్టీఆర్ మరణానంతరం ప్రజాదరణ పెద్దగా లేని తాను నెగ్గుకు రావడం కోసం ఉపఎన్నికల సందర్భంగా కనీవినీ ఎరుగని రీతిలో ఖర్చుపెట్టి సంచలనం సృష్టించారు. అప్పటినుంచీ అదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఎన్నిక ఏదైనా సరే పెద్ద ఎత్తున

అనంతపురం జిల్లా సింగనమల నియోజక వర్గం నుంచి వీరాంజనేయులు అనే టిప్పర్ డ్రైవర్‌కు వైసీపీ టిక్కెట్ ఇచ్చింది. ఆయన విద్యాధికుడైనప్పటికీ బ్రతుకు తెరువు కోసం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పార్టీ కార్యకర్తగా కూడా పనిచేస్తున్న అతని సేవలను గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డి అతడిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. పెత్తందారీ మనస్తత్వం నరనరాన జీర్ణించుకున్న చంద్రబాబు ఈ ఎంపికను అవహేళన చేస్తున్నారు. సింగనమలలో జరిగిన టీడీపీ సభలో మాట్లాడుతూ టిప్పర్ డ్రైవర్ అనే మాటను పదేపదే వెటకారంగా ఒత్తి పలికారు. ఇటువంటి నిశానీగాళ్లకు ఓటేస్తే ఎక్కడ పెట్టమంటే అక్కడ సంతకం పెడతారని ఎద్దేవా చేశారు. అంటే పేదవాళ్లు అజ్ఞానులనీ, వాళ్లు రాజకీయాలకు అనర్హులనే అర్థంలో మాట్లాడారు.
ఈవిధంగా మాట్లాడటం చంద్రబాబుకు కొత్తేమీ కాదు. 'ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?' అని మీడియా సమావేశంలోనే ఆయన తన మనస్తత్వాన్ని బయటపెట్టుకున్నారు. నాయీ బ్రాహ్మణ (బీసీ వర్గం) ప్రతినిధులను మీడియా సమక్షంలోనే 'మీ తోకలు కత్తిరిస్తాన'ని బెదిరించారు. బీసీలకు జడ్జీ పదవులు ఇవ్వొద్దని, వారందుకు తగరని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వానికే ఆయన స్వయంగా లేఖ రాశారు. 'కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా?' అని మహిళా విద్వేషాన్ని బహిరంగంగా వెళ్లగక్కారు. నాయకుడి నుంచి ఈ స్ఫూర్తిని తీసుకొని పేద వర్గాలపై ఆయన అనుచరగణం చేసిన దాష్టీకం అంతా ఇంతా కాదు.

డబ్బు ఖర్చు చేయగలవారినే నిలబెట్టడం మొదలుపెట్టారు. ఆయన్ను చూసి మిగిలిన పార్టీల వాళ్లు కూడా అంతో ఇంతో అనుసరించక తప్పలేదు. పెట్టుబడి – రాజకీయాల మధ్యన ఉండే పరోక్ష బంధం నాటినుంచి ప్రత్యక్షంగా మారిపోయింది. వందల కోట్లు వెదజల్లి ఎన్నికల్లో గెలిచిపోవడమనే అప్రజాస్వామిక ధోరణికి గేట్లు తెరిచినవాడు చంద్రబాబు. ఈ అక్రమార్జనపరులైన కోటీశ్వరులపై సామాన్యులు విజయభేరి మోగించినప్పుడే మళ్లీ మన సిసలైన ప్రజాస్వామ్యం మన చేతికొస్తుంది.

టిప్పర్ డ్రైవర్‌గా చంద్రబాబు అవహేళన చేసిన వీరాంజనేయులు సింగనమలలో విజయఢంకా మోగిస్తేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. మడకశిరలో ఉపాధి హామీ కూలీ లక్కప్ప భారీ మెజారిటీతో నెగ్గితే ప్రజాస్వామ్యం పది కాలాల పాటు వికసిస్తుంది. చదువుల సరస్వతీదేవిని అంగడి సరుకుగా మార్చి లక్షలాది సామాన్యుల రక్తం తాగి తెగబలిసి వేలకోట్లు ఆర్జించిన నారాయణ నెల్లూరు నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తున్నాడు. వందల కోట్లు వెదజల్లి గెలవాలని చూస్తున్నాడు. అతడితో తలపడుతున్న సామాన్యుడు స్వర్ణకార వృత్తి చేసుకునే ముస్లిం మైనారిటీకి చెందిన ఖలీల్ అహ్మద్ గెలిస్తేనే ప్రజాస్వామ్యం గెలిచినట్టు! అనకాపల్లి లోక్‌సభ సీటుకు సీఎం రమేశ్ పోటీ చేస్తున్నాడు. ఈయన మనిషి బీజేపీలో ఉంటాడు. ఆత్మ తెలుగుదేశంలో ఉంటుంది. స్నేహం కాంగ్రెస్‌తో ఉంటుంది. కాంట్రాక్టుల పేరుతో భారీ ఎత్తున అక్రమార్జన చేశాడని ప్రతీతి. చంద్రబాబుకు బినామీగా కూడా చెబుతారు. ఇప్పుడు ఎంపీగా గెలవడం కోసం ప్రతి అసెంబ్లీ సెగ్మెంటుకూ వందకోట్ల చొప్పున ఖర్చు చేస్తాడట! డబ్బు విసిరితే గెలుస్తామనే ధీమా. ప్రజల వివేకం మీద చిన్నచూపు. ఇతని మీద పోటీ చేస్తున్న బూడి ముత్యాల నాయుడు రాష్ట్ర మంత్రి. పేరుకు మంత్రే కానీ, ఆర్థికంగా సామాన్యుడు. ఇప్పుడిక్కడ బీసీ వెలమ వర్సెస్ ఓసీ వెలమ, లోకల్ వర్సెస్ నాన్ లోకల్, సామాన్యుడు వర్సెస్ సంపన్నుడి మధ్యన పోటీ జరగబోతున్నది. సామాన్యుడు గెలిస్తేనే ధనస్వామ్యం తోక ముడుస్తుంది. ప్రజాస్వామ్య పతాకం రెపరెపలాడుతుంది.

vardhelli1959@gmail.com

ఇన్ బాక్స్

అరుదైన సాహిత్యకారుడు

కేవీ రమణారెడ్డి రచయితగా, కవిగా, విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యులుగా తెలుగు సాహిత్యానికి సుపరిచితమే. సాహిత్యం ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారమని నమ్మి జీవితపు కొసవరకు సాహిత్య, ప్రజా ఉద్యమాలలో పని చేశారు. అనేకసార్లు జైలు జీవితం గడిపారు. కేవీఆర్ జీవిత కాలంలో అనేక పుస్తకాలను రచించారు. కొన్నిటిని అనువాదం చేశారు. నెల్లూరు జిల్లా రేబాల గ్రామంలో జన్మించిన కేవీఆర్ కావలి జవహర్ భారతి కాలేజీలో పాఠాలు చెప్పారు. తోటి ఉపాధ్యాయులను, విద్యార్థులను రచయితలుగా తీర్చిదిద్దారు. నిరంతరం రాయడం ద్వారా ఒక కాలపు ఉత్థాన పతనాలను సాహిత్యంలోకి తీసుకువచ్చారు.

అభ్యుదయ, ప్రగతిశీల భావాల వ్యాప్తికి సాహిత్యకారునిగా మార్క్సిజం వెలుగులో పనిచేశారు. విస్తారమైన సాహిత్య సృజన ఆయన ఆచరణలో భాగం. కేవీఆర్ మరణించి పదిహేనేళ్ల కాలం గడిచింది. అనేక కొత్త పోకడలు మధ్య మానవ సృజనాత్మకత పూర్వపక్షమవుతోంది. కొత్త తరం పాఠకుల అభిరుచులు మారుతున్నాయి. ప్రజలందరి కోసం జీవించాలనే ఆలోచనలకు కాలం చెల్లింది. భారతీయ సమాజపు వ్యక్తీకరణలోనే మానవీయ సంబంధాలకు తావులేని స్థితి! ఈ దేశ పరిస్థితులు ఇలా కావడానికి అన్వేషణ మొదలైంది. మొదటి తరం బుద్ధిజీవులు, సాహిత్యకారులు చేసిన సాహిత్య సృజన ఇవాళ్టి సమాజానికి ఒక అవసరంగా ముందుకు వచ్చింది కేవీఆర్ స్మారక కమిటీ.

ఈ స్మారక కమిటీ 2011లో ఏర్పడింది. ప్రతి ఏడాది కేవీఆర్ పుట్టినరోజున స్మారకోపన్యాసం, ఆయన రచనలు ప్రచురిస్తోంది. అందులో భాగంగా నేడు విజయవాడలో కవి, చరిత్రకారుడు కొప్పర్తి వెంకటరమణమూర్తితో 'చరిత్రతో సంభాషణ – వర్తమానం' అనే అంశంపై ప్రసంగాన్ని ఏర్పాటు చేసింది. అలాగే కేవీఆర్ రచనలు 'లూసన్ జీవితం – సాహిత్యం', 'అడవులు మండుతున్నాయి' ఆవిష్కరణ అవుతాయి. చరిత్రను సాహిత్యం ద్వారా రికార్డు చేసిన కేవీఆర్‌ను జ్ఞాపకం చేసుకోవడం వర్తమాన కాలపు ఆకాంక్షగా వుండాలి.

– అరసవిల్లి కృష్ణ (విరసం)

(నేడు విజయవాడలో కేవీఆర్ స్మారకోపన్యాస సభ)

ఆ పొత్తు భవిష్యత్తుకు విపత్తు

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ఎన్నికల్లో ఒంటరిగా నెగ్గే రాజకీయ పార్టీ ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోదు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ–టీడీపీ–జనసేనల పొత్తును ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. దక్షిణ భారతంలో ప్రవేశానికి పాటుబడుతున్న బీజేపీకి ఇది దక్షిణ. ప్రజల ప్రయోజనానికే ఈ పొత్తు అని బాబు ప్రకటన బూటకమే. చిలకలూరిపేట వద్ద బొప్పూడిలో మార్చి 17న జరిపిన కూటమి ప్రజాగళం సభలో ప్రధాని ఆనకట్టలు, ప్రత్యేక హోదా, పరిశ్రమలు, రాజధాని నిర్మాణం, విశాఖ ఉక్కు అమ్మకం వంటి ప్రజల సమస్యల మాట ఎత్తలేదు. 'కూటమిని గెలిపించండి. వైసీపీ– కాంగ్రెస్‌లు ఒక్కటే. వాటిని ఓడించండి' అన్న పలుకులే వినిపించాయి. కల్యాణ్, బాబులు మోదీని దైవీకరించారు.



ఆటకు ముందే ఓటమిని వల్లించిన ఉత్తర కిరీటి పవన్. సైన్యమే లేని జనసేన భవిష్యత్తు ప్రశ్నార్థకం. టీడీపీ ఇప్పుడు రెండవ తరం వృద్ధ నాయకత్వంలో ఉంది. మూడవ తరం యువ నాయకునికి సముద్ర తీరం తెలియదు.

ఉత్తర భారతంలో (వైదిక సమీకరణతో) 2024 గెలుపు ఖాయమనీ, తమ ప్రయత్నాలు 2029కేననీ, అందుకు దక్షిణంలో ప్రవేశానికి తమతో పొత్తు పెట్టుకున్న ప్రాంతీయ పార్టీల భుజాలపై స్వారీ చేసి 2029కి వాటి స్థానాన్ని ఆక్రమించాలనీ, 2034 ఎన్నికల నాటికి వాటిని లేకుండా చేయాలనీ మోదీ యోచన.

బీజేపీతో పొత్తుపెట్టుకున్న ప్రాంతీయ పార్టీలన్నీ బలహీనపడ్డాయి. మూతబడ్డాయి. వాటి స్థానాన్ని బీజేపీ ఆక్రమించింది. ప్రాంతీయ మతతత్వ శిరోమణి అకాలీదళ్ బీజేపీ పొత్తుతో పతనమయింది. బీజేపీ కేరళలో క్రైస్తవులను దువ్వుతోంది. ముస్లిమ్‌లను బెదిరిస్తోంది. ప్రముఖ కాంగ్రెస్ నాయకుల సంతానాన్ని (ఎ.కె. ఆంటోని కొడుకు, కె.కరుణాకరన్ కూతురు) తన వైపు తిప్పుకుంటోంది. సంప్రదింపుల శక్తి లేని లోకేశులు ఇందుకు అతీతులా? అసోంలో 2016 రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అస్సాం గణ పరిషత్ (ఏజీపీ), బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్)లతో జతకట్టింది. తర్వాతి బోడోల్యాండ్ ట్రైబల్ కౌన్సిల్ ఎన్నికల్లో బీపీఎఫ్‌ను చెత్తలో వేసి ప్రమోద్ బోరో నాయకత్వంలోని యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీ–ఎల్)తో కలిసింది. బాగా బలహీనపడిన బీపీఎఫ్ 2022 లో మరలా బీజేపీతో జత కట్టింది. నేటి టీడీపీ లాగా! ఏజీపీ నీడ కూడా కనిపించడం లేదు. బిహార్‌లో నితీశ్ కుమార్‌ను బలహీనపర్చడానికి రాం విలాస్ పాశ్వాన్ కొడుకు చిరాగ్ పాశ్వాన్‌ను వాడుకుంది. 2024 నాటికి నితీశ్ జేడీయూ ఉనికిలో ఉండవచ్చు. 2029 నాటికి మాయమవక తప్పదు. హరియాణాలో దుష్యంత్ చౌతాలా జేజేపీ కథ ముగిసినట్లే.

మహారాష్ట్రలో ఏకత్వ భావజాల చిరకాల మిత్రపక్షం శివసేనను బీజేపీ ముక్కలు చేసింది. శరద్ పవార్ ఎన్సీపీ నుండి అజిత్ పవార్‌ను వేరుచేసింది. బీజేపీ లేనిదే అజిత్ ఎన్సీపీకి మనుగడ, భవిష్యత్తు లేవు. మన రాష్ట్రంలో కొడిగట్టిన దీపం, బలహీన టీడీపీతో పొత్తుకు ఈ ప్రాతిపదికలే కారణం. 2029 నాటికి మూడో తరం టీడీపీ నాయకత్వం పూర్తిగా బలహీనమవుతుంది. దానిని అప్పుడు సులభంగా భవిష్యత్తు బీజేపీలో కలుపుకోవచ్చు.

ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ అమలుచేసిన పౌరసత్వ సవరణ చట్టంతో మొత్తం ముస్లిమ్‌లు వైఎస్సార్‌సీపీ వైపునకు రావచ్చు. కూటమిలో సీట్ల కేటాయింపుపై విభేదాలు భగ్గుమన్నాయి. సీట్ల కేటాయింపులో వైఎస్సార్‌సీపీ సామాజిక న్యాయాన్ని ప్రజాబాహుళ్యం గమనించింది. సంక్షేమాలు తగు పాత్ర పోషిస్తాయి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

నమ్మినవాడు బతుకుతాడు

మనిషి మస్తిష్కంలోని నైరాశ్యాన్ని తొలగిస్తూ ఆశను పెంచుతోన్న ఒక ఉత్సాహమే ఈస్టర్. చీకటిపై విజయం సాధించే వెలుగు వైభవం ఈస్టర్. పాపానికి సంకేతం మరణం. దానిపై మహా భేరీ మ్రోయించి, సాధించిన విజయమే, ఈస్టర్.

క్రీస్తు మరణం, మామూలు మరణం కానే కాదు. ఒక హత్యోదంతం. ఒక విషాదం! ఆ మరణం నుంచి తిరిగి లేచిన సంఘటనే పునరుత్థానం. అదే ఈస్టర్. ఈ మరణం, ఈ పునరుత్థానం వల్ల మనకు అందే సందేశం ఏమిటీ?

మానవుని జీవితం చీకటి వెలుగుల సమ్మేళనం అనీ, ప్రతీ వైభవం వెనుక ఒక విషాదం దాగి ఉంటుందనీ, సౌఖ్యానికి కష్టమూ, సంతోషానికి దుఃఖమూ ప్రాతిపదికలనీ, చచ్చిపోయిందిలే ఆ విత్తనం అని నిరుత్సాహపడగూడదు, అందులోంచే పొడుచుకొంటూ చివురులు పైకి లేస్తాయనేది గ్రహించాలి. మనం ఒక్కోసారి తెలిసో తెలియకో తప్పు చేస్తాం. అందులోంచి మేల్కొని, బాగా కోల్కొని మళ్లీ మామూలై పోవాలి. ఇదే ప్రతి మనిషికీ ఎదురయ్యే ప్రయోగాత్మక పునరుత్థానం.

అన్యాయమైన తీర్పునకు బలై, బరువైన శిలువ ఎత్తుకొని రాళ్ళల్లో, కొండ ఎక్కలేక ఎక్కుతూ ఉన్న ప్రభువును కొట్టుకొంటూ తీసుకుపోయి అదే శిలువపై కట్టి, మేకులతో కొట్టి చంపేశారు. మరణించిన క్రీస్తు శరీరాన్ని శిలువ నుంచి దించి, సమాధిలో ఉంచారు. మూడో రోజు ఆయన్ను చూద్దామని మగ్దలేనా మరియ వెళ్ళి చూసేసరికి ఆయన అక్కడ లేడు, దూతలు కాపలా కాస్తున్నారు. ఆయన ఎక్కడ? అని ఆ వెళ్ళిన మగ్దలేనా అడిగింది. కనబడీ కనబడక ఉషోదయాన ప్రభువు మాట్లాడాడు. ఎక్కడలేని ఉత్సాహంతో పోయి, ఆమె, ఆ విషయాన్ని అందరికీ చెప్పింది. క్రీస్తు శిలువ దగ్గర గుండె పగిలేట్టు ఏడ్చి, మొట్టమొదట ఆ పునరుత్థాన క్రీస్తును చూచిన మహిళగా మగ్దలేనా కనిపిస్తోంది. తన పునరుత్థానంతో క్రీస్తు ఈ లోకానికి 'పునరుత్థానం నేనే, జీవమూ నేనే, నన్ను నమ్మేవాడు చనిపోయినప్పటికీ బ్రతుకుతా'డని (యోహా 11:25), అనంత సందేశాన్ని అందిస్తున్నాడు.

– డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు

(నేడు ఈస్టర్ పర్వదినం)

క్లుప్తంగా...


వైశ్యుల పేరుతో వైఎస్సార్‌సీపీపై అసత్య ప్రచారం

ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ ఫిర్యాదు



ఒంగోలు అర్బన్: ఆర్యవైశ్యుల పేరుతో ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి నష్టం చేకూర్చేలా ఫోన్ కాల్ రికార్డు రూపంలో చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) ఏఎస్ దినేష్‌కుమార్‌కు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ శనివారం ఫిర్యాదు చేశారు. కాల్ వాయిస్‌లను పరిశీలించి దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎన్నికల అధికారి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, తడవర్తి వాసు, కారంశెట్టి కిరణ్, కోడూరి సత్యం, మంగళదీప్ బద్రి, వంశీ, కళ్యాణ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

'నల్లారి' పర్యటనలో నిబంధనలకు నీళ్లు



మదనపల్లె: మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మదనపల్లె పర్యటన సందర్భంగా ఎన్నికల కోడ్ నిబంధనలకు నీళ్లు వదిలేశారు. అనుమతికి మించి పెద్ద ఎత్తున వాహనాలు రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ దాటినా అధికారులు ఎటువంటి తనిఖీలు చేయలేదు. సామాన్యుడు స్కూటర్‌పై సరిహద్దు దాటుతున్నా ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అయితే, కిరణ్‌కుమార్‌రెడ్డి బెంగళూరు నుంచి మదనపల్లెకు అనేక వాహనాలకు పెద్ద పెద్ద జెండాలు కట్టుకుని వచ్చినా సరిహద్దులో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ సిబ్బంది నామమాత్రపు తనిఖీలు కూడా చేయకుండానే వదిలేశారు. మరోవైపు కిరణ్‌కుమార్‌రెడ్డి ర్యాలీ కోసం బీజేపీ అన్నమయ్య జిల్లా మదనపల్లె శాఖ తరఫున ఆ పార్టీ ప్రతినిధిగా పి.భగవాన్ కేవలం తొమ్మిది వాహనాలకు మాత్రమే అనుమతి తీసుకున్నారు. కానీ, ర్యాలీలో వందల సంఖ్యలో అనుమతి లేని వాహనాలతో ప్రయాణించి ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. అయినా అధికారులు ఎలాంటి కేసులు నమోదు చేయలేదు. ర్యాలీ వెళుతుంటే వీడియో సర్వైలెన్స్ టీమ్ సభ్యులు వీడియో తీసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించలేదు. కాన్వాయ్ సాకులో కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం, నగదు, నిషేధిత వస్తువులు కచ్చితంగా తరలించి ఉంటారని ప్రజలు భావిస్తున్నారు. దీనిపై ఎన్నికల సంఘం అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఓటమి భయంతో బాబుకు మతి భ్రమించింది

ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



మధురానగర్(విజయవాడసెంట్రల్): అణగారిన వర్గాలపై చంద్రబాబుకు చిన్నచూపని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మండిపడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక టిప్పర్ డ్రైవర్‌కు సీటు ఇవ్వడంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం చంద్రబాబు నైజాన్ని తెలియజేస్తోందన్నారు. చంద్రబాబు డ్రైవర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ముత్యాలంపాడులో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు, డ్రైవర్లతో కలిసి శనివారం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. రాజకీయాలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఒక ఫొటోగ్రాఫర్‌ను ఎంపీగా, కూలి పనులు చేసుకునేవారిని ఎమ్మెల్యేగా, రిపోర్టర్‌ను మంత్రిగా చేశారని గుర్తు చేశారు. బాబు వ్యాఖ్యలపై యావత్ కార్మిక లోకం మండిపడుతోందని, రానున్న ఎన్నికల్లో టీడీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసిన చంద్రబాబుకు మతి భ్రమించిందని, ఎర్రగడ్డ, కేజీహెచ్ ఆస్పత్రుల్లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి పాల్గొన్నారు.

అరకు సీపీఎం ఎంపీ అభ్యర్థిగా అప్పలనరస

సాక్షి, న్యూఢిల్లీ: అరకు ఎంపీ స్థానానికి అభ్యర్థిగా పాచిపెంట అప్పలనరసను సీపీఎం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 44 ఎంపీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను సీపీఎం శనివారం విడుదల చేసింది. తెలంగాణలోని భువనగిరి ఎంపీ స్థానానికి ఎండీ జహంగీర్‌కు టికెట్ ఖరారు చేసింది. జాబితాలో పశ్చిమ బెంగాల్ నుంచి 17 మందిని, కేరళ నుంచి 15 మందిని అభ్యర్థులను ప్రకటించింది.

టీడీపీలో కోట్లకు సీట్లు

సాక్షి, అమరావతి: టీడీపీలో 'కోట్లుకు టికెట్లు' వ్యవహారం రచ్చకెక్కింది. కోరినన్ని కోట్లిస్తేనే ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండు చోట్ల డబ్బు డిపాజిట్ చేస్తేనే టికెట్లు ఇస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'మా వాళ్లు బ్రీఫ్‌డ్ మీ'.. అన్న తరహాలోనే ఇప్పుడూ పెద్ద నేతకు 'బ్రీఫింగ్' వెళ్తేనే టికెట్ ఖరారవుతోందని చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పార్టీకి విధేయులుగా ఉండే నేతలు సైతం ఈ డబ్బు దందాపై రగిలిపోతున్నారు. పార్టీ కోసం పని చేసిన వారిని కాదని బయటి వ్యక్తులకు వేలం పాట పెట్టి మరీ సీట్లు అమ్మేసినట్లు టీడీపీ నేతలు వాపోతున్నారు. వారి ఆవేదన హద్దులు దాటి దాడులు చేసే స్థాయికి చేరింది. అనంతపురం అర్బన్ సీటును అక్కడి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకరచౌదరికి కాకుండా దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కి ఇవ్వడంపై అనంతపురం టీడీపీ శ్రేణులు ఆగ్రహంతో బీభత్సం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. పార్టీ కార్యాలయాలపై దాడులు చేసి నిప్పు పెట్టి, చంద్రబాబు, లోకేశ్ ఫొటోలను దహనం చేస్తున్నారు. ఈ సీటును లోకేశ్ రూ.30 కోట్లకు అమ్మేసినట్లు పార్టీ నేతలు మీడియాలోనే చెబుతున్నారు. గుంతకల్లు అసెంబ్లీ సీటును కూడా ఇలాగే వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకి కేటాయించారు. పార్టీ కోసం ఎప్పటి నుంచో పనిచేస్తున్న ఇన్‌ఛార్జి జితేంద్రగౌడ్‌కి మొండిచేయి చూపి అప్పటికప్పుడు పార్టీలో చేరిన జయరాంకి ఇచ్చేశారు. ఇందుకోసం ఆయన చంద్రబాబు, లోకేశ్‌కి భారీగా డబ్బు ముట్టజెప్పినట్లు టీడీపీ నేతలే చెబుతున్నారు.



ప్రభాకరచౌదరి



వెంకటేశ్వరప్రసాద్



గుమ్మనూరు జయరాం



జితేంద్రగౌడ్



శ్రీనివాసులురెడ్డి



గంటా శ్రీనివాసరావు



గొట్టిపాటి లక్ష్మి

దర్శి సీటు స్థానికేతరురాలికి ఇవ్వడం వెనుక !

ఒంగోలు జిల్లా దర్శి సీటును కూడా వేరే ప్రాంతానికి చెందిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి కేటాయించారు. నిజానికి ఈ సీటును చాలాకాలం క్రితమే బేరం పెట్టినా కొనేందుకు ఎవరూ రాలేదు. ఇతర పార్టీల నుంచి ఎవరైనా వస్తారేమోనని ఎదురు చూశారు. ఆఫర్లు ప్రకటించినా లాభం లేకపోయింది. ఈ నేపథ్యంలో నర్సరావుపేట సీటు ఆశించిన డాక్టర్ లక్ష్మి కుటుంబానికి ఆ సీటు కాకుండా దర్శి కేటాయించారు. నిర్దేశించిన రేటు ముట్టజెప్పడంతో స్థానికేతరురాలు అయినా ఆమెకు సీటు ఇచ్చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. అసలు ఏ సీటూ ఇవ్వకూడదనుకున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు ఆయన కోరుకున్న భీమిలి సీటు ఇవ్వడం వెనుకా భారీ డీల్ ఉన్నట్లు తెలుస్తోంది. గంటాను విశాఖ నుంచి పూర్తిగా దూరంగా పంపడానికి చంద్రబాబు ప్రయత్నించారు. అందుకోసం విజయనగరం జిల్లా చీపురుపల్లిలో పోటీ చేయాలని తీవ్ర ఒత్తిడి చేశారు. ఆయన ససేమిరా అన్నారు. విశాఖ జిల్లాలోనే ఏదో ఒక సీటు కావాలని కోరారు. అందుకు మొదట ఒప్పుకోని చంద్రబాబు.. మొదటి మూడు జాబితాల్లోనూ అవకాశం కల్పించలేదు. ఇక ఆయనకు సీటు రాదనుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే గంటా ఇచ్చిన భారీ ఆఫర్‌కి చంద్రబాబు, లోకేశ్ తలొగ్గినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జనసేనకు ఇవ్వాల్సిన భీమిలి సీటును పొత్తులో లేకుండా చేసి మరీ ఆఖరి జాబితాలో గంటాకు కట్టబెట్టారని సమాచారం. ఒంగోలు లోక్‌సభ సీటును ఫిరాయింపు నేత మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఇవ్వడం వెనుకా డబ్బు డీల్ ఉన్నట్లు చెబుతున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి సీటు ఇవ్వడాన్ని బట్టి దానికి గట్టి రేటు పెట్టి డబ్బు దండుకున్నారని పార్టీ నేతలు అంటున్నారు. మొదట ఆయన కుమారుడు రాఘవరెడ్డికి సీటు ఇవ్వడానికి ఒప్పుకున్నా, అరెస్టయి బెయిల్‌పై ఉన్న వ్యక్తికి టికెట్టిస్తే ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో శ్రీనివాసులరెడ్డినే పోటీ చేయించాలని నిర్ణయించారు. ఇలా అంతకుముందు ప్రకటించిన లోక్‌సభ సీట్లకు సైతం పెద్దఎత్తున డబ్బు చేతులు మారినట్లు టీడీపీలో చర్చ జరుగుతోంది.

ఎంపీ టికెట్ రేటు రూ.100 నుంచి రూ.200 కోట్లు

ఏలూరు, విజయవాడ, గుంటూరు, నర్సరావుపేట, బాపట్ల, నెల్లూరు, చిత్తూరు, నంద్యాల ఎంపీ సీట్ల ఖరారు వెనుక వందల కోట్ల డీల్ ఉన్నట్లు టీడీపీలో ప్రచారం జరుగుతోంది. ఒక్కో ఎంపీ సీటు కోసం రూ.100 నుంచి రూ.200 కోట్ల డీల్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీలో పని చేసిన నేతలను కాదని ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సీట్లు ఇవ్వడానికి డబ్బు తప్ప మరో కారణం లేదని తెలుస్తోంది. సగానికిపైగా అసెంబ్లీ సీట్ల ఖరారులోనూ ఇదే సూత్రాన్ని పాటించారు. రెండు రకాల డిపాజిట్లు చేస్తేనే కాని సీటు ఖరారు కాలేదని అనంతపురం జిల్లాకు చెందిన ఒక టీడీపీ అభ్యర్థి తన అనుచరుల వద్ద వాపోయారు. ఒక డిపాజిట్ ఎన్నికల్లో ఖర్చు చేయడానికి, మరొకటి చినబాబుకు చేశాకే చాలామంది సీట్లు దక్కించుకున్నారని చెబుతున్నారు. ఇందుకోసం ఆయన వేలం పాట పెట్టి ఎవరు ఎక్కువ ఇస్తామంటే వారికి సీట్లు ఖరారు చేసినట్లు సమాచారం. దీనిపై టీడీపీలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ కోసం అహర్నిశలూ కష్టపడి పని చేస్తే సీట్లతోపాటు తమను కూడా అమ్మేస్తున్నారని వాపోతున్నారు. అందుకే పలుచోట్ల కార్యకర్తలు చంద్రబాబు, లోకేశ్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వారిని బూతులు కూడా తిడుతున్నారు.

'వన్నికుల క్షత్రియ' చైర్‌పర్సన్‌పై టీడీపీ మూకల రాళ్ల దాడి



ఘటనాస్థలంలో శనివారం రాత్రి భర్త శీను, అనుచరులతో చైర్‌పర్సన్ వనిత

కుప్పం రూరల్ (చిత్తూరు జిల్లా): రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, ఆమె భర్త శీను ప్రయాణిస్తున్న కారుపై శనివారం రాత్రి టీడీపీ మూకలు రాళ్లదాడికి దిగారు. వనిత తన భర్త శీను, ఇతర అనుచరులతో కలిసి కుప్పం మండలం, ఆడమండలకుప్పంలో శనివారం రాత్రి 9.30 గంటల వరకు ప్రచారం నిర్వహించారు. గ్రామంలో వీరికి జనం ఘన స్వాగతం పలికి, వైఎస్సార్ సీపీకి మద్దతు ఇస్తామంటూ తెలిపారు. దీంతో జీర్ణించుకోలేని టీడీపీ శ్రేణులు వారిపై ఎలాగైనా దాడి చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రచారం ముగించుకుని రాత్రి స్వగ్రామం పత్తిచేనుకు తిరుగు ప్రయాణం అవుతుండగా, ఆడమండలకుప్పం గ్రామం దాటగానే ఒక్కసారిగా వారు ప్రయాణిస్తున్న కారుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడిలో కారు ఇండికేటర్ దెబ్బతింది. ఇది గమనించిన స్థానికులు కారు వద్దకు చేరుకున్నారు. దీంతో దాడికి పాల్పడ్డవారు తప్పించుకుని పారిపోయారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్‌సీపీకి గ్రామాల్లో పెరుగుతున్న ఆదరణ చూసి టీడీపీ మూకలు ఓర్వలేక ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

న్యాయ విజ్ఞానానికి వర్క్‌షాప్‌లు దోహదం

న్యాయమూర్తుల వర్క్‌షాప్‌లో హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్



మాట్లాడుతున్న జస్టిస్ బి.కృష్ణమోహన్

ఏలూరు (టూటౌన్): న్యాయ విజ్ఞానాన్ని పొందేందుకు వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అధ్యక్షతన జిల్లాలోని న్యాయమూర్తులకు వివిధ అంశాలపై శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో రాష్ట్ర హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ పాల్గొని మాట్లాడారు. న్యాయ అధికారాలు, చట్టంలో స్థూలమైన, విధానపరమైన అంశాలు, ఎప్పటికప్పుడు అవసరమని భావించే ఇతర మంచి న్యాయ విజ్ఞానంతో న్యాయమూర్తులను సన్నద్ధం చేయడానికి ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్లుగా సీనియర్ న్యాయవాదులు వై.వి. రవి ప్రసాద్, మజ్జి సూరిబాబు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, అమరావతి రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి ఎస్.సాల్మన్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పార్టిషన్, మార్ట్‌గేజ్, మనీ, డిక్లరేషన్, ఇంజక్షన్ చట్టాలు, ఎప్పటికప్పుడు మారుతున్న సవరణలను వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని న్యాయమూర్తులు పాల్గొన్నారు.

కడప తహసీల్దార్ అక్రమాస్తులపై ఏసీబీ దాడులు

- ఏకకాలంలో 9చోట్ల తనిఖీలు
- తిరుపతిలో అక్రమాస్తుల చిట్టా విప్పిన ఏసీబీ అధికారులు
- రేణిగుంట తహసీల్దార్‌గా పనిచేసిన కాలంలో అక్రమాలు
- కడప ఇంట్లో రూ. 36 లక్షలు స్వాధీనం
- అవి ఎన్నికల కోసం ప్రభుత్వం విడుదల చేసిందని చెబుతున్న తహసీల్దార్



తహసీల్దార్ శివప్రసాద్ కడపలోని నివాసంలో ఏసీబీ తనిఖీలు (ఇన్‌సెట్‌లో) శివప్రసాద్ (ఫైల్)

సాక్షి, తిరుపతి/కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా కడప మండల తహసీల్దార్ సిద్దల శివప్రసాద్ అక్రమాస్తులపై ఏసీబీ అధికారులు శనివారం ఏకకాలంలో 9చోట్ల సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీజీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏసీబీ అధికారులు తిరుపతి, పీలేరు, రేణిగుంట, కడపతో పాటు మొత్తం తొమ్మిది చోట్ల దాడులు చేశారు.కడపలోని ఆయన ఇంట్లో రూ.36 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎన్నికల ఖర్చుకోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్‌ఓ) కడప ఆర్డీఓ మధుసూదన్ నిధులను విడుదల చేసినట్లు తహసీల్దార్ అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. ఈ విషయంపై ఏసీబీ అధికారులు ఆర్డీఓను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆయన కుటుంబం నివాసముంటున్న తిరుపతి వైకుంఠపురంలోని ఇంట్లో విలువైన ల్యాండ్ డాక్యుమెంట్లు, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి వైకుంఠపురంలో 266.66స్క్వేయర్ యార్డుల విస్తీర్ణం కలిగిన జీప్లస్1 భవంతి, మాతృత్వ ఆస్పత్రి ప్రాంగణం, పీలేరులో 158.89స్క్వేయర్ యార్డుల విస్తీర్ణంలో నిర్మాణ దశలో ఉన్న జీప్లస్2 భవనం, తిరుపతి, రేణిగుంటలో 5 ఇంటిస్థలాలు, తిరుపతి దామినేడు పరిధిలో 33 సెంట్ల స్థలం, తిరుపతి చెర్లోపల్లిలో 1,685 అడుగుల స్థలం, తిరుపతి వైకుంఠపురంలోని అలంకృతి మాల్ తదితర స్థిరాస్తులను గుర్తించారు. అలాగే టొయోటా ఇన్నోవా, మహీంద్రా థార్ కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, రూ.2.31లక్షలు, 390 గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారి అనుచరులు, బంధువుల ఇళ్లలోనూ సోదాలు చేస్తున్నట్లు వివరించారు. సోదాలు కొనసాగుతున్నాయని, ఇంకా పెద్ద సంఖ్యలో అక్రమాస్తులు, లాకర్లలో దాచిన డాక్యుమెంట్లు, నగదు, బంగారు ఆభరణాలను కూడా గుర్తించినట్లు వివరించారు. రేణిగుంట మండలం తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో విలువైన ప్రభుత్వ భూములను రియల్టర్లకు ధారాదత్తం చేసి పెద్దమొత్తంలో అక్రమాస్తులను కూడబెట్టినట్లు ఆయనపై ఆరోపణలున్నాయి.

సిగ్గొదిలేసి పచ్చి అబద్ధాలు

కళ్లకు గంతలు కట్టుకుని లోకమంతా చీకటిగా ఉందన్నాడట ఒకడు. సరిగ్గా ఈనాడు రామోజీలాగ. ఆయనాగంతలు విప్పడు. విప్పితే వెలుగును చూడాల్సి వస్తుందన్న భయం. చూస్తే నిజాలు రాయాల్సి వస్తుందన్న జడుపు. నిజాలు రాస్తే తాను, తన 'బాబు' గల్లంతైపోతారన్న వణుకు. అందుకే ఆ చీకటిలోనే 'సిగ్గొ'దిలేసి పచ్చి అబద్ధాలు రాసేస్తున్నాడు. వైఎస్సార్‌సీపీ గత ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన పథకాల్లో 99 శాతం నెరవేర్చింది. జగమెరిగిన ఈ సత్యాన్నే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎమ్మిగనూరులో జరిగిన మేమంతా సిద్ధం సభలో చెప్పారు. హామీలు అమలు చేశారనేందుకు తిరుగులేని సాక్ష్యాలున్నాయి. కాని వాటిని చూసే దమ్ము..ధైర్యం రామోజీకి లేవు. సీఎం వైఎస్ జగన్ చెప్పిన విషయాలు అబద్ధాలంటూ పచ్చి అబద్ధాలను వండేశారు.

సాక్షి, అమరావతి: మహిళలు, పిల్లల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 58 నెలల కాలంలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.2.83 లక్షల కోట్లు వ్యయం చేశారు. ఇందులో నేరుగా డీబీటీ ద్వారా మహిళల ఖాతాల్లో రూ.1.89 లక్షల కోట్లు జమ చేశారు. నాన్ డీబీటీ ద్వారా మరో రూ.94,347 కోట్లు మహిళలు, పిల్లల కోసం వెచ్చించారు. ఇందుకు సాక్ష్యం రూ.5.85 కోట్ల ప్రయోజనాలు పొందిన మహిళలు, పిల్లలే. పేదల ఇళ్ల కోసం కొత్తగా 17,005 జగనన్న కాలనీలనే ఏర్పాటు చేశారు. ఏ ఊరు వెళ్లినా ఇవి కనిపిస్తాయి. 31 లక్షల మంది మహిళల పేరిట ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాల విషయంలో అనుసరిస్తున్న విధానాన్ని కేంద్ర పట్టణ గృహ నిర్మాణ శాఖ ప్రశంసించింది. ప్రత్యేక హోదాను ముగిసిన అధ్యాయంగా చంద్రబాబు పాతరేస్తే.. ప్రత్యేక హోదా నినాదాన్ని సజీవంగా ఉంచింది సీఎం జగన్. దశలవారీగా మద్య నియంత్రణలో భాగంగా మద్యం ధరలను షాక్ కొట్టేలాగ పెంచి వినియోగాన్ని తగ్గించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థపై 14 నిముషాల పాటు సీఎం జగన్ మాట్లాడటం పెద్ద నేరంగా, తప్పుగా ఈనాడు రామోజీ చిత్రీకరించడం చూస్తుంటే వ్యక్తిగత కక్ష ఎంత ఉందో అర్థం అవుతుందని పరిశీలకులు అంటున్నారు. విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఉన్నత చదువులు చదివిస్తున్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా అక్షరాస్యతను పెంచే చర్యలను చేపట్టారు. బాల్య వివాహాలు తగ్గించేందుకు తీసుకున్న



చర్యలు ఫలితాలను ఇచ్చింది. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాకు వధువులు కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన విధించడం ద్వారా అక్షరాస్యతను పెంచడం, మరో పక్క బాల్య వివాహాలను నిరోధించడం, ఉన్నత విద్య అభ్యసించేలాగ చర్యలను తీసుకున్నారు. దీని వల్ల బాల్య వివాహాలు తగ్గిన విషయాన్ని సీఎం జగన్ ఈ సభలో చెప్పారు. దీన్ని వక్రబుద్ధితో చూసి సిగ్గులేని తనాన్ని ఈనాడు రామోజీ బయటపెట్టుకున్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారిన విషయం ప్రతీ ఊరిలో కనిపిస్తోంది. ఒక గుడ్డి ఈనాడు రామోజీకి తప్ప. నాడు–నేడు ద్వారా స్కూళ్లను తీర్చిదిద్దడాన్ని చూసిన తరువాతనే కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకం అమలు చేస్తోంది. 58 నెలల సీఎం జగన్ పాలనలో మొత్తం డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.4.54 లక్షల కోట్లు పేదలకు ఆర్థిక సాయం అందింది. ఇందులో డీబీటీ ద్వారా రూ.2.70 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. 2014 ఎన్నికల ముందు రైతులకు, పొదుపు సంఘాల మహిళలు, యువతకు, చేనేత కార్మికులకు, పేదలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయకుండా మోసం చేస్తే.. వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి మళ్లీ ప్రజల దగ్గరకు వెళ్లి ధైర్యంగా ఓటు వేయమని అడుగుతున్నారు.



రైతులకు ఇచ్చిన హామీల అమల్లో చంద్రబాబుకు, సీఎం వైఎస్ జగన్‌కు తేడా ఇలా..

- 2014 ఎన్నికల ముందు చంద్రబాబు వ్యవసాయ రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తాను అని అధికారంలోకి వచ్చాక రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలను షరతులతో తగ్గించేసి కేవలం రూ.13,500 కోట్లతో సరిపెట్టారు.
- 2019 ఎన్నికల ముందు వైఎస్ జగన్ వైఎస్సార్ రైతు భరోసా కింద రైతులకు ఏడాదికి 12,500 చొప్పున ఒక్కో రైతుకు నాలుగేళ్లలో 50,000 రూపాయలు ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ రైతు భరోసా సాయాన్ని ఏడాదికి 13,500కు పెంచి ఒక్కో రైతుకు ఐదేళ్లలో 67,500 రూపాయలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.
- 58 నెలల కాలంలో వైఎస్సార్ రైతు భరోసా కింద 53.58 లక్షల మంది రైతులకు రూ.34,378.16 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

గత 58 నెలల కాలంలో మహిళా లబ్ధిదారుల కోసం అమలు చేసిన పథకాలు వివరాలు ఇలా

పథకం పేరు	నేరుగా ఖాతాల్లో నగదు జమ (రూ.కోట్లలో)
1. జగనన్న అమ్మ ఒడి	26,067.30
2. జగనన్న వసతి దీవెన	4,275.76
3. జగనన్న విద్యా దీవెన	12,609.68
4. వైఎస్సార్ రైతు భరోసా	14,439.00
5. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు (రైతులు)	205.05
6. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	815.40
7. వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీలు)	4,969.04
8. వైఎస్సార్ పెన్షన్ కానుక	58,509.40
9. వైఎస్సార్ చేయూత	19,189.59
10. వైఎస్సార్ ఆసరా	25,570.79
11. వైఎస్సార్ కాపు నేస్తం	2,029.92
12. వైఎస్సార్ నేతన్న నేస్తం	280.00
13. జగనన్న చేదోడు	404.58
14. వైఎస్సార్ వాహన మిత్ర	97.00
15. డా.వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	720.18
16. వైఎస్సార్ ఈబీసీ నేస్తం	1,876.97
17. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	4,736.18
18. వైఎస్సార్ కళ్యాణమస్తు/షాదీకా తోఫా	427.27
19. ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులకు నేరుగా జమ	12,295.97
మొత్తం డీబీటీ	1,89,519.07
20. జగనన్న తోడు	2,025.00
21. జగనన్న గోరుముద్ద	2,669.00
22. వైఎస్సార్ సంపూర్ణ పోషణ	9,894.00
23. జగనన్న విద్యా కానుక	1,784.26
24. ఇంటి స్థలాలు	77,975.00
మొత్తం నాన్ డీబీటీ	94,347.26
డీబీటీ, నాన్ డీబీటీ మొత్తం	2,83,866.33



మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఇలపర్రు, గుడిపాడుకు చెందిన శెట్టి బలిజ మహిళలు

వైఎస్సార్‌సీపీలోకి వెల్లువెత్తుతున్న వలసలు

పెనుగొండ/భీమవరం/పాలకొల్లు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు రోజురోజుకూ వెల్లువెత్తుతున్నాయి. ఆచంట నియోజకవర్గంలో టీడీపీ, ఇతర పార్టీలతో పాటు పలు సంఘాల నాయకులు మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇలపర్రు, గుడిపాడుకు చెందిన టీడీపీ మద్దతుదారులైన పలువురు శెట్టిబలిజ మహిళలు, ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. అలాగే, ములపర్రు పుల్లెలవారిపేట నుంచి టీడీపీ, ఇతర పార్టీలకు చెందిన పలువురు నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. భీమవరం పట్టణానికి చెందిన దళిత క్రైస్తవులైన 50 కుటుంబాలు ఎమ్మెల్యే ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) సమక్షంలో అరట్లకట్టలో టీడీపీకి చెందిన 90 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన భీమవరం పట్టణానికి చెందిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న గ్రంధి శ్రీనివాస్



టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గోపి

బాబుకు ఊడిగం చేయించాలని చూస్తే ఊరుకోం

మంద కృష్ణమాదిగకు నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు హెచ్చరిక



నెహ్రూనగర్: రాష్ట్ర వ్యాప్తంగా పెల్లుబికిన మాదిగ జాతి ఆగ్రహ జ్వాలలకు భయపడి మంద కృష్ణమాదిగ తోక ముడిచారని, టీడీపీకి అనుకూలంగా గుంటూరులో నిర్వహించతలపెట్టిన సభను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పోలీసులు అనుమతి నిరాకరించారంటూ సాకుగా చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. మంద కృష్ణమాదిగ గతంలో తలపెట్టిన ఏ సభలకు పోలీసుల అనుమతి లేదన్న వాస్తవం అందరికీ తెలిసిందేనని ఆయన వ్యాఖ్యానించారు. ఇది కచ్చితంగా నిజమైన మాదిగల విజయమని ఆయన తెలిపారు.టీడీపీకి మద్దతుగా చంద్రబాబు డైరెక్షన్‌లో ఈ నెల 30న గుంటూరులో మంద కృష్ణమాదిగ సదస్సు నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆరునూరైనా సభను అడ్డుకుని తీరతామని చేసిన హెచ్చరికలకు అనుగుణంగా పరిశపోగు నేతృత్వంలో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో మాదిగలు గుంటూరు చేరుకోవడం.. తదితర పరిణామాల నేపథ్యంలో కృష్ణమాదిగ ఆఖరి నిమిషంలో సభను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై హిందూ కాలేజ్ సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద పరిశపోగు మాట్లాడారు.



ద్రవిడ నేలపై కమలం వికసించేనా?

తమిళనాడుపై బీజేపీ ఫోకస్

అన్నామలై రాకతో ఫుల్ జోష్ | అన్నాడీఎంకే ఓటు బ్యాంకుపై కన్ను | చిన్న పార్టీలతోనే కమలనాథుల పొత్తు | ఆసక్తి రేపుతున్న ముక్కోణపు పోటీ



స్టేట్ స్కాన్

దక్షిణాదిని పాదాక్రాంతం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రధా నంగా తమిళనాడుపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ద్రవిడ పార్టీల ఆవిర్భావంతో దశా బ్దాలుగా జాతీయ పార్టీలకు ఆ రాష్ట్రం కొరకరాని కొయ్యగా మారిపోయింది. డీఎంకే, అన్నాడీఎంకేల్లో ఏదో ఒకదానికి తోక పార్టీగా కొనసాగడం మినహా కాంగ్రెస్, బీజేపీలకు మరో దారి లేని పరిస్థితి! ఈసారి ఈ పరిస్థితిని ఎలాగైనా మార్చాలని బీజేపీ కంకణం కట్టుకుంది. కె.అన్నామలై రాష్ట్ర బీజేపీ పగ్గాలు చేపట్టిన నాటినుంచీ దూకుడుగా వెళ్తున్నారు. రాష్ట్రమంతటా కలియదిరుగుతూ ఇటు జనాన్ని ఆకట్టుకుంటున్నారు. మంత్రుల అవినీతిపై వీడియోలు విడుదల చేస్తూ అటు అధికార డీఎంకేకు వణుకు పుట్టిస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 39 లోక్‌సభ స్థానాలకూ ఏప్రిల్19న తొలి విడతలోనే పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో తమిళనాట ఎన్నికల వేడి ఇప్పటికే పరాకాష్టకు చేరింది...

జాతీయ పార్టీలతో కుర్చీలాట

తమిళనాట 50 ఏళ్లుగా ద్రవిడ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలదే హవా. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 1967లో డీఎంకే తొలిసారి ఓటమి రుచి చూపింది. 234 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా డీఎంకే 179 చోట్ల గెలవగా కాంగ్రెస్ 51 స్థానాలకు పరిమితమైంది. నాటినుంచి నేటిదాకా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాలేకపోయింది! కరుణానిధితో విభేదాలతో 1972లో ఎంజీ రామచంద్రన్ డీఎంకేను చీల్చి అన్నాడీఎంకేను ఏర్పాటు చేశారు. నాటినుంచీ వాటి మధ్యే ప్రధాన పోరు సాగుతూ వస్తోంది. జాతీయ రాజకీయాల్లో సంకీర్ణ యుగం ఆవిర్భావంతో 1989 నుంచి రెండు దశాబ్దాల పాటు కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో డీఎంకే, అన్నాడీఎంకే కీలక పాత్ర పోషించాయి. ఆ క్రమంలో రాష్ట్రంలోనూ కాంగ్రెస్, బీజేపీలతో మార్చి మార్చి పొత్తు పెట్టుకుంటూ వస్తున్నాయి. డీఎంకే 2004 దాకా కాంగ్రెస్‌కు బద్ధ విరోధిగా కొనసాగింది. అన్నాడీఎంకే కేంద్రంలో వాజ్‌పేయి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడంతో 1999లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిలో చేరింది. కానీ 2004లో అన్నాడీఎంకే మళ్లీ ఎన్డీఏ గూటికి చేరడంతో డీఎంకే తన వైఖరి మార్చుకుని కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. నాటినుంచీ 2014లో మినహాయిస్తే వాటి బంధం అన్ని ఎన్నికల్లోనూ కొనసాగుతూ వస్తోంది. ఇక అన్నాడీఎంకే తాను తొలిసారి ఎన్నికల బరిలో 1977లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. తర్వాత 1984 నుంచి 1991 ఎన్నికల దాకా వాటి బంధం సాగింది. 1998లో తొలిసారి బీజేపీతో చేతులు కలిపినా ఏడాదికే మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరింది. 2004లో మళ్లీ బీజేపీతో జట్టు కట్టింది. అప్పటి నుంచీ కాంగ్రెస్‌ను దూరం పెట్టింది. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం నేపథ్యంలో 2009, 2014 ఎన్నికల్లో బీజేపీతో బంధం తెంచుకుంది. 2019లో మళ్లీ ఎన్డీఏలో చేరినా ఈసారి మాత్రం ఒంటరిగానే పోటీ చేస్తోంది. చిన్న పార్టీలైన పీఎంకే, ఎండీఎంకే కూడా పరిస్థితిని బట్టి డీఎంకే, అన్నాడీఎంకేలతో పొత్తు పెట్టుకుంటూ వస్తున్నాయి.

పొత్తులు ఇలా...

డీఎంకే ఈసారి కూడా చిరకాల మిత్రులు కాంగ్రెస్, వామపక్షాలతో పొత్తు పెట్టుకోగా అన్నాడీఎంకే మాత్రం బీజేపీతో దూరం పాటిస్తోంది. దివంగత నటుడు విజయ్‌కాంత్‌కు చెందిన డీఎండీకేతో పొత్తు పెట్టుకుంది. ఇక బీజేపీ ఈసారి పీఎంకే, ఏఎంఎంకే, టీఎంసీ (ఎం) వంటి చిన్న పార్టీలతో జట్టు కట్టింది. 1999లో రాష్ట్రంలో అత్యధికంగా 4 లోక్‌సభ స్థానాల్లో నెగ్గిన బీజేపీ ఈసారి ఆ రికార్డును అధిగమించాలని పట్టుదలతో ఉంది. పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాట పర్యటనలతో హోరెత్తిస్తున్నారు. ఈ మధ్యకాలంలోనే రాష్ట్రానికి ఆయన ఏకంగా ఆరుసార్లు వచ్చారు.

ఎవరెన్ని సీట్లలో...

తమిళనాట ఎన్డీఏ, ఇండియా, అన్నాడీఎంకే కూటముల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఇండియా కూటమిలో డీఎంకే 22 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తోంది. కాంగ్రెస్‌కు 9, వామపక్షాలకు 4, ఇతర పార్టీలకు మరో 4 స్థానాలు కేటాయించింది. ఎన్డీఏ కూటమి విషయానికొస్తే బీజేపీ 20 చోట్ల, పీఎంకే 10, టీఎంసీ(ఎం) 3, ఏఎంఎంకే 2 చోట్ల, ఇతర పార్టీలు మూడింట బరిలో ఉన్నాయి. మరోచోట ఎన్డీఏ మద్దతుతో ఒ.పన్నీర్‌సెల్వం స్వతంత్రునిగా బరిలో దిగుతున్నారు. ఇక అన్నాడీఎంకే 32 స్థానాల్లో పోటీ చేస్తోంది. డీఎండీకేకు 5, ఇతరులకు 2 సీట్లు కేటాయించింది.

యువ ఓటర్లపైనే బీజేపీ ఆశలు...


తమిళనాట బీజేపీ ప్రధానంగా యువ ఓటర్లపైనే ఆశలు పెట్టుకుంది. ద్రవిడ పార్టీలతో విసిగిపోయారని, మార్పు కోసం చూస్తున్నారని నమ్ముతోంది. బీజేపీ రాష్ట్ర సారథి అన్నామలైకి వారిలో ఆదరణ నానాటికీ పెరుగుతోందని పరిశీలకులు చెబుతున్నారు. దీనికితోడు ద్రవిడ పార్టీల నేతలపైనా బీజేపీ కన్నేసింది. ఇప్పటికే అన్నాడీఎంకేకు చెందిన ఒక మాజీ ఎంపీ, 17 మంది మాజీ ఎమ్మెల్యేలు ఇటీవలే బీజేపీలో చేరారు. దక్షిణ తమిళనాట పదేళ్లుగా తమకు గట్టి పునాదే ఏర్పడిందని పార్టీ భావిస్తోంది. అక్కడి కొంగు ప్రాంతంలో పార్టీకి సంస్థాగతంగా చెప్పుకోదగ్గ బలమే ఉంది. దీనికితోడు కోయంబత్తూరు నుంచి రాష్ట్ర పార్టీ సారథి అన్నామలై పోటీ చేస్తున్నారు. పీఎంకేతో పొత్తు ద్వారా ఉత్తర తమిళనాడులో తన బలహీనతను అధిగమిస్తానని బీజేపీ భావిస్తోంది. 2014లోనూ ఇలాగే చిన్న పార్టీలతో జట్టు కట్టి బీజేపీ ఏకంగా 19 శాతం ఓట్లు రాబట్టడమే గాక ఒక లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుందని ఆ పార్టీ అభిమానులు గుర్తు చేస్తున్నారు. కాకపోతే అప్పటి భాగస్వాముల్లో డీఎండీకే, ఎండీఎంకే ఇప్పుడు ఎన్డీఏతో లేవు. పైగా ముక్కోణపు పోటీలో విపక్షాల ఓట్లు చీలి ఇండియా కూటమికే లబ్ధి చేకూరవచ్చన్న విశ్లేషణలున్నాయి.



ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్తుత ఇండియా కూటమి ఏకంగా 53 శాతం ఓట్లు ఒడిసిపట్టింది! ఎన్డీఏ కేవలం 10 శాతంతో సరిపెట్టుకోగా అన్నాడీఎంకే కూటమికి 21 శాతం వచ్చాయి. అయితే ఈసారి ఏఎంఎంకే వంటి భాగస్వాములు అన్నాడీఎంకే ఓటు శాతానికి గండి కొట్టి తమవైపు మళ్లిస్తాయని బీజేపీ ఆశ పెట్టుకుంది. అన్నాడీఎంకే ఓట్లను ఏకంగా మూడొంతల దాకా ఒడిసిపట్టడంతో పాటు మోదీ చరిష్మా, స్టాలిన్ సర్కారుపై వ్యతిరేకత సాయంతో ఇండియా కూటమి ఓట్లలోనూ 10 శాతం దాకా ఎన్డీఏ కొల్లగొట్టగలిగితే 7 సీట్ల దాకా నెగ్గవచ్చని విశ్లేషకుల అంచనా. కాకపోతే అన్నాడీఎంకే ఓటు శాతానికి అంతగా గండి పెట్టడం బీజేపీకి పెనుసవాలే!

ప్రచారంలో సినీ తళుకులు..

బీజేపీ తరఫున సినీ నటులు ఖుష్బూ, ఇటీవలే తన పార్టీని విలీనం చేసిన శరత్ కుమార్, సెంథిల్ ప్రచారంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. డీఎంకేకు కమల్‌హాసన్, అన్నాడీఎంకేకు గౌతమి, గాయత్రీ రఘురాం తదితర సినీ స్టార్లు ప్రచారం చేయనున్నారు.



ఎవరి సర్వేలు ఏమంటున్నాయి...


సీఎన్ఎన్–న్యూస్ 18 సర్వే ఈసారి ఎన్డీఏకు రాష్ట్రంలో 5 సీట్ల దాకా వస్తాయని పేర్కొనగా ఇండియాటుడే సర్వే మాత్రం మొత్తం 39 సీట్లనూ విపక్ష ఇండియా కూటమి క్లీన్‌స్వీప్ చేస్తుందని జోస్యం చెప్పింది.

భార్యను భూతం పిశాచి అనడం క్రూరత్వం కాదు

పట్నా హైకోర్టు స్పష్టీకరణ

పట్నా: వైవాహిక జీవితం విఫలమైన సందర్భంలో ఒక భర్త తన భార్యను భూతం, పిశాచి అంటూ దూషించడం క్రూరత్వం కాదని పట్నా హైకోర్టు తేల్చిచెప్పింది. తననుంచి విడాకులు తీసుకున్న మహిళ ఫిర్యాదుపై కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆమె మాజీ భర్త దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. జార్ఖండ్‌లోని బొకారోకు చెందిన నరేశ్‌కుమార్‌గుప్తాకు 1993లో బిహార్‌లోని నవదా పట్టణానికి చెందిన మహిళతో వివాహం జరిగింది. అదనపు కట్నం కింద కారు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తన భర్త, అతడి తండ్రి సహదేవ్ గుప్తా కలిసి తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ ఆమె 1994లో నవదాలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. తండ్రీకుమారులపై కేసు నమోదైంది. వారిద్దరి విజ్ఞప్తి మేరకు ఈ కేసు నలందా జిల్లాకు బదిలీ అయ్యింది. నరేశ్‌కుమార్ గుప్తా, సహదేవ్ గుప్తాకు 2008లో నలందా కోర్టు ఏడాదిపాటు కఠిన కారాగార శిక్ష విధించింది. దీనిని వ్యతిరేకిస్తూ వారిద్దరూ అదనపు సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. వారి అప్పీల్‌ను పదేళ్ల తర్వాత కోర్టు తిరస్కరించడంతో పట్నా హైకోర్టుకు వెళ్లారు. ఇంతలో జార్ఖండ్ హైకోర్టు విడాకులు మంజూరు చేసింది. 21వ శతాబ్దంలో ఒక మహిళను ఆమె అత్తింటివారు భూతం, పిశాచి అంటూ ఘోరంగా దూషించడం దారుణమని విడాకులు తీసుకున్న మహిళ తరఫున ఆమె లాయర్ వాదించారు. ఇది ముమ్మాటికీ క్రూరత్వమేనని, తండ్రీ కుమారులను కఠినంగా శిక్షించాలని కోరారు. అందుకు జస్టిస్ బిబేక్ చౌదరి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం నిరాకరించింది. విఫలమైన వివాహ బంధాల్లో దంపతులు పరస్పరం దూషించుకొనే సందర్భాలు చాలా వస్తుంటాయని అభిప్రాయపడింది. భర్త తన భార్యను భూతం, పిశాచి అంటూ దూషించడం క్రూరత్వం కిందికి రాదని తేల్చిచెప్పింది. పైగా సదరు మహిళ నిర్దిష్టంగా ఏ ఒక్కరిపైనా ఆరోపణలు చేయలేదని పేర్కొంది. కింది కోర్టులు ఇచ్చిన తీర్పులను కొట్టివేసింది.

మద్యం కుంభకోణంలో ఢిల్లీ మంత్రి కైలాశ్ గహ్లోత్‌ను ప్రశ్నించిన ఈడీ



న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ అధికారులు వేగం పెంచారు. దీనితో ముడిపడ్డ మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నేత కైలాశ్ గహ్లోత్‌ను ఈడీ శనివారం దాదాపు 5 గంటలపాటు ప్రశ్నించారు. ఆయన వాంగ్మూలం నమోదు చేసింది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సన్నిహితుడైన గహ్లోత్ హోం, రవాణా, న్యాయ శాఖల మంత్రిగా పనిచేస్తున్నారు. ఈడీ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 11.30 గంటలకు ఆయన ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. వివాదాస్పద 2021–22 ఢిల్లీ మద్యం పాలసీని రూపొందించిన మంత్రుల బృందంలో గహ్లోత్ కూడా ఉన్నారు. చార్జిషీట్‌లో ఆయన పేరునూ ఈడీ చేర్చింది. మద్యం విధానం ముసాయిదా తయారీ సందర్భంగా ఆప్ కమ్యూనికేషన్ల ఇన్‌చార్జి విజయ్ నాయర్ ఢిల్లీలోని గహ్లోత్ అధికారిక నివాసాన్ని ఉపయోగించుకున్నట్లు గుర్తించింది. ప్రజాప్రతినిధికి కేటాయించిన అధికారిక బంగ్లాను మరొకరు వాడటం నేరమేనని, దీనిపై చర్యలు తీసుకోవాలని సీబీఐకి సూచించింది. గహ్లోత్ ఒకే సిమ్ కార్డు వాడినా సెల్‌ఫోన్ ఐఎంఈఐ నెంబర్ మూడుసార్లు మారినట్లు ఈడీ ఆరోపించింది

రూ.46 కోట్లు కట్టు!

పీజీ విద్యార్థికి ఐటీ నోటీసు

గ్వాలియర్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ప్రమోద్ దండోతియా(25) అనే పీజీ విద్యార్థి ఏకంగా రూ.46 కోట్ల ఆదాయ పన్ను నోటీసు అందుకున్నాడు! దాంతో షాకై పోలీసులను ఆశ్రయించాడు. తన పాన్ కార్డు వివరాల ద్వారా ఎవరో ఢిల్లీ, పుణేల్లో తన పేరిట ఓ కంపెనీని సృష్టించి ఈ లావాదేవీలు జరిపినట్లు ఐటీ, జీఎస్టీ అధికారుల ద్వారా తెలిసిందని బాధితుడు చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారతనికి సూచించారు. ఐటీ నోటీసులు, ఇతర ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ప్రమోద్‌కు చెప్పినట్టు ఏఎస్పీ షియాజ్ తెలిపారు. దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

అన్సారీ అంత్యక్రియలు పూర్తి

లక్నో: గ్యాంగ్‌స్టర్, రాజకీయ నేత ముఖ్తార్ అన్సారీ అంత్యక్రియలు శనివారం యూపీలోని గాజీపూర్‌లో ముగిశాయి. వేలాది మంది అన్సారీకి మద్దతుగా నినాదాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. పట్టణంలో 144 సెక్షన్ అమలు చేశారు. కొందరు శ్మశాన వాటికలోకి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించగా అడ్డుకున్నారు. అన్సారీ సోదరుడు, ఎంపీ అఫ్జల్ అన్సారీ, ఘాజీపూర్ జిల్లా మేజిస్ట్రేట్ ఆర్యక అఖౌరీ మధ్య ఈ సందర్భంగా కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.

పెరూ అధ్యక్షురాలి ఇంట్లో 'రోలెక్స్'ల కోసం సోదాలు!



లీమా: రోలెక్స్ గేట్ వ్యవహారం పెరూను కుదిపేస్తోంది. అధ్యక్షురాలు డినా బొలార్టే వద్ద 10కి పైగా అతి ఖరీదైన లెక్స్ గడియారాలున్నాయన్న ఆరోపణలపై దర్యాప్తు మొదలైంది. వాటికోసం కోర్టు ఆదేశాలతో లిమాలోని ఆమె నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించారు! సోదాలను టీవీ చానల్‌లో ప్రసారం చేశారు. వాచ్‌లు దొరికాయో లేదో వెల్లడించలేదు. తనవద్ద 18 ఏళ్ల వయసులో సొంత డబ్బులతో కొనుక్కున్న ఒకే రోలెక్స్ ఉందని డినా అంటున్నారు.

అరుణాచల్‌లో 10 ఏకగ్రీవాలు

ఇటానగర్: అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం పెమా ఖండూ, డిప్యూటీ సీఎం చౌనా మెయిన్ సహా 10 మంది బీజేపీ అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైంది. శనివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సరికి ఆయా నియోజకవర్గాల్లో వారు మాత్రమే బరిలో మిగిలారు. దాంతో వారు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనట్టు చీఫ్ ఎలక్టోరల్ అధికారి పవన్ కుమార్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో అరుణాచల్‌లోని మిగతా 60 అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు రెండు లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19వ తేదీన తొలి విడతలో పోలింగ్ జరగనుంది.

కాంగ్రెస్ పార్టీకి మరో రెండు ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ/బెంగళూరు: దేశంలో ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శనివారం ఆరోపించారు. ఆదాయపు పన్ను విభాగం నుంచి తమ పార్టీకి శుక్రవారం రాత్రి మరో రెండు నోటీసులు వచ్చాయన్నారు. పెనాల్టీలు, వడ్డీల కింద రూ.1,823 కోట్లు చెల్లించాలంటూ కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులందడం తెలిసిందే. వీటిని వ్యతిరేకిస్తూ శనివారం కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనకు దిగింది. మరోవైపు, ఇప్పటికే పరిష్కారమైన కేసులో తనకూ ఐటీ నోటీసులొచ్చాయని కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చెప్పారు.

సునీతా కేజ్రీవాల్‌తో కల్పనా సోరెన్ భేటీ



శనివారం ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతను కలిసిన జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరేన్ భార్య కల్పన

న్యూఢిల్లీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ శనివారం ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్‌ను కలిశారు. ఢిల్లీలోని ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులో ఉన్న సీఎం నివాసానికి ఆమె వెళ్లారు. సునీతా కేజ్రీవాల్, కల్పనా సోరెన్‌లు సుమారు 20 నిమిషాల సేపు మాట్లాడుకున్నారని అధికారులు తెలిపారు. అనంతరం కల్పన మీడియాతో మాట్లాడారు. 'సునీతా జీతో ఆవేదన, బాధను పంచుకునేందుకు ఇక్కడికి వచ్చా. ఆమె తన పరిస్థితిని వివరించారు. తుది వరకు పోరాడాలని ఇద్దరం నిర్ణయించుకున్నాం. యావత్తూ జార్ఖండ్ ప్రజలు కేజ్రీవాల్ వెన్నంటే ఉంటారు'అని చెప్పారు. 'జార్ఖండ్‌లో రెండు నెలల క్రితం జరిగిందే ఢిల్లీలో పునరావృతమైంది. నా భర్త హేమంత్ జైలుకు వెళ్లారు. కేజ్రీవాల్ కస్టడీలో ఉన్నారు. జార్ఖండ్, ఢిల్లీల్లో పరిస్థితులు ఒకేలా ఉన్నాయి'అని చెప్పారు. కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీని కలిసి, పరిస్థితిని వివరిస్తానన్నారు. భూకుంభకోణం మనీ లాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్‌ను ఈడీ జనవరిలో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా, కల్పనా సోరెన్, జార్ఖండ్ సీఎం చంపాయి సోరెన్‌తోపాటు ఆదివారం ఢిల్లీలో జరిగే ఇండియా కూటమి ర్యాలీలో పాల్గొంటారని సమాచారం. సునీతా కేజ్రీవాల్ కూడా ర్యాలీలో పాలు పంచుకుంటారని ఆప్ నేతలు తెలిపారు.

పీవీ, చరణ్ సింగ్ సహా నలుగురికి భారతరత్న ప్రదానం



శనివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి భారతరత్న పురస్కారం స్వీకరిస్తున్న బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్ కుమారుడు రాంనాథ్, వ్యవసాయవేత్త ఎంఎస్ స్వామినాథన్ కుమార్తె నిత్యా రావు, చరణ్‌సింగ్ మనవడు జయంత్

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ప్రధాన మంత్రులు పీవీ నరసింహారావు, చౌదరి చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌లకు మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం ప్రదానం చేశారు. పీవీ నరసింహారావు తరఫున ఆయన కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు, చరణ్ సింగ్ తరఫున ఆయన మనవడు జయంత్ చౌదరి, ఎంఎస్ స్వామినాథన్ తరఫున ఆయన కుమార్తె నిత్యా రావు, కర్పూరీ ఠాకూర్ తరఫున కుమారుడు రాంనాథ్ ఠాకూర్ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవీ సేవలను స్మరించుకుంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బీజేపీ నేత ఎల్‌కే అద్వానీకి భారతరత్న పురస్కారాన్ని ఆదివారం ఆయన నివాసంలో రాష్ట్రపతి ప్రదానం చేయనున్నారు.

ఎలక్షన్ బీట్



ఎన్నికల విచిత్రం

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తమిళనాడులోని సేలంలో డీఎంకే అభ్యర్థి సెల్వగణపతితో పాటు టీ కొట్టులో చాయ్ తాగుతున్న పార్టీ చీఫ్, సీఎం ఎంకే స్టాలిన్

హస్తినలో విపక్షాల ర్యాలీ నేడే

ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఆప్

న్యూఢిల్లీ: 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' నినాదంతో విపక్ష ఇండియా కూటమి ఆదివారం తలపెట్టిన భారీ ర్యాలీకి సర్వం సిద్ధమైంది. ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో ఇందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. కూటమిలోని 29 పార్టీలూ ర్యాలీలో పాల్గొంటాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్‌గాంధీతో పాటు కూటమికి చెందిన పలువురు నేతలు ప్రసంగిస్తారన్నారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా పాల్గొనే అవకాశముందని చెప్పారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు అడ్డంగా దుర్వినియోగం చేస్తోందని, ర్యాలీలో దీన్ని ప్రధానంగా ప్రస్తావిస్తామని తెలిపారు. డెరిక్ ఒబ్రియాన్ (టీఎంసీ), తిరుచ్చి శివ (డీఎంకే), అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), శరద్ పవార్ (ఎన్సీపీ–ఎస్‌సీపీ), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), సీతారాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తీ (పీడీపీ) తదితరులు పాల్గొంటారన్నారు. ఇండియా కూటమి భాగస్వామి ఆమ్ ఆద్మీ పార్టీ ఈ ర్యాలీని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. పార్టీ సారథి, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణం కేసులో జైలుపాలైన నేపథ్యంలో ర్యాలీకి భారీగా జన సమీకరణ చేసి సత్తా చాటాలని పట్టుదలగా ఉంది.

రాజ్‌నాథ్ సారథ్యంలో మేనిఫెస్టో కమిటీ

27 మందితో ఏర్పాటు చేసిన బీజేపీ

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు మేనిఫెస్టో రూపకల్పనకు గాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలో బీజేపీ 27 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కన్వీనర్‌గా, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ కో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. పార్టీ ఎన్నికల హామీలపై ఈ కమిటీ మేధో మథనం చేయడంతోపాటు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి సూచనలను స్వీకరించనుంది. ఇందులో కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్, భూపేంద్ర యాదవ్, కిరెన్ రిజిజు, అర్జున్ ముండా, అర్జున్ రామ్ మేఘ్వాల్, స్మృతి ఇరానీ, రాజీవ్ చంద్ర శేఖర్ ఉన్నారు. బీజేపీ పాలిత గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, అస్సాం సీఎం హిమాంత బిశ్వ శర్మ, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు డియో సాయి కూడా కమిటీలో ఉన్నారు. శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధరా రాజే వంటి సీనియర్ నేతలకు కూడా బీజేపీ అధిష్టానం స్థానం కల్పించింది. క్రైస్తవులు, ముస్లింలకు ఆంటోనీ, మన్సూర్‌లు ప్రాతినిధ్యం వహించనున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, రాజస్తాన్ సీఎం భజన్‌లాల్ శర్మ పేర్లు కమిటీలో లేవు.

పోటీపై 3న నిర్ణయం: సుమలత

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికల్లో పోటీపై తన నిర్ణయాన్ని ఏప్రిల్ 3న వెల్లడిస్తానని మండ్య ఎంపీ, సినీ నటి సుమలత పేర్కొన్నారు. 2019లో బీజేపీ మద్దతుతో ఇండిపెండెంట్‌గా నెగ్గిన ఆమె ఈసారి కూడా ఎన్డీఏ తరఫున టికెట్ ఆశించారు. కానీ పొత్తులో భాగంగా మండ్య స్థానాన్ని జేడీ(ఎస్)కు బీజేపీ కేటాయించింది. మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి అక్కడి నుంచి బరిలో దిగుతున్నారు. 2019లో ఇక్కడ కుమారస్వామి కుమారుడు నిఖిల్‌ను సుమలత ఓడించడం విశేషం.ఈ నేపథ్యంలో ఏప్రిల్ 3న మండ్యలోనే తన భావి నిర్ణయాన్ని ప్రకటిస్తానని ఆమె ఆదివారం ప్రకటించారు. సుమలతను అనునయించేందుకు కర్నాటక బీజేపీ చీఫ్ విజయేంద్ర యడ్యూరప్ప విఫలయత్నం చేశారు.

కార్యకర్తలే నాకు స్ఫూర్తి: మోదీ

తిరువనంతపురం: లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం కేరళలో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలు అహోరాత్రాలు చెమటోడుస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. నమో యాప్ ద్వారా శనివారం ఆయన వారితో ముచ్చటించారు. అధికార లెఫ్ట్ కూటమి నుంచి ఎన్ని అడ్డంకులు ఎదురవుతున్నా బీజేపీ కార్యకర్తలు చూపుతున్న పట్టుదల, ఉత్సాహం ప్రశంసనీయమన్నారు. వారి త్యాగం, క్రమశిక్షణ, కష్టించే తత్వం తనకు స్ఫూర్తిగా నిలిచి శక్తినిస్తున్నాయని మోదీ అన్నారు. ఇంటింటికీ వెళ్లి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేపట్టినట్టు కార్యకర్తలు ఆయనకు వివరించారు. కేరళలో ఏప్రిల్ 26న రెండో విడతలో పోలింగ్ జరగనుంది.

బారామతిలో ప'వార్'

కీలక లోక్‌సభ స్థానంలో వదినా మరదళ్ల పోరు

ముంబై: మహారాష్ట్రలోని బారామతి లోక్‌సభ స్థానంలో ఈసారి ఎన్నికలు రంజుగా మారుతున్నాయి. ఇక్కడ వదిన మరదళ్ల పోరు తప్పదని తేలిపోయింది. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) నుంచి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ అభ్యర్థిత్వాన్ని శనివారం ఖరారు చేశారు. ఇక్కడ ఎన్సీపీ(శరద్ పవార్) నుంచి శరద్ పవార్ కుమార్తె, అజిత్ పవార్‌కు సోదరి వరుసయ్యే సుప్రియా సూలే మరోసారి బరిలోకి దిగబోతున్నారు. బారామతిలో పవార్ కుటుంబానికి గట్టి పట్టుంది. దాదాపు సమానమైన అంగబలం, అర్థబలం కలిగిన వదిన మరదళ్లలో విజయం ఎవరిని వరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. బారామతి నుంచి పోటీ చేయడానికి అవకాశం దక్కడం పట్ల సునేత్ర పవార్ ఆనందం వ్యక్తం చేశారు. ఇది తనకు లక్కీ డే అని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతోపాటు శివసేన, బీజేపీ, ఎన్సీపీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. తన సామర్థ్యంపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించారని పేర్కొన్నారు.

బీజేపీలో చేరిన శివరాజ్ పాటిల్ కోడలు

ముంబై: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ కోడలు అర్చనా పాటిల్ శనివారం బీజేపీలో చేరారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. మరాఠ్వాడాలోని నాందేడ్‌కు చెందిన కీలక నేత, మాజీ సీఎం అశోక్ చవాన్ గత నెలలో కాంగ్రెస నుంచి బీజేపీలో చేరడం తెలిసిందే. వీరిద్దరి చేరికతో అక్కడ బీజేపీ బలోపేతమవుతుందని భావిస్తున్నారు.

11 మంది అభ్యర్థులతో బీజేపీ మరో జాబితా

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ శనివారం 11 మంది అభ్యర్థులతో మరో జాబితాను విడుదల చేసింది. ఇందులో ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన భర్తృహరి మహతాబ్, రవ్‌నీత్ సింగ్ బిట్టూ, సుశీల్ కుమార్ రింకూ, ప్రణీత్ కౌర్ తదితర సిట్టింగులున్నారు. వీరంతా అవే స్థానాల నుంచి మళ్లీ బరిలోకి దిగుతున్నారు. అమెరికాలో భారత మాజీ రాయబారి తరన్‌జీత్ సింగ్ సంధు అమృత్‌సర్‌లో పోటీ చేయనున్నారు. 2019లో బీజేపీ తరఫున నార్త్‌వెస్ట్ ఢిల్లీలో గెలుపొందిన హన్స్ రాజ్ హన్స్ ఈసారి ఫరీద్‌కోట్ బరిలో ఉంటారు. బీజేడీకి గుడ్ బై చెప్పిన భర్తృహరి కటక్ నుంచి పోటీ చేస్తున్నారు.


కర్నూలు జిల్లా తుగ్గలిలో సీఎం వైఎస్ జగన్‌తో ముఖాముఖి కార్యక్రమానికి భారీగా హాజరైన ప్రజలు


గుత్తిలో సీఎం జగన్‌కు దస్తీ కడుతున్న ముస్లిం మహిళ


గుత్తిలో సీఎం జగన్‌పై పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలుకుతున్న ప్రజలు

మీ ఓటుతోనే... మీ రాత మార్పు

పత్తికొండ నియోజకవర్గం తుగ్గలిలో ప్రజలతో ముఖాముఖిలో సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కర్నూలు

'గత ప్రభుత్వానికి, మనందరి ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడా ఏమిటో ఊరూరా స్పష్టంగా కనిపిస్తోంది. విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులు కొనసాగడం చాలా అవసరం. ఈ ఎన్నికల్లో ఓటు వేసేది కేవలం ఎంపీ, ఎమ్మెల్యేను ఎన్నుకునేందుకు మాత్రమే కాదు. జరుగుతున్న మార్పును కొనసాగించేందుకే అన్నది ప్రధానం. ఈ మార్పులు కొనసాగితేనే పేదవాడి బతుకులు మారతాయి. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. నేను చెప్పిన మాటల్లో వాస్తవం ఉందనుకుంటేనే మీ బిడ్డకు అండగా నిలిచి ఓటు వేయాలని కోరుతున్నా. జరిగిన మేలును ఇంటింటా చెప్పాలి' అని ముఖ్యమంత్రి,


ప్రజలతో ముఖాముఖిలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మేమంతా సిద్ధం' పేరుతో నిర్వహిస్తున్న బస్సు యాత్ర నాలుగో రోజు శనివారం కర్నూలు జిల్లాలోని పత్తికొండ నియోజకవర్గంతో పాటు అనంతపురం జిల్లాలోనూ కొనసాగింది. తుగ్గలిలో తుగ్గలి, రాతన గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమాభివృద్ధిపై రెండు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేసి ఆశీస్సులు తెలిపారు. 'మళ్లీ ముఖ్యమంత్రిగా నువ్వే రావాలన్నా.. మళ్లీ సీఎంగా ఇక్కడికి రావాలి' అంటూ మహిళలు, రైతులు, విద్యార్థులు హర్షధ్వానాల మధ్య మూకుమ్మడిగా నినదించారు. 'రెండు గ్రామాల పరిధిలో 10 వేల జనాభా ఉన్నారు. గ్రామస్తులంతా కలిసికట్టుగా ఏకమయ్యారు. అందరినీ ఒకటే కోరుతున్నా. ఇంతకు ముందు ప్రభుత్వాలను చూశారు. ఇవాళ మన ప్రభుత్వాన్నీ చూస్తున్నారు. మీరు ఇంతకు ముందు చూడని విధంగా మన ప్రభుత్వ హయాంలోని 58 నెలల్లో ప్రస్ఫుటమైన మార్పులు కన్పిస్తున్నాయి. ఇలాంటి విప్లవాత్మక మార్పులు గత ప్రభుత్వాల్లో ఎందుకు కన్పించలేదు? తుగ్గలి, రాతన సచివాలయ పరిధిలోని గ్రామాల్లో కూడా గొప్ప మార్పు కన్పిస్తుండటం పట్ల ప్రతి ఒక్కరూ ఆలోచించాలి' అని సీఎం కోరారు. ఈ ముఖాముఖిలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

రెండు గ్రామాల అభివృద్ధి ఇలా..

- గ్రామంలో అడుగు పెడుతూనే సచివాలయం కన్పించింది. గతంలో ఇది లేదు. ఈ 58 నెలల కాలంలోనే వచ్చింది. వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. మరో నాలుగు అడుగులు ముందుకేస్తే ఆర్బీకే ఉంది. ఓ అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ అక్కడే ఉంటున్నారు. విత్తనం నుంచి పంట కొనుగోలు దాకా ప్రతి దశలో రైతన్నకు అండగా నిలుస్తున్నారు. ఇంతకు ముందు రైతన్నలు బ్యాంకుకు వెళ్లి క్రాప్‌లోన్ తీసుకుంటేనే పంటలకు ఇన్సూరెన్స్ చేసేవారు. లోన్లో రూ.లక్షకు రూ.5వేలు కట్ చేసి ఇచ్చేవారు.
- ఇవాళ ప్రతి ఎకరా ఈ క్రాప్ చేశాం. ఉచితంగా పంటల బీమా అమలు చేస్తున్నాం. పెట్టుబడి సాయంగా రైతు భరోసా ఇస్తూ రైతన్నకు సాయంగా ఉంటున్నాం. ఇక్కడే ప్రభుత్వ బడి కన్పిస్తోంది. తొలిసారి నాడు–నేడుతో రూపురేఖలు మారాయి. ఇంగ్లిష్ మీడియం వచ్చింది. 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చాం. 6వ తరగతి నుంచి ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా డిజిటల్ బోధన కల్పించాం. కార్పొరేట్ స్కూళ్లు కూడా ప్రభుత్వంతో పోటీ పడాల్సిన పరిస్థితులు గ్రామంలో కన్పిస్తున్నాయి.
- ప్రజలు ఏ ఒక్కరూ వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదని మార్పులు తెచ్చాం. విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానం చేశాం. 15 రోజులకు ఒకసారి వచ్చి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య సురక్ష ప్రతి ఆర్నెళ్లకు ఓసారి జరుగుతోంది. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మందులు ఇస్తున్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని వెయ్యి రోగాల నుంచి 3,330 దాకా పెంచాం. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తున్నాం. ఈ మార్పులన్నింటికీ మనందరి ప్రభుత్వమే కారణం అని గమనించాలి.

రెండు గ్రామాల అక్క చెల్లెమ్మలకు రూ.56.24 కోట్లు

- తుగ్గలి సచివాలయ పరిధిలో 1,748, రాతన సచివాలయ పరిధిలో 1,569 ఇళ్లు ఉన్నాయి. తుగ్గలిలో 1,666 ఇళ్లకు, రాతనలో 1,486 ఇళ్లకు అంటే 95 శాతం ఇళ్లకు మీ బిడ్డ బటన్ నొక్కి అక్క చెల్లెమ్మల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు పంపారు. ఎక్కడా లంచాలు, వివక్ష, కులం, రాజకీయం, చివరకు గత ఎన్నికల్లో మనకు ఓటు వేయకపోయినా ఫర్వాలేదనుకుని.. అర్హత ఉన్న వారందరికీ మేలు చేశాం. రెండు గ్రామాల అక్క చెల్లెమ్మలకు రూ.56.24 కోట్లు లబ్ధి కలిగించాం.
- గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు రాజ్యమేలుతున్న పరిస్థితుల్లో చివరకు మరుగుదొడ్లు కావాలన్నా లంచాలు అడిగే పరిస్థితి. చివరకు పింఛన్, సబ్సిడీ రుణాలు కావాలన్నా లంచాలే. ఆ రోజుల్లో ప్రభుత్వం ఇచ్చే ప్రతి రూపాయి లంచాలు లేకుండా మీకు అందిందని ఎవరైనా చెబుతారా? (లేదు...లేదు అని జనాలు చేతులు అడ్డంగా ఊపారు) తుగ్గలిలో 5,200 జనాభా ఉన్న సచివాలయ పరిధిలో ఈ 58 నెలల్లో రూ.29.65 కోట్లు ఇచ్చాం. ఈ సంఖ్యలు చెబుతుంటే ఆశ్చర్యంగా లేదా.. అని అడుగుతున్నా. రాతనలో 4,888 జనాభా ఉంటే రూ. 26.59 కోట్లు ఇచ్చాం. ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా నా ఆడబిడ్డల ఖాతాల్లో నగదు జమ చేశాం.
- అమ్మఒడి పథకం ద్వారా తుగ్గలిలో రూ.2.91 కోట్లు, రాతనలో రూ.2.50 కోట్లు.. రెండింటికీ కలిపి రూ.5.41 కోట్లు ఇచ్చాం. చేయూత ద్వారా తుగ్గలిలో రూ.2.30 కోట్లు, రాతనలో రూ.2.19 కోట్లు.. రెండు గ్రామాల్లో కలిపి రూ.4.49 కోట్లు అక్క చెల్లెమ్మల ఖాతాల్లోకి వెళ్లాయి. విద్యాదీవెన ద్వారా తుగ్గలిలో రూ.1.16 కోట్లు, రాతనలో రూ.1.26 కోట్లు.. మొత్తంగా రూ.2.42 కోట్లు జమ చేసి, పిల్లలు మంచి చదువులు చదవాలని, తల్లిదండ్రులపై భారం పడకుండా చూశాం.
- జగనన్న వసతి దీవెన ద్వారా తుగ్గలిలో రూ.51 లక్షలు, రాతనలో రూ.54 లక్షలు.. ఆసరా ద్వారా తుగ్గలిలో రూ.1.95 కోట్లు, రాతనలో రూ.65 లక్షలు ఇచ్చాం. మన ప్రభుత్వం రాక ముందు పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మల పరిస్థితి దారుణం. అప్పట్లో 18 శాతం నాన్ పర్ఫార్మెన్స్ అసెట్స్, అవుట్ స్టాండింగ్ లోన్లు ఉండి అక్క చెల్లెమ్మల బతుకులు కుదేలైన పరిస్థితుల్లో ఆసరా ద్వారా ఆదుకున్నాం. ఈ ఒక్క పథకం ద్వారానే ఈ గ్రామాలకు రూ.2.60 కోట్లు ఇచ్చాం. సున్నా వడ్డీ ద్వారా రాతనలో రూ.15 లక్షలు, తుగ్గలిలో రూ.60 లక్షలు ఇచ్చి మంచి చేశాం. ఇళ్ల విషయానికొస్తే తుగ్గలిలో 66, రాతనలో 122 ఇళ్లు ఇచ్చాం. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా ద్వారా తుగ్గలిలో రూ.3 లక్షలు, రాతనలో రూ.4.8 లక్షలు ఇచ్చాం.
- అవ్వాతాతలకు రాతనలో రూ.7.54 కోట్లు, తుగ్గలిలో రూ.7.58 కోట్లు పింఛన్ల ద్వారా అందించాం. రైతులకు వైఎస్సార్ రైతు భరోసా ద్వారా తుగ్గలిలో రూ.6.15 కోట్లు, రాతనలో రూ.5.49 కోట్లు ఇచ్చాం. ఇలా అన్ని పథకాల ద్వారా మేలు చేశాం. గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం ప్రతీ గ్రామంలో చూపిస్తామని, ప్రతి 60–70 ఇళ్లకు వలంటీర్‌ను పెట్టాం. వారు ప్రతి పథకాన్ని నేరుగా మీ చేతుల్లో పెట్టి వెళుతున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో గతానికి భిన్నంగా మార్పు జరుగుతోంది. తుగ్గలిలో ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా ద్వారా రూ.98 లక్షలు ఇచ్చాం. ఉచితంగా వైద్యం అందించాం. రాతనలో రూ.84 లక్షలు ఇచ్చాం. ఈ మార్పులను అందరూ గమనించాలి.

పింఛన్ కోసం పడిగాపులు లేవు



పింఛన్ కోసం రెండు, మూడు రోజులు బయట ఉండేవాళ్లం. గతంలో మా వికలాంగుల్లోనే వైకల్యానికి పర్సెంటేజీ ప్రకారం తేడా చూపించేవాళ్లు. జగనన్న వచ్చాక ఆ తేడా లేకుండా రూ.3 వేల పింఛన్ ఇస్తున్నారు. ఇప్పుడు నేరుగా ఇంటికే పింఛన్ అందిస్తున్నారు. పడిగాపులు అసలే లేవు. అందుకు జగనన్నకు ధన్యవాదాలు. జై జగన్.

– రంగమ్మ, రాతన, తుగ్గలి మండలం, కర్నూలు జిల్లా

మీ సాయం మరువలేం



అన్నా.. నేను ట్రాన్స్‌కోలో పనిచేసే వాడిని. ప్రమాదంలో పైనుంచి పడి నడుం విరిగింది. డోన్ సభలో నన్ను పిలిచి మీరు రూ.5 లక్షలు సాయం చేశారు. మా నాన్నకు రూ.3 వేలు పింఛన్ అందిస్తున్నారు. మీ మేలు మరచిపోలేను. మిమ్మల్ని చూసేందుకే నా కుటుంబం అంతా ఉదయం 6 గంటలకే ఇక్కడకు వచ్చి ఎదురు చూస్తున్నాం. మీతో ఒక్క ఫొటో తీసుకుని మా ఇంట్లో పెట్టుకోవాలన్నా.

– బలరాం నాయక్, దివ్యాంగుడు, తుగ్గలి

మా స్కూల్ భలే బావుంది



జగన్ మామా.. నాడు–నేడు ద్వారా మా స్కూల్‌ను మీరు ఎంతో బాగా తయారు చేయించారు. మధ్యాహ్నం భోజనంలో కోడిగుడ్డు, చిక్కీ బాగా పెడుతున్నారు. (బాబు తండ్రి లాల్‌బాషా మాట్లాడుతూ..) 'నాకు హార్ట్‌స్ట్రోక్ వచ్చిందన్నా.. మా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ సాయంతో ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకుని బయటపడ్డాను.

– జుబేర్, 7వ తరగతి విద్యార్థి, హోసూరు, పత్తికొండ మండలం

మన వద్దే రూ.3 వేల పింఛన్

మన ప్రభుత్వం రాక ముందు చంద్రబాబు పాలనలో పింఛన్ రూ.వెయ్యి మాత్రమే ఇచ్చాడు. మీ బిడ్డ హయాంలో పింఛన్ రూ.3 వేలు. ఇంత పింఛన్ ఇచ్చే రాష్ట్రం దేశంలో మరొకటి లేదు. పింఛన్ల కు ఏడాదికి రూ.24 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మన తర్వాత తెలంగాణ రూ.12 వేల కోట్లు ఇస్తోంది. ఆపై 3, 4 స్థానాల్లో ఉన్న రాష్ట్రాల్లో ఏడాదికి పింఛన్ కోసం రూ.8 వేల కోట్లు, రూ.6 వేల కోట్లు ఇస్తున్నారు. ఒడిశా, యూపీలో రూ.500 పింఛన్ ఇస్తున్నారు. మీ బిడ్డ ప్రభుత్వానికి అవ్వాతాతలు, వితంతువులపై ఎంత ప్రేమ ఉందో చెప్పేందుకు ఇది ఉదాహరణ మాత్రమే. మనం రాకముందు రాష్ట్రంలో పింఛన్లు 39 లక్షలు ఉంటే మీ బిడ్డ ప్రభుత్వం వచ్చాక 66 లక్షలకు తీసుకెళ్లాం. ఇందులో ఏకంగా 45 లక్షల పింఛన్లు నా అక్కచెల్లెమ్మలు, అవ్వలకే ఇస్తున్నాం. ఇంకా లోటుపాట్లు సవరించుకుని మంచి పాలన అందించేందుకు సలహాల కోసం మీ వద్దకు వచ్చాను.

మా ఊళ్లో జెండా ఎగరేస్తాం



అన్నా.. నీ ఓదార్పు యాత్ర మొదలు నేటి 'మేమంతా సిద్ధం' యాత్ర వరకు 100 కార్యక్రమాల్లో నేను పాల్గొన్నా. పోలీసులు అడ్డుపడినా ఆగలేదు. నాకు కళ్లు లేవు. ఒక్కసారి నీ చేయి తాకాలని ఆశ పడుతున్నా. మా శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థిగా వీరాంజనేయులు అనే ఓ టిప్పర్ డ్రైవర్‌ను పెట్టారని చంద్రబాబు అంటున్నాడు. టిప్పర్ వచ్చి గుద్దితే సైకిల్ ఉంటుందా.. చంద్రబాబూ! శింగనమలలో జూన్ 4వ తేదీన గెలిచి, మా జెండా ఎగరేస్తాం.

– వినోద్ కుమార్, అమ్మవారి పేట, అనంతపురం జిల్లా

ఆరోగ్యశ్రీతో పేదవాడికి పెద్ద వైద్యం



రెండేళ్ల కిందట మా నాన్న రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. డయాలసిస్ చేయాలని చెప్పారు. కర్నూలులోని గౌరీగోపాల్ హాస్పిటల్‌కు వెళ్లండని చెప్పారు. ఎంతో డబ్బు ఉంటేనే అక్కడ వైద్యం చేయించుకోగలరు. అలాంటి ఆస్పత్రిలో మా నాన్నకు ఉచితంగా డయాలసిస్ జరిగింది. అది ఆరోగ్యశ్రీ వల్లే సాధ్యమైంది. ఆ తర్వాత మా నాన్నకు కిడ్నీ మార్పిడి చికిత్సను కూడా ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చేయించుకోగలిగాం. ఆరోగ్యశ్రీ తరఫున అధికారులు మాకు వెన్నంటి ఉండి ఎంతో సాయం చేశారు. మీరు మా ఇంటి పెద్దగా మాకు అన్నీ చేశారు. అందుకే మిమ్మల్ని మా పెద్దన్నగా భావిస్తున్నాం.

– జనార్ధన్‌రెడ్డి, చెన్నంపల్లి, అవుకు, నంద్యాల జిల్లా

పాలనలో తేడాను గుర్తించాలి



మా నాన్నకు రెండు లంగ్స్ దెబ్బతిన్నాయి. పెద్ద ఆస్పత్రికి వెళ్తే రూ.4 లక్షలు ఖర్చు అవుతాయి అన్నారు. కానీ ఆరోగ్యశ్రీ ద్వారా మా నాన్నకు ట్రీట్‌మెంట్ జరిగింది. ఇప్పుడు మా నాన్న ఆరోగ్యంగా ఉన్నాడు. మీ పాలనలో అందరికీ అన్ని పథకాలూ అందుతున్నాయి. బాబు పాలనకు, జగనన్న పాలనకు తేడా గమనించాలని రాష్ట్ర ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా.

– నరేష్, రాతన గ్రామం

మీరు నా సోదరుడు



అన్నా.. నా భర్త ఆరోగ్యమిత్రలో ఉద్యోగిగా చేస్తూ మరణించాడు. నాకు మీ పాలనలో అన్ని పథకాలు వచ్చాయి. అమ్మ ఒడి, విద్యా దీవెన, రైతు భరోసా పథకాలు అన్నీ అందాయి. డిగ్రీ చదివిన నాకు ఓ చిన్న ఉద్యోగం ఇప్పిస్తే మీ కెంతో రుణ పడి ఉంటానన్నా. మిమ్మల్ని నా అన్నగా అనుకొని ఈ సాయం అర్థిస్తున్నాను.

– సరస్వతి, తుగ్గలి

ఎప్పటికీ మీరే సీఎం



జగన్ సార్.. నేను పేదరాలిని. నాకు రైతు భరోసా, చేయూత, ఆసరా, ఇంటి పట్టా అన్ని పథకాలు వచ్చాయి. జగనన్న తోడు కూడా వచ్చింది. మా కలలన్నీ నిజమయ్యాయి. మాకు ఎవరూ వద్దు.. మీరే మళ్లీ సీఎంగా రావాలి. అందరికీ ఎంతో మేలు చేసిన మీరే సీఎంగా ఉండాలి.

– శ్యామల, రాతన, కర్నూలు జిల్లా

కూటమి కుదేలు


పత్తికొండ స్టే పాయింట్ వద్ద సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కల్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు, టీడీపీ ఇతర కీలక నేతలు


సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పితాని బాలకృష్ణ

కూటమి పోకడలు నచ్చక టాటా చెబుతున్న నాయకులు

ప్రతి నియోజకవర్గం నుంచి అసంతృప్తుల నిష్క్రమణ

కల్యాణదుర్గం టీడీపీ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు, ఇతర నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిక

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పితాని బాలకృష్ణ కూడా వైఎస్సార్‌సీపీలో చేరిక

ప్రతి రోజూ కొనసాగుతున్న వలసలు

టీడీపీ, జనసేన, బీజేపీలకు కోలుకోలేని దెబ్బ

సాక్షి, అమరావతి/కర్నూలు (సెంట్రల్)

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కూటమిలో కల్లోలం ఎక్కువవుతోంది. అక్కడి నేతల్లో ఆధిపత్య పోకడలు, ఆ అధిష్టానాలు అనుసరిస్తున్న విధానాలు నచ్చక, ఆ పార్టీల్లో జరుగుతున్న అవమానాలు తట్టుకోలేక ఒక్కొక్కరూ బయటపడుతున్నారు. గడచిన కొన్నాళ్లుగా ఈ పరంపర కొనసాగుతుండటంతో కూటమినేతల్లో కలవరం మొదలైంది. అభ్యర్థుల ఎంపిక విషయంలో తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నవారు కొందరైతే... పార్టీలో తమను పట్టించుకోవడం లేదన్న ఆవేదనతో మరికొందరు ఆ పార్టీలను వీడుతున్నారు. ఈ పరిస్థితులు కూటమి పార్టీలకు కోలుకోలేని దెబ్బగా మారుతున్నాయి. ఇదే సందర్భంలో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయాన్ని పాటిస్తుండటం... అన్ని వర్గాలవారినీ కలుపుకుని పోతుండటం... రాబోయే రోజుల్లో రాష్ట్రానికి దిక్సూచిలా కనిపిస్తుండటంతో వారంతా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ పరిణామాలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో కొత్త జోష్ నింపుతోంది. మేమంతా సిద్ధం బస్సుయాత్రకు ముందురోజే పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన పార్టీల నుంచి అసంతృప్తనేతలు సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బస్సుయాత్ర సాగుతున్న జిల్లాల్లో ఈ చేరికలు ఊపందుకుంటున్నాయి.

క్యూ కట్టిన కల్యాణదుర్గం నేతలు

పత్తికొండ స్టే పాయింట్ వద్ద శనివారం కల్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో పలువురు కీలక నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వై.నారాయణ, మాజీ ఎంపీపీ, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.కొల్లప్ప, టీడీపీ పార్లమెంట్ సెక్రెటరీ, క్లస్టర్ ఇన్‌చార్జ్ టి.సత్యప్ప, జనరల్ సెక్రటరీ(కంబదూరు) పి ఆనంద్ చౌదరి, కల్యాణదుర్గం రూరల్ జనరల్ సెక్రెటరీ కె.మల్లికార్జున, జనరల్ సెక్రెటరీ(శెట్టూరు) ఆదిశేషు, కల్యాణదుర్గం రూరల్ ఎంపీటీసీ బి.ఓబయ్య, కంబదూరు మాజీ జెడ్పీటీసీ అభ్యర్థి మంజునాథ్ చౌదరి, శెట్టూరు మాజీ మండల పార్టీ కన్వీనర్ పి రంగనాథ్ శెట్టి కూడా వైఎస్సార్‌సీపీలో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో అనంతపురం ఎంపీ గోరంట్లమాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకర నారాయణ ఉన్నారు.

- తుగ్గలి వద్ద డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సానబోయిన మల్లికార్జున్ సహా పలువురు నేతలు బస్సుయాత్ర చేస్తున్న జగన్ సమక్షంలో చేరారు.

ఆళ్లగడ్డ నుంచి చేరికలు ఆరంభం

కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నైట్ హాల్ట్ వద్ద ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, అఖిలభారత బ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు కాశీభట్ల సాయినాథ్ శర్మ, టీడీపీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆర్టీసీ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, బనగానపల్లె నియోజకవర్గం కోయిలకుంట్ల మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ వి.ఎస్.కృష్ణమూర్తి(లాయర్ బాబు) తదితరులు చేరినవారిలో ఉన్నారు.

అనంతపురం జిల్లా సిద్ధమా?

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం కర్నూలు జిల్లా నుంచి అనంతపురం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా 'అనంతపురం జిల్లా సిద్ధమా?' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు.

విద్య, వైద్యం, వ్యవసాయం రూపురేఖలు మారాయి

పేదల బతుకులు మారాలంటే ఈ మార్పులు కొనసాగాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా శనివారం కర్నూలు జిల్లా తుగ్గలి ప్రజలతో మమేకమైనట్లు సీఎం జగన్ శనివారం ట్వీట్ చేశారు. ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు అడిగి తెలుసుకొని.. ప్రజలకు మరింత మేలు చేయడానికి సూచనలు తీసుకున్నట్లు వెల్లడించారు. 'మన గ్రామంలో వ్యవసాయం మారింది.. వైద్యం మారింది.. స్కూళ్లు మారాయి.. గతానికి భిన్నంగా అన్నీ మారుతున్నాయి. పేదోళ్ల బతుకులు మారాలంటే జరుగుతున్న ఈ మార్పులు కొనసాగడం చాలా అవసరం. ఈ ఎన్నికల్లో మనం వేసే ఓటు.. జరుగుతున్న ఈ మార్పును కొనసాగించడం కోసం వేస్తున్నామని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయండి' అని కోరుతూ సీఎం జగన్ ట్వీట్ చేశారు.









4వ రోజు స్టార్ క్యాంపెయినర్‌లతో సీఎం వైఎస్ జగన్

'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా నాలుగో రోజైన శనివారం కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పర్యటించిన సీఎం వైఎస్ జగన్ పలు ఫొటోలను ట్వీట్ చేశారు. 'నాలుగో రోజు మేమంతా సిద్ధం యాత్రలో నా స్టార్ క్యాంపెయినర్‌లతో..' అంటూ పేదలతో మమేకమైన ఫొటోలను ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ ఫొటోలు అందర్నీ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. - సాక్షి, అమరావతి

కదం తొక్కిన స్టార్ క్యాంపెయినర్లు

సీఎం జగన్ యాత్ర కర్నూలు జిల్లాలో సూపర్ హిట్.. అనంతపురం జిల్లా గుత్తి టౌన్‌లో జన ప్రభంజనం



మిడుతూరులో సీఎం జగన్ బస్సు యాత్రకు హాజరైన భారీ జనసందోహం

(మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డనైన నాకు అండగా నిలవండి. మీరే నా స్టార్ క్యాంపెయినర్లుగా బయటకు రావాలి. జరిగిన మంచిని ఇంటింటా వివరించాలి' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపునకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన ప్రజలందరూ స్టార్ క్యాంపెయినర్లుగా మారి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో కదం తొక్కుతున్నారు. నాలుగో రోజు శనివారం కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కొనసాగిన బస్సు యాత్రలోని సన్నివేశాలే ఇందుకు నిదర్శనం. యాత్రలో ఆద్యంతం ప్రజల నుంచి ఘన స్వాగతం లభించడంతో పాటు, మండుటెండను సైతం లెక్క చేయకుండా ముసలిముతక, మహిళలు, యువత.. ఇలా అన్ని వర్గాల వారు బ్రహ్మరథం పట్టారు. శనివారం ఉదయం కర్నూలు జిల్లా రాతన వద్ద బస శిబిరంలో పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, కళ్యాణదుర్గం, కర్నూలు జిల్లా ముఖ్యనేతలు సీఎం జగన్‌ను కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారికి సీఎం జగన్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం 10.30 గంటల ప్రాంతంలో శిబిరం నుంచి యాత్రను ప్రారంభించారు. రాతన గ్రామంలో భారీ గజమాలతో, ఆనందోత్సాహాలతో సీఎంకు స్వాగతం పలికారు. ఊరంతా రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున బారులు తీరి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తమ మద్దతు తెలియజేశారు. అనంతరం ఇదే జిల్లా తుగ్గలికి చేరుకున్న సీఎం జగన్ గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామంలో గడిచిన ఐదేళ్లలో అన్ని వర్గాల వారికి ప్రభుత్వం చేసిన మంచిని సీఎం వివరించారు. అనంతరం పలువురు గ్రామస్తులతో మాట్లాడారు.

జాతీయ రహదారి పొడవునా జనమే జనం

గుత్తి పట్టణంలో రోడ్‌షో తర్వాత బెంగళూరు జాతీయ రహదారి(ఎన్‌హెచ్‌44)పై మిడుతూరు, పామిడి, కల్లూరు, గార్లదిన్నె మీదుగా సీఎం అనంతపురం చేరుకున్నారు. గుత్తి నుంచి అనంతపురం వరకూ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గుత్తి, పామిడి, గార్లదిన్నె, రాప్తాడు మండలాల గ్రామాల్లోని ప్రజలు రోడ్డు మీదకు చేరుకున్నారు. దీంతో ప్రతి పాయింట్ వద్ద సీఎం జగన్ బస్సు ఆపి ప్రజలకు అభివాదం చేశారు. పామిడిలో వేల మంది జనం జాతీయ రహదారి మీదకు చేరుకుని సీఎం జగన్‌కు తమ మద్దతు తెలియజేశారు. శింగనమల నియోజకవర్గ ప్రజలు కల్లూరులో సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతపురం పట్టణంలోని రాజీవ్‌కాలనీ, తపోవనం ప్రజలు, నాయకులు అతిపెద్ద గజమాలలతో సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. షెడ్యూల్ ప్రకారం రాత్రి 7 గంటలకు అనంతపురం చేరుకోవాల్సి ఉండగా 9 గంటలు దాటాక చేరుకున్నారు. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున జనాలు కదిలి వచ్చి రోడ్లపై బారులు తీరడంతో ఉదయం నుంచే నిర్దేశించిన షెడ్యూల్ కంటే చాలా ఆలస్యంగా యాత్ర కొనసాగింది. అయినపటగ్గటికీ ప్రజలు ఏ మాత్రం విసిగి పోకుండా అభిమాన నేతను కలవడానికి ఓపికతో వేచిచూశారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అవినీతికి తావులేకుండా సంక్షేమ ఫలాలను తమ దరిచేర్చడంతో పాటు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, వైఎస్సార్ పెన్షన్ కానుక వంటి వివిధ విప్లవాత్మక పథకాలను అమలు చేస్తూ తమకు అండగా నిలిచిన సీఎం జగన్‌ను చూసి ప్రజలు ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. అనంతపురంలో రోడ్‌షో అనంతరం రాప్తాడు, ఎస్కేయూ మీదుగా శ్రీసత్యసాయి జిల్లా సంజీవపురం వరకు యాత్ర చేరుకుంది. రాత్రి 10.30 గంటలకు రాప్తాడు చేరుకుంది. అప్పటికే రోడ్డుపై ఉన్న వేల మంది జనాలు జై జగన్ నినాదాలతో సీఎంపై అభిమానాన్ని చాటుకున్నారు. కర్నూలు జిల్లాలోని పత్తికొండ, అనంతపురం జిల్లా గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగో రోజు మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతంగా కొనసాగింది.



రాప్తాడులో రోడ్ షోకు హాజరైన భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్



అనంతపురంలో సీఎం జగన్‌కు గజమాలతో అభిమానుల సత్కారం



అనంతపురంలో సీఎం వైఎస్ జగన్‌పై పూల వర్షం కురిపించి అపూర్వ స్వాగతం పలుకుతున్న జనం

నాలుగోరోజు బస్సు యాత్రకు అపూర్వ స్పందన

కర్నూలు (సెంట్రల్)/తుగ్గలి: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు అభిమానం పోటెత్తింది. పల్లె పల్లెలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు, వృద్ధులు, యువతీ యువకులు, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకుల నుంచి అపూర్వ స్పందన లభించింది. అడుగడుగునా పూల స్వాగతంతో అభిమానం చాటుకున్నారు. భారీ క్రేన్లతో గజమాలలు వేసి ఉప్పొంగిపోయారు. నాలుగో రోజు బస్సు యాత్ర పత్తికొండ నుంచి అనంతపురం జిల్లాలోకి ప్రవేశించింది. ఉదయం 10.32 గంటలకు సీఎం వైఎస్ జగన్ రాత్రి బస చేసిన శిబిరం నుంచి యాత్ర ప్రారంభమైంది. మధ్యాహ్నం 2.25 గంటలకు అనంతపురం జిల్లా గుత్తి మండలం బసినేపల్లె పొలిమేర్లలోకి చేరుకోవడంతో కర్నూలు జిల్లాలో యాత్ర ముగిసింది. తుగ్గలిలో ఏర్పాటు చేసిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ ప్రజల సమస్యలు విన్నారు. సలహాలు స్వీకరించారు.

బస్సు యాత్ర సాగిందిలా..

- ఉదయం 10 గంటలకు అనంతపురం జిల్లా కల్యాణదుర్గం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమా మహేశ్వర నాయుడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సానబోయిన మల్లికార్జున్ తోపాటు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి సీఎం వైఎస్ జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- ఉదయం 10.32 గంటలకు మేమంతా సిద్ధం బస్సు యాత్ర నాలుగో రోజు పత్తికొండలో ప్రారంభం.
- 10.50 గంటలకు రాతనలో అపూర్వ స్పందన. భారీ క్రేన్ ద్వారా సీఎంకు గజమాల వేసి పూల బాట పరిచారు.
- 11.20 గంటలకు మాజీ ఎమ్మెల్యే, దివంగత తిమ్మారెడ్డి కుటుంబాన్ని సీఎం వైఎస్ జగన్ పరామర్శించారు. తిమ్మారెడ్డి పెద్ద కుమారుడు ప్రతాపరెడ్డి, సోదరుని కుమారుడు ప్రహ్లాదరెడ్డి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఇటీవల కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకున్న తిమ్మారెడ్డి చిన్న కుమారుడు శ్రీనివాసరెడ్డి, కోడళ్లు రంగమ్మ, విజయలక్ష్మి, అరుణమ్మలను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులు రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మోహన్ రెడ్డి, చంద్రశేఖరరెడ్డితో మాట్లాడారు.
- 11.46 గంటలకు తుగ్గలి సమీపంలో ప్రజలతో ముఖాముఖి.
- మధ్యాహ్నం 1.29 గంటలకు గిరిగెట్లలో ప్రజల ఘన స్వాగతం.
- 1.49 గంటలకు జొన్నగిరిలో పూల వర్షం. తమ గ్రామ సమీపంలోని చెరువును హెచ్ఎన్ఎస్ఎస్ నీటితో నింపాలని విన్నపం.
- 2 గంటలకు ఎర్రగుడిలో సీఎం జగన్ కాన్వాయ్‌పై పూల వర్షం.
- 2.25 గంటలకు అనంతపురం జిల్లాలోకి బస్సు యాత్ర ప్రవేశం.
- రాత్రి 11 గంటలకు బస శిబిరానికి చేరుకున్న సీఎం జగన్



అనంతపురంలో రోడ్ షోకు హాజరైన అశేష జనవాహినికి సీఎం వైఎస్ జగన్ అభివాదం



గుత్తిలో అశేష జనసందోహం నడుమ సాగుతున్న సీఎం జగన్ రోడ్ షో

గుత్తిలో జన సునామీ

తుగ్గలిలో ముఖాముఖి అనంతరం తిరిగి బస్సు యాత్ర ప్రారంభమై జొన్నగిరి, ఎర్రగుడి మీదుగా అనంతపురం జిల్లాలోకి ప్రవేశించింది. మిట్ట మధ్యాహ్నం భానుడి ప్రతాపాన్ని ఏ మాత్రం లెక్క చేయకుండా రోడ్లపై బారులు తీరి తమ అభిమాన నాయకుడికి ప్రజలు సంఘీభావం తెలిపారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గంలోకి ప్రవేశించిన యాత్ర బసినేపల్లి, గుత్తి ఆర్ఎస్‌ల మీదుగా గుత్తి పట్టణానికి చేరుకుంది. బసినేపల్లి నుంచి గుత్తి పట్టణం వరకూ ఇసుకేస్తే రాలనంతగా జనం యాత్రలో మమేకం అయ్యారు. ఒక్క మాటలో చెప్పాలంటే శనివారం సాయంత్రం గుత్తి పట్టణం జన సునామీని తలపించింది. అశేషమైన జనం కదలి రావడంతో సీఎం జగన్ రోడ్ షో కాన్వాయ్ ముందుకు చాలా నెమ్మదిగా కదిలింది. గుత్తి రైల్వే బ్రిడ్జ్ నుంచి ఎన్‌హెచ్ 44 మధ్య 7 కి.మీ దూరం రెండు గంటలకు పైగానే రోడ్‌షో కొనసాగింది. బస్సుపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం జగన్ ముందుకు సాగారు.



మిడుతూరులో ఘన స్వాగతం పలికిన జనానికి బస్సులో నుంచి అభివాదం చేస్తున్న సీఎం జగన్



తుగ్గలిలో మాజీ ఎమ్మెల్యే తిమ్మారెడ్డి పెద్ద కుమారుడు ప్రతాపరెడ్డి, సోదరుడి కుమారుడు ప్రహ్లాదరెడ్డి చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం జగన్



ఎర్రగుడి గ్రామంలో దివ్యాంగునితో ఆప్యాయంగా మాట్లాడుతున్న సీఎం జగన్








బస్సుయాత్రలో భాగంగా రాతన, జొన్నగి, ఎర్రగుడి, బసినేపల్లి గ్రామాల్లో అవ్వాతాతలతో ఆత్మీయంగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

క్లుప్తంగా...

ఏప్రిల్ 7న పొదిలిలో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర

ఏర్పాట్లపై వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ చెవిరెడ్డి సమీక్ష



ఒంగోలు: సీఎం జగన్ ప్రారంభించిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఏప్రిల్ 7న ప్రకాశం జిల్లా పొదిలికి చేరుకుంటుందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తెలిపారు. శనివారం ఒంగోలులో స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, పార్టీ అభ్యర్థులతో బస్సు యాత్రపై చెవిరెడ్డి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మేమంతా సిద్ధం కార్యక్రమంపై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చర్చ నడుస్తోందన్నారు. ఏప్రిల్ 7న పొదిలిలో జరిగే మేమంతా సిద్ధం కార్యక్రమ నిర్వహణ బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకుని పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలన్నారు. సీఎం యాత్రకు సంబంధించి బస్సు రూటు ఎలా అనే దానిపై చర్చించారు. కార్యక్రమం ఎన్ని గంటలకు ప్రారంభమవుతుంది, ఏ ప్రాంతంలో సీఎం ప్రసంగిస్తారనే అంశాలను త్వరలోనే ఖరారుచేసి విడుదల చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ సీఎం బస్సు యాత్రను జిల్లాలో విజయవంతం చేస్తామని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, దర్శి నియోజకవర్గ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వై.పాలెం నియోజకవర్గ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ 'ప్రచార మద్యం' పట్టివేత



చిత్తూరు రూరల్: టీడీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనే వారికి పంపిణీ చేసేందుకు ఓ మామిడి తోటలో దాచిపెట్టిన మద్యాన్ని భారీ మొత్తంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పాండిచ్చేరి, కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలించి చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామంలోని నాగేష్‌నాయుడు మామిడితోటలో దాచిపెట్టారనే సమాచారం అందుకున్న బీఎన్‌ఆర్ పేట పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.దాడుల్లో 10 బాక్సుల్లో ఉన్న సుమారు 86.40 లీటర్ల మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. ఆ తోటలో పనిచేస్తున్న రమేష్‌నాయుడును అరెస్టు చేసి విచారించారు. అతను చెప్పిన వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన తోట యజమాని నాగేష్‌నాయుడు, అతని అల్లుడు రమణనాయుడు మద్యం తీసుకొచ్చి కొద్ది రోజుల క్రితం తోటలో దాచిపెట్టారు. ఎన్నికల ప్రచారం కోసమే టీడీపీ వీటిని తీసుకొచ్చింది. పట్టుబడ్డ మద్యం విలువ రూ.35,664 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. కాగా మద్యం తరలించి తోటలో దాచిపెట్టిన నాగేష్‌నాయుడు, రమణనాయుడుపై కేసు నమోదు చేసి.. త్వరలోనే వారిని అరెస్ట్ చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.

నరసాపురం ఎంపీ అభ్యర్థిని మార్చబోం

తేల్చిచెప్పిన బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా సత్యనారాయణ



భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పార్లమెంట్ సీటు బీజేపీదేనని, అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మను ప్రకటించామని, ఆయనను మార్చే ప్రసక్తే లేదని బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చర్చించి సీట్ల పంపకం చేశారన్నారు. ఏ పార్టీకి కేటాయించిన సీటులో అభ్యర్థులను నిర్ణయించడానికి ఆయా పార్టీలకే హక్కు, అధికారం ఉంటుంది తప్ప కూటమికి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. సీటు మారుతుందంటూ బీజేపీకి సంబంధం లేని వ్యక్తులు మాట్లాడడం విడ్డూరమని పరోక్షంగా రఘురామకృష్ణరాజును ఉద్దేశించి చెప్పారు.

'టోల్'తీతకు రంగం సిద్ధం

ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి అమలు

కేతేపల్లి: హైదరాబాద్–విజయవాడ 65 నంబరు జాతీయ రహదారిపై టోల్‌గేట్ల వద్ద వాహనదారుల నుంచి వసూలు చేస్తున్న టోల్ ఫీజును రహదారి విస్తరణ కాంట్రాక్టు సంస్థ జీఎమ్మార్ యాజమాన్యం పెంచింది. ఒక్కో వాహనానికి ఒక వైపు, ఇరువైపులా కలిపి రూ. 5 నుంచి రూ. 40 వరకు, స్థానికుల నెలవారీ పాస్‌ను రూ.330 నుంచి రూ.340కి పెంచింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండల అంథోల్ మైసమ్మ దేవాలయం నుంచి ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వరకు గల 181.5 కి.మీ మేర రెండులేన్లుగా ఉన్న రహదారిని బీవోటీ పద్ధతిన జీఎమ్మార్ సంస్థ నాలుగు లేన్లుగా విస్తరించింది. వార్షిక సవరణల పేరిట ఏడాదికి ఒకమారు వాహనాల నుంచి వసూలు చేస్తున్న టోల్‌ఫీజు ధరలను పెంచుకునే జీఎమ్మార్ సంస్థకు ఎన్‌హెచ్ఏఐ వెసులుబాటు కల్పించింది. నూతన ధరలు ఈనెల 31 ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్నాయి.

జనసేనను చిదిమేసిన చంద్రబాబు

పొత్తు పేరుతో జనసేన ఉనికికే ఎసరు పెట్టిన టీడీపీ అధినేత



సాక్షి, అమరావతి: చంద్రబాబుతో పొత్తు అంటే ఇలాగే ఉంటుంది మరి! ఆయన పార్టీ టీడీపీ తప్ప మిత్రపక్షంలోని ఏ పార్టీకి అయినా ఆ తర్వాత పట్టేది అధోగతే. గతంలో వామపక్షాలు, బీజేపీ.. ఇప్పుడు జనసేన. పార్టీ ఎదుగదల దశలోనే జనసేనను చంద్రబాబు చిదిమేశారు. పొత్తుల పేరుతో ఆ పార్టీని రెండు ఉమ్మడి జిల్లాలకే పరిమితం చేశారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను ఓ బొమ్మలా మార్చేసుకొని, రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 21 మాత్రమే ఇచ్చి, మమ అనిపించేశారు. రాష్ట్రంలో ఒక బలమైన సామాజికవర్గంలో ఎక్కువ మంది రాజకీయాల్లో ప్రాధాన్యత కోసం పవన్ కళ్యాణ్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అలాంటి పార్టీని చంద్రబాబు వ్యూహాత్మకంగా దెబ్బతీసి, పొత్తుల పేరుతో ఉప ప్రాంతీయ పార్టీకన్నా తక్కువ స్థాయికి దిగజార్చారని జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలోని నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం 52 అసెంబ్లీ సీట్లు ఉండగా, జనసేనకు ఇచ్చిన నియోజకవర్గాలు తిరుపతి, రైల్వే కోడూరు మాత్రమే. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు.. ఈ ఆరు జిల్లాల పరిధిలో 74 అసెంబ్లీ స్థానాలు ఉండగా, 4 మాత్రమే జనసేనకు వచ్చాయి. ఈ నాలుగింటిలోనూ నెల్లిమర్ల, తెనాలి సీట్లను మాత్రమే జనసేన అధికారికంగా ప్రకటించింది. ఇంకా పాతపట్నం, అవనిగడ్డ స్థానాలు జనసేనకే అని చెబుతున్నప్పటికీ, అధికారికంగా అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇలా 126 స్థానాలు (70 శాతానికి పైగా అసెంబ్లీ స్థానాలు) ఉన్న ఈ 10 ఉమ్మడి జిల్లాల్లో జనసేనకు వచ్చిన నియోజకవర్గాలు ఆరు మాత్రమే. అంటే.. కనీసం జిల్లాకు ఒకటి కూడా ఇవ్వలేదు. మిగిలిన మూడు ఉమ్మడి జిల్లాల్లో 34 స్థానాలు ఉండే ఉభయ గోదావరి జిల్లాల్లో 12 చోట్ల జనసేన పోటీ చేస్తోంది. ఈ పార్టీకి అత్యధిక స్థానాలు వచ్చింది ఈ రెండు జిల్లాల్లోనే. అదీ.. ఉన్న సీట్లలో మూడో వంతుకంటే తక్కువే. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 15 స్థానాల్లో మూడు చోట్ల మాత్రమే జనసేన పోటీ చేస్తోంది. అంటే ఐదో వంతు స్థానాలతో సరిపెట్టారు.

నాయకుల గోడు

పార్టీ అధినేత సైతం వినే పరిస్థితి లేక..

పొత్తులో జనసేన పార్టీకి దక్కినవే 21 అసెంబ్లీ సీట్లు. వీటిలోనూ జనసేన నేతలకు అన్యాయమే జరిగింది. ఇటీవలి కాలంలో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ఈ స్థానాల్లో ఎక్కువ భాగం దక్కాయి. భీమవరం నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి 2019 ఎన్నికల్లో పవన్‌కు ప్రత్యర్థిగా పోటీ చేసిన టీడీపీ నేతే కావడం గమనార్హం. మరోవైపు జనసేన పార్టీకి రెండు లోక్‌సభ స్థానాలు కేటాయించగా, అందులో మచిలీపట్నం నుంచి పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన బాలశౌరి రెండు నెలల క్రితమే పార్టీలో చేరారు. ఇలా సీట్ల సంఖ్యలోనే కాదు.. పార్టీ నేతలకు న్యాయం చేయడంలోనూ జనసేన దెబ్బతింది. దీంతో పార్టీలో నియోజకవర్గ, ద్వితీయ శ్రేణి నాయకుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇంతకాలం పార్టీకి పనిచేస్తే తమకు ఉన్న ప్రాధాన్యత ఏమిటంటూ కార్యకర్తలు అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పలేక, నాయకులు మౌనం వహిస్తున్నారు. 2019లో 24,248 ఓట్లు వచ్చిన భీమిలి నియోజకవర్గంలో ఈసారి జనసేన ఎందుకు పోటీ చేయడంలేదని అక్కడ టికెట్ ఆశించిన నాయకుడిని స్థానిక కార్యకర్తలు ఓ సమావేశంలో నిలదీశారు. వారికి సమాధానం చెప్పలేక ఆయన సమావేశం కొనసాగినంత సేపు తలదించుకొని ఉన్న వీడియో సోషల్ మీడియాలో రెండు మూడు రోజులుగా హల్‌చల్ చేస్తోంది. అదే విధంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో జనసేనకు గత ఎన్నికల్లో 22 వేలకు పైగానే ఓట్లు వచ్చాయి. ఆ స్థానంలో అప్పుడు పోటీ చేసిన నాయకుడే మరోసారి పోటీ చేయాలని భావించారు. పొత్తులో ఆ స్థానం బీజేపీకి వెళ్లడంతో గత 15 రోజులుగా నిరసన దీక్షలు, ఆందోళనలు చేశారు. అయినా, పార్టీ నుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో 'ఇంకేమి చేయాలి. ఎంత ప్రయత్నించినా ఎవరూ పట్టించుకోకపోతే చివరకు ఆ ఏసుక్రీస్తుకే చెవిలో బాధ చెప్పుకున్నా' అంటూ ఆయన మాట్లాడిన వీడియో సైతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తమ గోడును కనీసం పార్టీ అధినేత పవన్ కూడా వినే పరిస్థితి లేక చాలా నియోజకవర్గాల్లో నాయకులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకొంటున్నారు.

మిత్రపక్షాలను మింగే అనకొండ.. అవకాశం ఉంటే...

తెలుగుదేశం పార్టీ అంటే మిత్రపక్షాలను మింగే అనకొండ అన్నది అందరికీ తెలిసిన విషయమే. 1998 లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి నాలుగు స్థానాల్లో గెలిచిందని.. ఆ ఎన్నికల్లో టీడీపీ గెలిచింది 12 లోకసభ స్థానాలు. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో, విభజిత రాష్ట్రంలోనూ ఐదు సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో మూడు సార్లు బీజేపీ – టీడీపీ కలిసి పోటీ చేశాయి. అయితే, 1998 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసినప్పటికీ, ఉమ్మడి ఏపీలో 18 శాతానికి ఓట్లు తెచ్చుకుంది. ఆ తర్వాత వరసగా రెండు విడతలు టీడీపీతో పొత్తు పెట్టుకొని, 2009 కల్లా మూడు శాతం ఓట్లకు దిగజారిపోయిందని జనసేన నాయకులు గుర్తు చేస్తున్నారు. మళ్లీ ఐదేళ్ల విరామం అనంతరం 2014లో టీడీపీతో పొత్తు పెట్టుకొని, ఒక శాతం కంటే తక్కువ స్థాయికి పడిపోయిందని ఆ నాయకులు తెలిపారు. పలుసార్లు టీడీపీతో పొత్తు పెట్టుకున్న ఉభయ కమ్యూనిస్టులు సైతం రాష్ట్రంలో ప్రతి ఎన్నికలకు తమ ఓటు బ్యాంకు కోల్పోయారని విశ్లేషిస్తున్నారు. ఎన్నికలకు ముందు పొత్తు పెట్టుకొని, అధికారంలోకి వచ్చాక ఆ మిత్రపక్ష పార్టీలను వారికి సైతం తెలియకుండా మింగేసే చరిత్ర చంద్రబాబుదని తెలిపారు. ఇప్పుడు పొత్తులకు ముందే జనసేనను రెండు మూడు జిల్లాల ఉప ప్రాంతీయ పార్టీకన్నా తక్కువ స్థాయికి దిగజార్చిన చంద్రబాబు.. ఎన్నికల తర్వాత ఆ జిల్లాల్లోనూ జనసేనకు ఉనికే లేకుండా చేసే పరిస్థితే ఉంటుందని ఆ పార్టీ నాయకులు, అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు ఏ–1గా పది కేసులు

- పొత్తుల వల్ల బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల్లో అభద్రతా భావం
- ఐటీ రంగం అభివృద్ధి సీఎం వైఎస్ జగన్ వల్లే సాధ్యం
- నెల్లూరు పార్లమెంటరీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



నెల్లూరులో ఐటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

కందుకూరు రూరల్/నెల్లూరు (దర్గామిట్ట): ఎన్నికలు పూర్తయిన తర్వాత చంద్రబాబు ప్రధాన నిందితుడి(ఏ–1)గా సుమారు పది కేసులు నమోదు కాబోతున్నాయని రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి అన్నారు. శనివారం కందుకూరులోని శ్రీవెంగమాంబ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుపై ఏ–1గా ఇప్పటికే మూడు, నాలుగు కేసులు నమోదయ్యాయని, మరో నాలుగైదు కేసులు నమోదు కాబోతున్నాయని చెప్పారు. చంద్రబాబు అవినీతికి పాల్పడిన సొమ్మును విదేశాలకు తరలించి అక్కడ ఆస్తులు కొనుగోలు చేశారన్నారు. అవినీతి సొమ్మును ఏపీలో పెట్టుబడి పెట్టినా కనీసం రాష్ట్రం బాగుపడేదన్నారు.

బాబు పొత్తులతో వైఎస్సార్‌సీపీకే లాభం

ప్రతి పార్టీతో పొత్తు పెట్టుకున్న పార్టీ తెలుగుదేశం అని.. ఈ పొత్తుల వల్ల బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు అభద్రతా భావంలోకి వెళ్లారని విజయసాయిరెడ్డి అన్నారు. దీనివల్ల వైఎస్సార్‌సీపీ లాభపడుతుందేగానీ.. నష్టం లేదన్నారు. అదేవిధంగా బీజేపీకి, జనసేనకు కూడా నష్టం లేదన్నారు. కేవలం నష్టపోయేది టీడీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం, సోషల్ ఇంజినీరింగ్‌లో భాగంగా వైఎస్సార్‌సీపీ సీట్ల కేటాయింపులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మార్పులు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీలో పదవులు అనుభవించిన రఘురామకృష్ణరాజు పార్టీలోనే ఉంటూ.. పార్టీని తిడుతూ రాజకీయం చేశారన్నారు. ఏ రాజకీయ పార్టీ కూడా తిరిగి ఆయనను చట్టసభలకు పంపించాలంటే ఒకటికి పదిసార్లు ఆలోచించే పరిస్థితిని తనకు తానే కొనితెచ్చుకున్నాడని చెప్పారు. ఆయనను బీజేపీ, జనసేన, టీడీపీ సహా ఏ పార్టీ నమ్మడం లేదన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఉన్నారు.

నెల్లూరులో ఐటీ సెజ్ ఏర్పాటుకు కృషి

కాగా.. నెల్లూరు రామ్మూర్తి నగర్‌లోని రామచంద్ర కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం సభ్యులతో ఆత్మీయ సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. విశాఖపట్నంలో ఐటీ రంగం అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతగానో కృషి చేశారని, రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు విశాఖలో ఐటీని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నెల్లూరులో ఐటీ సెజ్ ఏర్పాటుకు కృషి చేస్తామని, మౌలిక వసతులు కల్పించడం ద్వారా రాష్ట్రంలో ద్వితీయశ్రేణి నగరాల్లోనూ ఐటీ రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 2019లో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐటీ రంగంపై దృష్టి సారించి ఆ రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, ఈ మేరకు ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ ఐటీ విభాగం సభ్యులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్, ఐటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పోచంరెడ్డి సునీల్ మాట్లాడారు.

నెత్తిన పావలా పెడితే చెల్లని నాయాళ్లు

- బ్రోకర్ పనులు చేసుకునే చిల్లరగాళ్లు
- కాసులకు కక్కుర్తిపడి పార్టీని అమ్మేసే కక్కుర్తిగాళ్లు
- మైకు ఇస్తే తాగి ఊగడమే వారి నైజం
- కేఈ సోదరులను ఉద్దేశించి బీసీ జనార్దన్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- టీడీపీ ఆత్మీయ సమ్మేళనంలో దుమారం



డోన్: 'నెత్తిన పావలా పెడితే చెల్లని నాయాళ్లు కూడా నన్ను విమర్శిస్తున్నారు. బ్రోకర్, చిల్లర పనులు చేసుకునే అన్నదమ్ములు నన్ను విమర్శించడం మంచి పద్ధతి కాదు...' అని మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి సోదరులను ఉద్దేశించి బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డికి మధ్య సయోధ్య కుదిర్చిన అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ 'నేను రాష్ట్ర ఆర్థిక మంత్రికి కోవర్టునని ఇటీవల ఒకాయన వ్యాఖ్యానించారు. నెత్తిన పావలా పెడితే చెల్లని నాయాళ్లు కూడా నన్ను విమర్శిస్తున్నారు. బ్రోకర్, చిల్లర పనులు చేసుకునే అన్నదమ్ములు నన్ను విమర్శించడం మంచి పద్ధతి కాదు. చిల్లరగాళ్లకు చిల్లర బుద్ధులే వస్తాయి తప్ప మంచి బుద్ధులు రావు. డోన్ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి ఇస్తే జెండా పడేసి ఇంటికి తాళం వేసి పారిపోయారు. ఇలాంటి వ్యక్తులు నా గురించి మాట్లాడటం హాస్యాస్పదం. మైకు ఇస్తే తాగి ఊగడమే వారి నైజం. టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నకాలంలో ఏం పీకారు. ప్రత్యర్థి వర్గాలు పడేసే కాసులకు కక్కుర్తిపడి పార్టీని అమ్మేసే కక్కుర్తిగాళ్లు. ఎవరికి ఎవరు కోవర్టులో, ఎవరు ఎవరి దగ్గర డబ్బు సంచులు తెచ్చుకున్నారో నా వద్ద ఆధారాలు కూడా ఉన్నాయి. కేఈ ప్రభాకర్‌తోపాటు కోట్ల దంపతులు డోన్ నియోజకవర్గం నుంచి పోటీ చెయ్యబోమని చెప్పిన తర్వాతే ధర్మవరం సుబ్బారెడ్డిని ఇన్‌చార్జిగా చంద్రబాబు నియమించారనేది వాస్తవం కాదా.. అని' ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆత్మీయ సమావేశం పేరిట సొంత పార్టీ నేతలైన కేఈ సోదరులను లక్ష్యంగా చేసుకుని బీసీ జనార్దన్‌రెడ్డి అసభ్య పదజాలంతో దూషించడం టీడీపీలో తీవ్ర దుమారం రేపింది. అయినా పక్కనే ఉన్న టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి నోరు మెదపకపోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఈ కార్యక్రమానికి కేఈ కృష్ణమూర్తి వర్గీయులను ఆహ్వానించకపోవడం విశేషం.

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

- బాబు వ్యాఖ్యలపై టిప్పర్ డ్రైవర్ల ఆగ్రహం
- టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యేగా పోటీ చేసే అర్హత లేదా అంటూ ప్రశ్న




బాబు దిష్టి బొమ్మను దహనం చేస్తున్న లారీ డ్రైవర్లు

పెదకాకాని: టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారంటూ టీడీపీ నేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై టిప్పర్ డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది చంద్రబాబు దురహంకారానికి నిదర్శనమంటూ గుంటూరు ఆటోనగర్‌లోని లారీ స్టాండ్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు టిప్పర్ డ్రైవర్లు మాట్లాడుతూ టీడీపీ దృష్టిలో టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యేగా పోటీ చేసే అర్హత లేదా? అని ప్రశ్నించారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు.. ఎంఏ, బీఈడీ చదువుకున్న వీరాంజనేయులుకు ఉద్యోగం ఇచ్చి ఉంటే ఈ రోజు ఉద్యోగం చేసుకునేవాడని తెలిపారు. ఉద్యోగం రాక కుటుంబ పోషణ కోసం టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసుకుంటున్న వీరాంజనేయులును గుర్తించి శింగనమల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి సీఎం జగన్ తన గొప్ప మనసును చాటుకున్నారని కొనియాడారు. టిప్పర్ డ్రైవర్ ఎమ్మెల్యే అభ్యర్థి అన్న మాటకు చంద్రబాబు క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్ల ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిప్పర్ డ్రైవర్ పఠాన్ షబ్బీర్, ఆళ్ల సాయికిరణ్, షేక్ జానీ, నాగ రాజేష్‌రెడ్డి, శ్రీను, శ్రీనివాసరెడ్డి, ఇలియాస్‌ఖాన్, బొల్లినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ గుద్దితే సైకిల్ ఉంటుందా బాబూ?

- ఉపాధి కూలీ, డ్రైవరు ఎన్నికల్లో పోటీ చేయకూడదా?
- వారిని హేళన చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమే
- బెడ బుడగ జంగాల కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యలమర్తి మధు



సాక్షి, అమరావతి: నిరుపేద కుటుంబాలకు చెందిన డ్రైవర్లు ఎమ్మెల్యేలుగా పోటీ చేసేందుకు పనికిరారా అని టీడీపీ అధినేత చంద్రబాబును బెడ బుడగ జంగాల కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యలమర్తి మధు ప్రశ్నించారు. టిప్పర్‌తో గుద్దితే సైకిల్ ఎక్కడ ఉంటుందో బాబు ఆలోచించుకోవాలని హెచ్చరించారు. మధు శనివారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు, మడకశిరలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఉపాధి కూలీ ఈర లక్కప్పను ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు నీచమైనవని అన్నారు. డ్రైవర్లంతా త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్‌ను టిప్పర్ కింద వేసి తుక్కుతుక్కు చేస్తారని చెప్పారు. ఉపాధి కూలీకి, టిప్పర్ డ్రైవర్‌కు టికెట్లు ఇచ్చిన లీడర్ సీఎం జగన్ అని కొనియాడారు. బాబులాగా రూ.కోట్లు తీసుకుని ధనికులనే చట్ట సభలకు పంపాలా అని నిలదీశారు. పొట్టకూటి కోసం డ్రైవర్ వృత్తిని చేపడితే టిప్పర్ డ్రైవర్‌కు టికెట్టు ఇచ్చారంటూ అవహేళన చేయడం బాబుకే చెల్లిందని మండిపడ్డారు. ఇది అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. సీఎం జగన్ ఈ ఎన్నికల్లో బీసీ, ముస్లిం, కాపులకు ఎక్కువ సీట్లు ఇవ్వడం వలన ఆ ప్రభావం ఎన్నికల్లో తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. అన్ని సర్వేలు మళ్లీ సీఎం జగనే అంటున్నాయని చెప్పారు. దళితులన్నా, బీసీలన్నా బాబుకి మొదటి నుంచి చిన్నచూపేనని చెప్పారు. టీడీపీ అమ్ముడు పోయిందని, సిద్ధాంతాలతో నడవడం లేదని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి స్పష్టంగా చెప్పారన్నారు. బాబు పతనం చూడటానికే బతికి ఉన్నానని ముద్రగడ అంటున్నారన్నారు. బాబు వద్ద పెద్ద ప్యాకేజీ తీసుకొని మందకృష్ణ మాదిగ ఎస్సీల్లోని ఉపకులాల పేరుతో మళ్లీ మోసం చేసేందుకు బయల్దేరారని, తెలంగాణకు చెందిన ఆయనకు ఇక్కడేం పని అని నిలదీశారు. రఘురామకృష్ణరాజును బాబు వాడుకొని వదిలేశారని అన్నారు.

కసి తీర్చుకున్న నిమ్మగడ్డ, చంద్రబాబు

అవ్వతాతలపై నిమ్మగడ్డ చౌదరి, చంద్రబాబు కసి తీర్చుకున్నారని మధు అన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులపై చంద్రబాబు కుట్రలతో వలంటీర్ల సేవలకు ఈసీ బ్రేక్ వేసిందన్నారు. నిమ్మగడ్డ రమేష్ ద్వారా వలంటీర్లపై బాబు ఈసీకి ఫిర్యాదు చేయించారని తెలిపారు.

మాదిగలపై బాబుకు చిన్నచూపు

టిప్పర్ డ్రైవర్.. అంటూ చులకనగా చూడటం దారుణం

- పేదలను చట్ట సభల్లోకి పంపేందుకు బాబుకు మనసు రాదు
- కుల దురహంకారి బాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- దళిత సంఘాల డిమాండ్

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: అనంతపురం జిల్లా శింగనమల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎస్సీ వర్గానికి చెందిన వీరాంజనేయులును టిప్పర్ డ్రైవర్, ఎడమ చేతితో వేలిముద్ర వేసేవాడు.. అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు చులకన చేస్తూ చేసిన వ్యాఖ్యలపై దళిత నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదలు, దళితులంటే చంద్రబాబుకు చులకన భావమని, కుల దురహంకారంతో వ్యవహరించిన ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం జగన్ వీరాంజనేయులుకు శింగనమల ఎమ్మెల్యే టికెట్ కేటాయించి గౌరవిస్తే.. ఆ దళిత అభ్యర్థిని చంద్రబాబు హేళన చేయడమేంటి? దీనిపై ఎన్నికల కమిషనర్ వెంటనే స్పందించి చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. ఎస్సీలన్నా, పేదలన్నా చంద్రబాబుకు చులకనభావం. చంద్రబాబు అధికారంలో ఉండగా సామాజికవేత్త కంచె ఐలయ్య తన అనుచరులను ఆయన వద్దకు పంపి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాలని కోరితే.. చంద్రబాబు కుదరదని ఎద్దేవా చేశారు. జగన్ సీఎం అయిన వెంటనే ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశ పెట్టి పేద పిల్లలకు మేలు చేశారు.

– చీకటిమిల్లి మంగరాజు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు

మాదిగలపై కడుపు మంట ఎందుకు బాబు?



పేదలు, మాదిగలతో బాబు మొదట్నుంచి కులోన్మాదంతో వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులుపై చంద్రబాబు వ్యాఖ్యలు దారుణం. సీఎం జగన్ టిప్పర్ డ్రైవర్‌కి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారంటూ చంద్రబాబు హేళనగా మాట్లాడటం దుర్మార్గం. పేదలు, మాదిగల పట్ల తనకున్న చులకన భావాన్ని బాబు మరోసారి వ్యక్తం చేయడాన్ని యావత్ దళిత సమాజం తీవ్రంగా ఖండిస్తోంది. పేదలను చట్టసభల్లోకి పంపేందుకు బాబుకు మనసు రాదు.. సీఎం జగన్ పెద్ద మనసుతో మాదిగలను గుర్తించి అభ్యర్థిత్వం ఇస్తే కడుపుమంట ఎందుకు బాబూ?

– కొమ్మూరి కనకరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్

ఆటో డ్రైవర్, టిప్పర్ డ్రైవర్ అంటూ అవమానించడం నీచం



దళితులను అవహేళన చేస్తూ మాట్లాడిన చంద్రబాబుకు మరోసారి గుణపాఠం తప్పదు. దళితులను అవమానించేలా మాట్లాడటం చంద్రబాబుకు అలవాటుగా మారింది. గతంలో కూడా దళితుడిగా పుట్టాలని ఎవరు కోరుకుంటారు? అంటూ వారిని అవమానించారు. సాధారణ వ్యక్తి వీరాంజనేయులును సీఎం జగన్ అభ్యర్థిగా నిలబెడితే అభినందించాల్సింది పోయి ఆటో డ్రైవర్లు, టిప్పర్ డ్రైవర్లను పోటీలో నిలుపుతున్నారంటూ అవహేళనగా మాట్లాడటం నీచం.

– శరత్‌బాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు

మంద కృష్ణమాదిగ స్పందించాలి..



అట్టడగున ఉన్న మాదిగలను అన్ని రంగాల్లో రాణించేలా సీఎం జగన్ ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తే.. దానిని ఓర్చుకోలేని చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. మొదట్నుంచి మాదిగలను అక్కున చేర్చుకుంటానని నమ్మబలికి, మాదిగలను మోసం చేస్తూ, చంద్రబాబు కాళ్ల వద్ద వారిని తాకట్టు పెడుతున్న మంద కృష్ణమాదిగ ఈ విషయంపై స్పందించాలి. ఆనాడు కురుక్షేత్ర సభకు హాజరైన విద్యార్థులపై 307 కింద కేసులు నమోదు చేయించి వారి భవిష్యత్తును నాశనం చేయాలని చూసిన చంద్రబాబుకు కృష్ణ మాదిగ ఓటు వేయాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. మాదిగలపై చంద్రబాబు చూపుతున్న వివక్షను గ్రహించి తగిన బుద్ధి చెప్పాలి. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఈసీకి ఫిర్యాదు చేయడంతో పాటు, అట్రాసిటీ కేసు నమోదుకు తగిన చర్యలు తీసుకుంటాం.

– పూసులూరి జీవా, మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

పెద మాదిగనవుతానని దారుణంగా మోసం



సీఎం వైఎస్ జగన్ టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారంటూ హేళనగా మాట్లాడి బాబు తన పెత్తందారీ పోకడలను చాటుకుంటున్నారు. అణగారిన వర్గాలంటే అంత లోకువా బాబూ? చంద్రబాబుకు విద్యార్థి దశ నుంచే అట్టడుగు కులాలంటే చిన్నచూపు. పేదలైన వీరాంజనేయులు, ఈర లక్కప్పలకు ఎమ్మెల్యే టికెట్లు ఇస్తే.. చంద్రబాబుకు కడుపు మంట ఎందుకు? గతంలో తన రాజకీయ పబ్బం గడుపుకోవడానికి పెద్ద మాదిగను అవుతానని గొప్పలు చెప్పిన చంద్రబాబు మాదిగలను దారుణంగా మోసం చేశాడు. వర్గీకరణను సాకుగా చూపి దశాబ్దాల తరబడి మాదిగలను దగా చేస్తున్నాడు. చంద్రబాబుకు ఓటేస్తే మన పతనాన్ని మనమే కోరుకున్నట్టే.

– మేరీ కుమారి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి



లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో మాథ్యూ హెన్రీ

న్యూజిలాండ్ పేస్ బౌలర్ మాథ్యూ హెన్రీకి ఐపీఎల్‌లో ఆడే అవకాశం లభించింది. గత ఏడాది జరిగిన వేలంలో హెన్రీని ఏ జట్టూ తీసుకోలేదు. అయితే లక్నో సూపర్ జెయింట్స్ జట్టు సభ్యుడు, ఇంగ్లండ్ పేస్ బౌలర్ డేవిడ్ విల్లే వ్యక్తిగత కారణాలతో ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. దాంతో లక్నో ఫ్రాంచైజీ విల్లే స్థానంలో హెన్రీని అతని కనీస ధర రూ. 1 కోటీ 25 లక్షలకు తీసుకుంది. గతంలో చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ జట్టులో సభ్యుడిగా ఉన్న 32 ఏళ్ల హెన్రీ న్యూజిలాండ్ తరఫున 25 టెస్టులు, 82 వన్డేలు, 17 టి20లు ఆడి 256 వికెట్లు పడగొట్టాడు.

రన్నరప్ అంకిత-రుతుజా జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ50 టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో అంకిత రైనా-రుతుజా భోస్లే (భారత్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. జపాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో అంకిత-రుతుజా ద్వయం 3-6, 5-7తో ఇరీనా హయాషి-సాకి ఇమామురా (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది. 86 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత, రుతుజా తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది.



సెమీస్‌లో ఓడిన సిక్కిరెడ్డి-సుమీత్ జోడీ



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. బరిలో మిగిలిన మిక్స్‌డ్ డబుల్స్ జోడీ సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి సెమీఫైనల్లో వెనుదిరిగింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 66వ ర్యాంక్‌లో ఉన్న సిక్కి-సుమీత్ 17-21, 12-21తో ప్రపంచ 17వ ర్యాంక్‌లో ఉన్న రినోవ్ రివాల్డీ-పితా మెంతారి (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది. సిక్కి-సుమీత్ జోడీకి 2,940 డాలర్ల (రూ. 2 లక్షల 45 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 4,900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

శ్రీలంక 314/4

నిశాన్, కరుణరత్నే, కుశాల్ అర్ధ సెంచరీలు



కుశాల్, కరుణరత్నే

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో మొదలైన రెండో టెస్టులో శ్రీలంక భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 314 పరుగులు సాధించింది. టాపార్డర్ బ్యాటర్లు నిశాన్ మదుష్కా (57; 6 ఫోర్లు), దిముత్ కరుణరత్నే (86; 8 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ (93; 11 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. నిశాన్, కరుణరత్నే తొలి వికెట్‌కు 96 పరుగులు జోడించారు. నిశాన్ అవుటయ్యాక కుశాల్ మెండిస్‌తో కలిసి కరుణరత్నే రెండో వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ప్రస్తుతం దినేశ్ చండీమల్ (34 బ్యాటింగ్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ ధనంజయ డిసిల్వా (15 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. నాలుగు నెలల తర్వాత మళ్లీ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న బంగ్లాదేశ్ స్టార్ షకీబ్ అల్ హసన్ 18 ఓవర్లు వేసి 60 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు.

లక్నో సూపర్‌గా...

సొంతగడ్డపై జెయింట్స్ గెలుపు బోణీ
- 21 పరుగులతో ఓడిన పంజాబ్
- బంతితో హడలెత్తించిన మయాంక్
- రాణించిన డికాక్, కృనాల్, పూరన్



శిఖర్ ధావన్

'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మయాంక్ యాదవ్

ఐపీఎల్ కొత్త సీజన్‌ను ఓటమితో మొదలు పెట్టిన లక్నో సూపర్ జెయింట్స్ జట్టు వెంటనే కోలుకుంది. సొంతగడ్డపై సత్తా చాటి గెలుపు బోణీ చేసింది. బ్యాటింగ్‌లో డికాక్, కృనాల్, పూరన్ కీలక పాత్ర పోషించగా... మయాంక్ యాదవ్, మొహసిన్ పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని దెబ్బ కొట్టారు. ముఖ్యంగా తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన 21 ఏళ్ల మయాంక్ యాదవ్ తాను వేసిన 24 బంతుల్లో తొమ్మిది బంతులను గంటకు 150 కిలోమీటర్ల కంటే వేగంగా వేయడం విశేషం. భారీ ఛేదనలో 100కు పైగా తొలి వికెట్ భాగస్వామ్యంతో మంచి పునాది వేసుకున్నా... చివరకు పంజాబ్ కింగ్స్‌కు పరాజయం తప్ప లేదు. బ్యాటర్ల నిర్లక్ష్యపూరిత షాట్లతో ఆ జట్టు వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది.

లక్నో: ఐపీఎల్‌లో లక్నో తొలి విజయంతో పాయింట్ల ఖాతా తెరిచింది. శనివారం జరిగిన పోరులో లక్నో 21 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లక్నో 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. క్వింటన్ డికాక్ (38 బంతుల్లో 54; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), కృనాల్ పాండ్యా (22 బంతుల్లో 43 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (21 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లతో జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు. అనంతరం పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 178 పరుగులు సాధించింది. శిఖర్ ధావన్ (50 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), జానీ బెయిర్‌స్టో (29 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 70 బంతుల్లోనే 102 పరుగులు జోడించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మయాంక్ యాదవ్ (3/27) పంజాబ్‌ను దెబ్బ కొట్టాడు.

సమష్టి ప్రదర్శన...

రబాడ ఓవర్లో వరుస బంతుల్లో ఫోర్, సిక్స్‌తో లక్నో ఇన్నింగ్స్‌ను డికాక్ ధాటిగా ప్రారంభించగా... అర్ష్‌దీప్ ఓవర్లో సిక్స్, ఫోర్ కొట్టిన కేఎల్ రాహుల్ (15) అదే ఓవర్లో వెనుదిరిగాడు. పడిక్కల్ (9) విఫలం కాగా... రాహుల్ చహర్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు బాదిన స్టొయినిస్ (19) తర్వాతి బంతికే అవుటయ్యాడు. 34 బంతుల్లో డికాక్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా... చహర్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్‌తో పూరన్ జోరు ప్రదర్శించాడు. పూరన్ వెనుదిరిగిన తర్వాత కృనాల్ కూడా చెలరేగడంతో జట్టు భారీ స్కోరు చేయగలిగింది.

శతక భాగస్వామ్యం...

ఛేదనలో పంజాబ్‌కు ధావన్, బెయిర్‌స్టో ఘనమైన ఆరంభాన్ని అందించారు. సిద్ధార్థ్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన ధావన్... మొహసిన్ ఓవర్లోనూ 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. దాంతో 6 ఓవర్లు ముగిసే సరికి స్కోరు 61 పరుగులకు చేరింది. 30 బంతుల్లోనే ధావన్ హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకోగా, కృనాల్ ఓవర్లో రెండు వరుస సిక్స్‌లతో బెయిర్‌స్టో దూకుడు చూపించాడు. ఎట్టకేలకు 12వ ఓవర్లో మయాంక్ యాదవ్ ఈ జోడీని విడదీయగా, క్రీజ్‌లో ఉన్న కొద్దిసేపు ప్రభ్‌సిమ్రన్ (7 బంతుల్లో 19; 1 ఫోర్, 2 సిక్స్‌లు) వేగంగా ఆడాడు. అయితే 13 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయిన పంజాబ్ కింగ్స్ ఓటమి దిశగా పయనించింది. గెలుపు కోసం 23 బంతుల్లో 59 పరుగులు చేయాల్సిన స్థితిలో ధావన్ అవుట్ కావడం జట్టు అవకాశాలకు దాదాపుగా తెర వేసింది.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 54; రాహుల్ (సి) బెయిర్‌స్టో (బి) అర్ష్‌దీప్ 15; పడిక్కల్ (సి) ధావన్ (బి) స్యామ్ కరన్ 9; స్టొయినిస్ (బి) చహర్ 19; పూరన్ (బి) రబాడ 42; బదోని (సి) బెయిర్‌స్టో (బి) కరన్ 8; కృనాల్ పాండ్యా (నాటౌట్) 43; రవి బిష్ణోయ్ (సి) (సబ్) తనయ్ 0; మొహసిన్ (రనౌట్) 2; నవీన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 199.** వికెట్ల పతనం: 1-35, 2-45, 3-78, 4-125, 5-146, 6-189, 7-189, 8-197. బౌలింగ్: స్యామ్ కరన్ 4-0-28-3, అర్ష్‌దీప్ 3-0-30-2, రబాడ 4-0-38-1, రాహుల్ చహర్ 3-0-42-1, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-14-0, హర్షల్ పటేల్ 4-0-45-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ధావన్ (సి) డికాక్ (బి) మొహసిన్ 70; బెయిర్‌స్టో (సి) స్టొయినిస్ (బి) మయాంక్ 42; ప్రభ్‌సిమ్రన్ (సి) నవీన్ (బి) మయాంక్ 19; జితేశ్ (సి) నవీన్ (బి) మయాంక్ 6; లివింగ్‌స్టోన్ (నాటౌట్) 29; కరన్ (సి)పూరన్ (బి) మొహసిన్ 0; శశాంక్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 178.** వికెట్ల పతనం : 1-102, 2-128, 3-139, 4-141, 5-141. బౌలింగ్: సిద్ధార్థ్ 2-0-21-0, నవీన్ 4-0-43-0, మొహసిన్ 4-0-34-2, కృనాల్ 3-0-26-0, బిష్ణోయ్ 3-0-25-0, మయాంక్ యాదవ్ 4-0-27-3.

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ X హైదరాబాద్
వేదిక: అహ్మదాబాద్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి


ఢిల్లీ X చెన్నై
వేదిక: విశాఖపట్నం
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
చెన్నై	2	2	0	4	1.979
కోల్‌కతా	2	2	0	4	1.047
రాజస్తాన్	2	2	0	4	0.800
హైదరాబాద్	2	1	1	2	0.675
లక్నో	2	1	1	2	0.025
పంజాబ్	3	1	2	2	-0.337
బెంగళూరు	3	1	2	2	-0.711
గుజరాత్	2	1	1	2	-1.425
ఢిల్లీ	2	0	2	0	-0.528
ముంబై	2	0	2	0	-0.925

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

బోపన్న-ఎబ్డెన్ జోడీకి మయామి మాస్టర్స్ టైటిల్



బోపన్న, ఎబ్డెన్

ఫ్లోరిడా: ప్రతిష్టాత్మక మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ టైటిల్ సాధించింది. శనివారం జరిగిన ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (3/7), 6-3, 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో రెండో సీడ్ ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జంటపై నెగ్గింది. బోపన్న-ఎబ్డెన్‌లకు 4,47,300 డాలర్ల (రూ. 3 కోట్ల 72 లక్షలు) ప్రైజ్‌మనీ, 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఒక గంట 42 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో బోపన్న ద్వయం ఆరు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. బోపన్న కెరీర్‌లో ఇది 26 డబుల్స్ టైటిల్‌కాగా... 'మాస్టర్స్ సిరీస్'లో ఆరో టైటిల్ కావడం విశేషం. 44 ఏళ్ల బోపన్న గతంలో 'మాస్టర్స్ సిరీస్'లో ఇండియన్ వెల్స్ (2023), మోంటెకార్లో ఓపెన్ (2017), మాడ్రిడ్ ఓపెన్ (2015), పారిస్ ఓపెన్ (2012), పారిస్ ఓపెన్ (2011) టైటిల్స్ సాధించాడు. లియాండర్ పేస్ (2012లో) తర్వాత మయామి ఓపెన్ డబుల్స్ టైటిల్ నెగ్గిన రెండో భారతీయ క్రీడాకారుడిగా బోపన్న గుర్తింపు పొందాడు. ఈ విజయంతో బోపన్న సోమవారం విడుదల చేసే డబుల్స్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటాడు.

సినిమా



నాని

గుర్తింపు అవసరం లేదు!

హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో గత ఏడాది మార్చి 30న విడుదలైన 'దసరా' చిత్రం హిట్‌గా నిలిచింది. ఈ హిట్ కాంబినేషన్ రిపీట్ అవుతోంది. నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మరో సినిమా తెరకెక్కనుంది. నాని కెరీర్‌లోని ఈ 33వ సినిమాను 'దసరా' నిర్మాత సుధాకర్ చెరుకూరియే నిర్మించనున్నారు. 'దసరా' విడుదలై, ఏడాది పూర్తయిన సందర్భంగా తాజా చిత్రాన్ని శనివారం (మార్చి 30)న అధికారికంగా ప్రకటించింది యూనిట్. 'లీడర్ కావాలనుకుంటే నీకు గుర్తింపు అవసరం లేదు' అని అర్థం వచ్చేలా ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ పై ఓ ఇంగ్లిష్ కోట్ ఉంది. ఈ చిత్రం 2025లో విడుదల కానుంది. ఇక ప్రస్తుతం నాని 'సరిపోదా శనివారం' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. అలాగే సుజిత్ డైరెక్షన్‌లో హీరోగా నాని ఓ సినిమా కమిటైన సంగతి తెలిసిందే.



కరీనా కపూర్

సెంటిమెంట్... అడ్వెంచర్

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'తమ్ముడు'. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. శనివారం (మార్చి 30) నితిన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'తమ్ముడు' సినిమా టైటిల్ లోగో, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. అక్కా తమ్ముడి సెంటిమెంట్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సీనియర్ నటి లయ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ సినిమాకు బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు 'భీష్మ' వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచరస్ థ్రిల్లర్ మూవీ 'రాబిన్ హుడ్'. ఈ సినిమా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.



'తమ్ముడు'లో నితిన్

అయ్యో రామ!



మాళవిక, సుహాస్, అనిత

సుహాస్, మాళవికా మనోజ్ జంటగా, 'నువ్వు నేను' చిత్రం ఫేమ్ అనితా హస్సానందని ఓ కీలక పాత్ర చేస్తున్న 'ఓ భామ అయ్యో రామ' సినిమా ప్రారంభోత్సవం శనివారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వశిష్ఠ కెమెరా స్విచ్చాన్ చేయగా, 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. దర్శకుడు శైలేష్ కొలను బౌండెడ్ స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందించారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను దర్శకులు కిశోర్ తిరుమల-విజయ్ కనకమేడలతో కలిసి నిర్మాత సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించారు. రామ్ గోదాల దర్శకత్వంలో హరీష్ నల్లా, ప్రదీప్ తాళ్లపు రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రథన్ స్వరకర్త. ఈ సినిమా కథ తనసెంతగానో ఆకట్టుకుందని అన్నారు సుహాస్. ఈ సినిమాకు సహ-నిర్మాత ఆనంద్ గడగోని.

యశ్‌కు సిస్టర్?

'కేజీఎఫ్' ఫేమ్ యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో 'టాక్సిక్' అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఓ హీరోయిన్‌గా నటించనున్నారన్న వార్త ప్రచారంలోకి వచ్చింది. అయితే ఈ సినిమాలో కరీనాది హీరోయిన్ పాత్ర కాదని, యశ్‌కు అక్క పాత్రలో ఆమె కనిపించనున్నారనే టాక్ తాజాగా తెరపైకి వచ్చింది. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం గతంలో శ్రుతీహాసన్, సాయిపల్లవి వంటి వార్ల పేర్లు తెరపైకి రాగా, తాజాగా కియారా అద్వానీ పేరు వినిపిస్తోంది. మరి.. యశ్‌కు సిస్టర్ పాత్రలో కరీనా కనిపిస్తారా? యశ్‌తో కియారా జోడీ కడతారా? అనే విషయాలు తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది.

యాక్షన్ వైబ్



సందీప్ కిషన్

సందీప్ కిషన్ హీరోగా స్వరూప్ ఆర్‌ఎస్‌జె దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'వైబ్' టైటిల్ ఖరారైంది. రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్ లోగో శనివారం విడుదలైంది. ''కాలేజ్ బేస్డ్ యాక్షన్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఒక స్టూడెంట్, అతని స్నేహితులు సాధారణ వ్యక్తుల నుంచి రెబల్‌గా మారడానికి దారి తీసిన కారణాలేంటి? అనేది ఈ చిత్రం కథాంశం. వచ్చే ఏడాది వేసవిలో 'వైబ్'ని విడుదల చేస్తాం'' అని మేకర్స్ తెలిపారు.

ఇదొక కొత్త ప్రయత్నం

- 'దిల్' రాజు

ఆశిష్, వైష్ణవీ చైతన్య హీరో హీరోయిన్‌గా నటించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' (నీకు ధైర్యం ఉంటే...) అనేది ఉపశీర్షిక. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రావాలి రా..' అనే లిరికల్ సాంగ్ రిలీజ్ ఈవెంట్ హైదబాద్‌లో జరిగింది. కీరవాణి సంగీత సారథ్యంలో చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను చెబోలు అమల, గోమతీ అయ్యర్, అదితీ భావరాజు, అజ్మల్ ఫాతిమా పర్వీన్, సాయి శ్రేయ ఆలపించారు. ''ఓ ఘోస్ట్ లవ్‌స్టోరీ నేపథ్యంలో హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్రం యూనిట్ పేర్కొంది. ''లవ్ మీ ఒక కొత్త ప్రయత్నం'' అన్నారు 'దిల్' రాజు.




ఆశిష్, 'దిల్' రాజు

నటుడు బాలాజీ కన్నుమూత



ప్రముఖ నటుడు డేనియల్ బాలాజీ (48) శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో గుండెపోటుతో కన్నుమూశారు. దివంగత నటుడు మురళికి బంధువు బాలాజీ. చెన్నైలోని తరమణి ఇన్‌స్టిట్యూట్‌లో దర్శకత్వ శాఖలో శిక్షణ పొందిన బాలాజీ ముందు ప్రొడక్షన్ నిర్వాహకుడిగా చేశారు. కమల్‌హాసన్ నటించిన 'మరుదనాయగన్' చిత్రానికి ప్రొడక్షన్ నిర్వాహకుడిగా బాధ్యతను నిర్వహించారు. ఇక నటి రాధిక నిర్మించి, ప్రధాన పాత్ర పోషించిన 'చిత్తి' (పిన్ని) సీరియల్‌లో బాలాజీ తొలిసారిగా నటించారు. 'చిత్తి'లో డేనియల్ అనే పాత్ర పోషించడంతో డేనియల్ బాలాజీగా గుర్తింపు పొందారు. 'ఏప్రిల్ మాదత్తిల్' చిత్రంతో వెండితెరకు పరిచయం అయ్యారు. కమల్‌హాసన్ నటించిన 'వేట్టైయాడు విళైయాడు'లో విలన్‌గా నటించి, మంచి పేరు తెచ్చుకున్నారు. అదే విధంగా సూర్య హీరోగా రూపొందిన 'కాక్క కాక్క'లో చేసిన పాత్ర ద్వారా పాపులర్ అయ్యారు బాలాజీ. ఇదే చిత్రం తెలుగులో వెంకటేశ్ హీరోగా 'ఘర్షణ'గా రీమేక్ అయింది. తమిళంలో చేసిన పాత్రనే బాలాజీ తెలుగులో చేసి, మంచి గుర్తింపు పొందారు. అలాగే 'చిరుత', 'టక్ జగదీష్' వంటి తెలుగు చిత్రాల్లోనూ నటించారు. కాగా ఈయన అవివాహితుడు. తల్లి అంటే ఎంతో ప్రేమ. ఆమె కోరిక మేరకు స్థానిక ఆవడి సమీపంలో గుడి కట్టించారు. బాలాజీ మృతికి కమల్‌హాసన్ తదితర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. బాలాజీ అంత్యక్రియలు శనివారం చెన్నైలో జరిగాయి.



రాకేష్

చరిత్ర చెప్పాలి

'బాహుబలి' ఫేమ్ రాకేష్ వర్రే టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. హిస్టరీ నీడ్స్ టు బీ టోల్డ్ అనేది ఉపశీర్షిక (చరిత్ర చెప్పాల్సిన అవసరం ఉంది), 'ఉయ్యాలా జంపాలా, మజ్ను' వంటి ప్రేమ కథా చిత్రాలకు దర్శకత్వం వహించిన విరించి వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం మే 3న రిలీజ్ కానుంది. ''జగిత్యాలలో 1980లలో జరిగిన కథే ఈ సినిమా. ఆ రోజుల్లో విలువలతో కూడిన పాత్ర, దాని చుట్టూ తిరిగే కథని ఈ తరం ప్రేక్షకులకు అందించాలని చేసిన ప్రయత్నమే ఈ సినిమా'' అన్నారు విరించి వర్మ. ''జరిగిన కథను చూపించాం తప్ప ఎవర్నీ కించపరిచే విధంగా తీయలేదు'' అన్నారు రవీందర్ రెడ్డి.

మూడు దశాబ్దాలకు మళ్లీ..!

అరడజను ఆస్కార్ అవార్డులు గెలుచుకున్న హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ఫారెస్ట్ గంప్'. టామ్ హాంక్స్ టైటిల్ రోల్‌లో, రాబిన్ రైట్ ఓ లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు రాబర్ట్ జెమెక్కిస్ దర్శకత్వం వహించారు. 1994 జూన్‌లో విడుదలైన 'ఫారెస్ట్ గంప్' చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమా ప్రస్తావన ఎందుకంటే.. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత యాక్టర్స్ టామ్ హాంక్స్-రాబిన్ రైట్, దర్శకుడు రాబర్ట్ కలిసి 'హియర్' అనే సినిమా చేస్తున్నారు. అంతేకాదు... 'ఫారెస్ట్ గంప్'కు రైటర్‌గా చేసిన ఎరిక్ రోత్ ఈ సినిమాకు వర్క్ చేస్తున్నారు. ఇంకో విశేషం ఏంటంటే... 'ఫారెస్ట్ గంప్' సినిమాను ఇదే టైటిల్‌తో ఉన్న 'ఫారెస్ట్ గంప్' అనే నవల ఆధారంగా తెరకెక్కించారు. ఇప్పుడు 'హియర్' సినిమాను కూడా ఇదే టైటిల్‌తో ఉన్న ఓ గ్రాఫిక్ నవల ఆధారంగా తెరకెక్కిస్తున్నారని టాక్. ఇక 'హియర్' చిత్రాన్ని నవంబరులో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.



టామ్ హాంక్స్



హారిక

ప్రతి మహిళ చూడాలి

సాయి కుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ముఖ్య తారలుగా సూరపల్లి వెంకటరమణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మెర్సీ కిల్లింగ్'. వేదుల బాల కామేశ్వరి సమర్పణలో సిద్ధార్థ్ హరియల, మాధవి తాలబత్తుల నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 12న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కోన వెంకట్, ఆకాశ్ పూరి అతిథులుగా పాల్గొన్నారు. ''స్వేచ్ఛ అనే అమ్మాయి చుట్టూ తిరిగే ఈ సినిమాలో మంచి పాత్ర చేశాను. మెర్సీ కిల్లింగ్ అంటూ సమాజంలో ఆడవారిపై జరుగుతున్న అకృత్యాలను దర్శకుడు కళ్లకు కట్టినట్లు చూపించారు. ప్రతి మహిళ చూడాల్సి సినిమా'' అన్నారు సాయికుమార్. ''భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది'' అన్నారు వెంకటరమణ.

జార్ఖండ్ నక్సలైట్ భీమవరంలో అరెస్ట్!

భీమవరం: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నక్సలైట్‌ను అక్కడి పోలీసులు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో అరెస్టు చేశారని స్థానిక వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను తెలిపారు. సీఐ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన నక్సలైట్ రాహుల్ కేసరి జార్ఖండ్‌లో తప్పించుకున్న తరువాత హైదరాబాద్‌లో కొన్ని రోజులు గడిపాడు. అక్కడి నుంచి భీమవరం వచ్చి కొద్ది రోజులుగా తాపీ పనిచేస్తున్నాడు. అతని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా జార్ఖండ్ పోలీసులు రాహుల్ కేసరి భీమవరంలో ఉన్నట్లు గుర్తించి ఇక్కడి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం రాత్రి పట్టణంలోని నర్సయ్య అగ్రహారం దగ్గరలో ఉన్న రాహుల్ కేసరిని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై వారెంట్ ఉండడంతో జార్ఖండ్ పోలీసుల బృందం అతన్ని తీసుకెళ్లారని సీఐ శ్రీను చెప్పారు.

రాష్ట్ర సరిహద్దుల్లో మావోయిస్టుల కరపత్రాలు



రాష్ట్ర సరిహద్దుల్లో వెలసిన మావోయిస్టు కరపత్రాలు

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టుల కరపత్రాలు కలకలం రేపాయి. ఎటపాక మండల పరిధిలోని కన్నాయిగూడెం శివారులో జాతీయ రహదారిపై బీకే-ఏఎస్సార్ డివిజన్ మావోయిస్టు కమిటీ పేరుతో కరపత్రాలు శనివారం వెలుగు చూశాయి. ఆదివాసీల మనుగడకు ఇబ్బంది కలిగించే దేశ, విదేశీ బహుళజాతి కార్పొరేట్ కంపెనీల మైనింగ్, ప్లాంట్లు, రోడ్లు, డ్యాంలు, టైగర్ జోన్ల ప్రాజెక్టులను నిలిపివేయాలని పేర్కొన్నారు. ఉద్యమాలను అణచివేసే పారా మిలటరీ, ప్రత్యేక బలగాలను ఎత్తివేయాలని, దగాకోరు పార్లమెంట్ ఎన్నికలు బహిష్కరించాలని కరపత్రాల్లో డిమాండ్ చేశారు.

విశాఖ జూకు హైనా



గోతిలో చిక్కుకున్న హైనా

నెల్లిమర్ల రూరల్: విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని నెల్లిమర్ల–రణస్థలం ప్రధాన రోడ్డులో పినతరిమి కూడలి వద్ద విద్యుత్ స్తంభాలు వేసేందుకు తీసిన ఓ గోతిలో హైనా శుక్రవారం పడింది. గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ డీఆర్వో రాజు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఉదయం గ్రామానికి చేరుకుని జేసీబీతో హైనాను బయటకు తీసి విశాఖ జూకు తరలించారు.

కుదేలైంది యంత్రం కాదు.. రామోజీ కుతంత్రం!

కోవిడ్ కాలంలోనూ చిన్న పరిశ్రమలను ఆదుకున్న జగన్ ప్రభుత్వం



అక్షరమనే వజ్రాయుధాన్ని ఎంతగా భ్రష్టుపట్టించాలో అంతగానూ రామోజీ భ్రష్టుపట్టిస్తున్నారు..ఈనాడు అంటేనే ఏవగింపు కలిగేలా అబద్ధాలు, కుళ్లూ కుట్రల రాతలతో పత్రికను నింపేస్తున్నాడీ ఎల్లో పెద్ద మనిషి. చంద్రబాబంటే ఆమడదూరం పారిపోయే పారిశ్రామికవేత్తలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తర్వాతే తెప్పరిల్లారు. కోవిడ్ వంటి కష్టకాలంలోనూ జగన్ పరిశ్రమలను ఆదుకున్నారని దేశంలోనే గొప్ప పేరు తెచ్చుకున్న సీఎంగా గుర్తింపు పొందారు. అయిదేళ్ల కిందట తమకు దక్కని రాయితీలను పారిశ్రామిక వేత్తలు జగన్ ప్రభుత్వంలోనే అందుకుంటున్నారు. ఈ ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాల ఫలితంగానే పారిశ్రామిక వికాసం, ఉద్యోగ కల్పన పెరిగాయనడానికి తలసరి ఆదాయ వృద్ధే నిదర్శనం... ఈ నిజం రామోజీకి తెలిసినా, తప్పుడు రాతలకే కంకణం కట్టుకున్నారు కనుక కట్టుకథలనే అల్లుతారు.. జగన్ ప్రభుత్వంలోనే రాష్ట్ర ఎగుమతులు పెరిగాయి...చంద్రబాబు హయాంలో ఉన్న ఎంఎస్‌ఎంఈల సంఖ్యతో పోలిస్తే జగన్ ప్రభుత్వంలో ఇప్పుడు ఆరింతలుగా పెరిగింది...వాస్తవాలెప్పుడూ రామోజీకి చేదుగానే ఉంటాయి...అందుకే అక్షర గరళాన్ని జగన్ ప్రభుత్వంపై చిమ్ముతూనే ఉంటాడీయన...చంద్రబాబు ఎంఎస్‌ఎంఈలకు బకాయిలు పెట్టి జారుకుంటే...ఆ మొత్తాన్ని జగన్ తీర్చడమే కాదు...వాటికి ప్రోత్సాహకాలనూ అందిస్తూ...పారిశ్రామిక ప్రగతికి జగన్ అహరహం అడుగులు వేస్తున్నారు...ఆయన భరోసాయే పారిశ్రామికవేత్తలకు కొండంత అండ...ఏ వర్గానికీ మంచి జరగాలని చంద్రబాబు ఏనాడూ కోరుకోలేదు...రామోజీదీ అదే వరుస...అయినా వాస్తవాలు చెరిపేస్తే చెరిగిపోవు...చింపేస్తే చిరిగిపోవన్నది రామోజీ గుర్తించాలి...

> బాబు బకాయిలు రూ.1,588 కోట్లను తీర్చింది ఈ సర్కారే..
>
> మరో రూ.2,087 కోట్ల పారిశ్రామిక రాయితీలూ విడుదల
>
> బాబు పాలనకు మించి ఆరింతలుగా పెరిగిన ఎంఎస్‌ఎంఈలు
>
> పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వకపోయినా బాబుకు రామోజీ బాకా

సాక్షి, అమరావతి: తనవాడి పాలన అయితే తందాన తాన...తనకు నచ్చని వ్యక్తి అయితే ఎడాపెడా కారుకూతల రాతల విషం చిమ్మడం రామోజీకి అలవాటైపోయింది. చంద్రబాబు అధికారంలో ఉంటే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వకపోయినా రాష్ట్రంలో పారిశ్రామిక వెలుగులు అంటూ రాతలు రాస్తారు. అదే తనకు గిట్టని వాళ్లు అధికారంలో ఉంటే మాత్రం తిట్టిపోయడం రామోజీకి అలవాటైపోయింది. ఎంఎస్‌ఎంఈలకు బాబు పెట్టిన బకాయిలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీర్చినా సరే రాష్ట్రంలో పారిశ్రామిక రంగం తిరోగమనం ...అంటూ క్షుద్ర రాతలు రాస్తారు. ప్రపంచం ఎప్పుడూ చూడని విధంగా కోవిడ్ వంటి మహమ్మారి కాలంలోనూ రాష్ట్రంలో ఒక్క పరిశ్రమా మూత పడకుండా జగన్‌మోహన్‌రెడ్డి పారిశ్రామికవేత్తలను చేయిపట్టి నడిపించారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగమే కనుక తిరోగమనంలో ఉండి ఉంటే గత ఐదేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక రంగ వాటా పెరగడం ఎలా సాధ్యమవుతుందో రామోజీ జవాబివ్వగలరా? 2019–20లో రాష్ట్ర జీఎస్‌డీపీలో 22.04 శాతంగా ఉన్న పరిశ్రమల వాటా 2022–23 నాటికి 23.36 శాతానికి చేరిన విషయం వాస్తవమో, కాదో రామోజీ బదులివ్వగలరా? పారిశ్రామిక ప్రగతి, ఉద్యోగ కల్పన లేకపోయి ఉంటే తలసరి ఆదాయం ఎలా పెరిగిందో రామోజీ మట్టి బుర్రకు తట్టలేదా? గతేడాది దేశంలో తలసరి ఆదాయం సగటున రూ.23,476 పెరిగితే, మన రాష్ట్రంలో దాన్ని మించి రూ.26,931గా ఎలా పెరిగిందో ఈనాడు చెబుతుందా? 2021–22లో రూ.1,92,587గా ఉన్న రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం 2022–23 నాటికి రూ.2,19,518కు చేరిన విషయం రామోజీకి తెలియదా?. పారిశ్రామికవేత్తల అభిప్రాయాల ఆధారంగా ప్రకటిస్తున్న సులభతర వాణిజ్య ర్యాంకుల్లో వరుసగా మూడేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుస్తోంది. రాష్ట్ర ఎగుమతులు రూ.90,000 కోట్ల నుంచి రూ.1,60,000 కోట్లకు చేరుకున్నాయి. చంద్రబాబు హయాంలో 1.93 లక్షలుగా ఉన్న ఎంఎస్‌ఎంఈల సంఖ్య ఇప్పుడు ఏకంగా ఏడు లక్షలు దాటింది. కోవిడ్ సమయంలో రీస్టార్ ప్యాకేజీ, వైఎస్‌ఆర్ నవోదయం వంటి పథకాలను జగన్ ప్రభుత్వం సమర్థంగా అమలు చేయడం ద్వారా ఎంఎస్‌ఎండఈ రంగం ఎలా పురోగమించిందో ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి.

గత బకాయిలను విడుదల చేసింది ఈ ప్రభుత్వమే రామోజీ ..

గత ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలను పూర్తిగా నిర్లక్ష్యం చేయగా, జగన్ ప్రభుత్వం ప్రోత్సాహకాలను ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ ఆదుకుంది. గత ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలకు, స్పిన్నింగ్ మిల్లులకు కలిపి బకాయి పెట్టిన రూ.1,588 కోట్లను విడుదల చేయడమే కాకుండా రూ.2,087 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేసి ఆదుకున్న విషయం వాస్తవం కాదా రామోజీ? గతంలో పట్టణాలు నగరాలకు దూరంగా ఉన్న ఆటోనగర్లు, పారిశ్రామిక వాడలు పట్టణీకరణలో భాగంగా చాలాచోట్ల నగర మధ్య భాగంలోకి రావడంతో కాలుష్యకారక పరిశ్రమలను చాలా వరకు దూరప్రాంతాలకు ప్రభుత్వం తరలించింది. దీంతో పాత యూనిట్ల స్థలాలు వృధాగా ఉన్నాయి. కొన్ని సంస్థలు వాటి వ్యాపార కార్యకలాపాలను మార్చుకున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత భూములను ఇతర వాణిజ్య కార్యక్రమాలకు వినియోగించడం ద్వారా మరింత మందికి ఉపాధి కల్పించవచ్చని పారిశ్రామిక సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి జీవో నెంబర్ 5, 6ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ చర్యనూ తప్పుపడుతూ రామోజీ తన కలంతో ప్రభుత్వంపై విషం కక్కారు. అన్ని మౌలికవసతులు కల్పిస్తూ అభివృద్ధి చేసిన భూమి ధర మార్కెట్ రేటు కంటే అధికంగా ఉంటుంది. ఈ విషయాన్ని చిన్న పిల్లాడినా అడిగినా చెబుతాడు. ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కు అభివృద్ధికి అయిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని భూమి ధరలను నిర్ణయిస్తుంది. మార్కెట్ ధరలతో పోలిస్తే పారిశ్రామిక పార్కుల్లో భూమి ధర ఎక్కువగా ఉందంటూ రామోజీ రాస్తున్నారంటే ఏ స్థాయికి దిగజారిపోయారో రాష్ట్రమంతటికీ అర్థమవుతోంది.

తల్లి అంత్యక్రియల్ని అడ్డుకున్న తనయులు

బీమా సొమ్ము సమంగా పంచాలని పట్టు



గంగమ్మ మృతదేహం

సోమందేపల్లి: కని పెంచిన తల్లిని అవసాన దశలో పట్టించుకోలేదు. సపర్యలు చేసేవారు లేక, వైద్య సేవలందక ఆమె తనువు చాలించింది. తల్లి మరణం తరువాత వచ్చే బీమా సొమ్ము సమానంగా పంచాలంటూ భీష్మించిన బిడ్డలు అంత్యక్రియలను సైతం అడ్డుకున్నారు. ఒక రోజు దాటినా పట్టు వీడకపోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని అంతిమ సంస్కారాలు చేయించాల్సి వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం ఓబుళదేవరపల్లిలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గంగమ్మ (75), లక్ష్మయ్య దంపతులు. వీరికి ముగ్గురు కుమారులు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. వయోభారం కారణంగా లక్ష్మయ్య నడవలేని స్థితిలో ఉన్నాడు. గంగమ్మ అనారోగ్యంతో బాధపడుతుండేది. ఆమె పొదుపు చేసుకున్న రూ.2 లక్షల నగదును నెల క్రితం కుమారులు పంచుకున్నారు. కానీ.. తల్లికి సపర్యలు చేయడానికి ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. దీంతో వృద్ధ దంపతులు అర్ధాకలితో కాలం వెళ్లదీశారు. ఈ క్రమంలోనే శుక్రవారం గంగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అంతిమ సంస్కారాలు చేయాల్సిన తనయులు మానవత్వం మరిచారు. తల్లి బీమా డబ్బుకు నామినీగా ఒక మనవడి పేరే ఉందంటూ గొడవపడ్డారు. పాలసీ డబ్బు సమానంగా పంచితే తప్ప అంత్యక్రియలకు ఒప్పుకునేది లేదంటూ భీష్మించారు. ఇది సమయం కాదు.. తర్వాత చూసుకోండని గ్రామస్తులు నచ్చజెప్పబోతే వారితోనూ గొడవపడ్డారు. దీంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి. శనివారం మృతదేహం దుర్వాసన వస్తుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకుని కుటుంబ సభ్యులతో చర్చించి అంత్యక్రియలు జరిపించారు. కుమారులు డబ్బు కోసం తల్లి శవం వద్ద ప్రవర్తించిన తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

మంచి మద్యం బ్రాండ్లు తెస్తా

పవన్ కళ్యాణ్

పిఠాపురం: తాను గెలిస్తే మద్యం మంచి బ్రాండ్లు తీసుకువస్తానని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా రాజకీయాల్లోకి వచ్చి కూడా పదవి లేకుండా తిరిగానని, ఒక్కసారి తనను గెలిపించి అసెంబ్లీకి పంపించాలని విజ్ఞప్తి చేశారు. పిఠాపురం నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా దేశం గర్వించే విధంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు వచ్చి ఓట్లు అడిగితే నిలదీయాలని అన్నారు. అక్రమాలు, అన్యాయాలకు నెలవుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉందని, అటువంటి పార్టీకి భారీ భంగపాటు కలిగేలా ఓడించాలన్నారు. కేంద్ర నేతల వద్ద తనకు ఉన్న పలుకుబడితో రూ.100 కోట్ల వరకూ నిధులు తీసుకువచ్చి, పిఠాపురాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. 'నా టీడీపీని గెలిపించండి, నా బీజేపీని గెలిపించండి, నాతో పాటు నా 21 మంది ఎమ్మెల్యేలను గెలిపించి అసెంబ్లీకి పంపించండి' అని కోరారు. పవన్ వెంట టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తదితరులున్నారు.

నిబంధనల ఉల్లంఘన

తొలుత షెడ్యూల్ ప్రకారం పాదగయ క్షేత్రంలో వారాహి వాహనానికి పూజలు అని ప్రకటించిన పవన్.. అందుకు అనుమతులు లేకపోవడంతో రద్దు చేసుకున్నారు. అధికారులు ఇచ్చిన అనుమతి ప్రకారం సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల మధ్య సభ జరగాల్సి ఉంది. కానీ, రాత్రి 8 నుంచి 9.30 గంటల వరకూ సభ నిర్వహించారు. అనుమతి లేకుండానే వాహన శ్రేణితో పాటు మోటార్ సైకిల్ ర్యాలీ చేశారు.

తొక్కిసలాటలో పలువురికి గాయాలు



చేబ్రోలులో పవన్ సభలో బౌన్సర్లు అత్యుత్సాహం ప్రదర్శించడంతో తొక్కిసలాట జరిగి ఓ కానిస్టేబుల్ సహా పలువురికి గాయాలయ్యాయి. తుని సమీపంలోని అగ్రహారానికి చెందిన గాది అశోక్ కాలు నుజ్జునుజ్జయింది. చేబ్రోలుకు చెందిన చల్లపల్లి నాగు కాలు విరిగింది. ఉప్పాడ కొత్తపల్లికి చెందిన కానిస్టేబుల్ రాజేష్ కాలికి తీవ్ర గాయమైంది. మరికొందరు మురికి కాలువలో పడి గాయపడ్డారు. ఇంత జరుగుతున్నా పవన్ ప్రసంగాన్ని ఆపలేదు సరికదా.. గాయపడిన వారి పట్ల సానుభూతి కూడా ప్రకటించలేదు. కనీసం వారి పరిస్థితి ఏమిటన్నది కూడా పట్టించుకోకుండా వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది.

జన బలానికి... ధన బలానికి మధ్య పోరు

అనకాపల్లి: దొడ్డిదారిన రాజ్యసభ సీటు పొందిన సీఎం రమేశ్‌కు ధన బలం ఉంటే, సామాన్య కుటుంబంలో జన్మించిన తనకు ప్రజాబలం ఉందని, సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రమేశ్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారని ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. గవరపాలెం 81వ వార్డు సత్తెమ్మతల్లి రహదారిలో శనివారం అమ్మవారిని దర్శించుకుని ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులను, ఓటర్లను కొనేందుకు కడప నుంచి రమేశ్ రూ.150 కోట్లు తెచ్చారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ప్లాంట్ ఉద్యోగులు, ప్రజలు నిరసనలు, దీక్షలు, ర్యాలీలు చేస్తుంటే పట్టించుకోని రమేశ్‌కు దాని గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. పారిశ్రామికవేత్త, ధనిక వర్గానికి చెందిన రమేశ్‌కు బలహీన వర్గాల ప్రజల కష్టాలు ఏం తెలుసని ప్రశ్నించారు. ప్రచారంలో ఎంపీ బి.వి. సత్యవతి, అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి పాల్గొన్నారు.

పొత్తుల్ని ప్రజలు హర్షించడం లేదు

సాక్షి, అమరావతి: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల పొత్తును ఏపీ ప్రజలు ఏమాత్రం హర్షించడం లేదని ఓపెన్ మైండ్స్ సొసైటీ ప్రెసిడెంట్ ఎస్.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయనొక ప్రకటన చేస్తూ.. సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కొనేందుకు ఇంతమంది జత కట్టాలా అనే ప్రశ్నకు కూటమి నుంచి స్పష్టమైన సమాధానం చెప్పలేకపోతున్నారన్నారు. చిలకలూరిపేటలో నిర్వహించిన పేలవమైన సభ ఈ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ప్రధాని మోదీ ఈ సభకు హాజరుకాకపోయి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోందన్నారు. టికెట్ల కేటాయింపులో కనీస ప్రాధాన్యత కూడా దక్కకపోవడం వల్ల జనసేన పార్టీ తన సొంత క్యాడర్‌ను, కాపు ఓట్లను కోల్పోనుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

డీఎస్సీ పరీక్షలు వాయిదా

- ఏపీ టెట్ ఫలితాల వెల్లడి కూడా..
- ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ఆపాలని ఈసీ ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ)లను ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వాయిదా వేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అలాగే టెట్ ఫలితాలను కూడా వెల్లడించవద్దని సూచించింది. డీఎస్సీ పరీక్షల నిర్వహణ, టెట్ ఫలితాల వెల్లడిపై వివిధ వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మార్గనిర్దేశం చేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా లేఖ రాశారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసేవరకు ఏపీ టెట్ ఫలితాల వెల్లడి, డీఎస్సీ పరీక్షల నిర్వహణను వాయిదా వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల కోడ్ ముగిశాక హైకోర్టు తీర్పుకనుగుణంగా వీటిని నిర్వహించుకోవచ్చని తెలిపింది. ఇదేవిషయాన్ని పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్ కూడా తెలిపారు.


రేపటి నుంచి టెన్త్ మూల్యాంకనం

- ఏప్రిల్ 8వ తేదీకి పూర్తి



సాక్షి, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో విజయవంతంగా ముగిశాయి. మార్చి 18న ప్రారంభమైన పరీక్షలకు హాజరయ్యేందుకు రాష్ట్రవ్యాప్తంగా 6,23,092 మంది రెగ్యులర్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొత్తం 3,473 సెంటర్లలో 6,18,822 మంది పరీక్షలకు హాజరయ్యారు. ప్రధాన పరీక్షలు మార్చి 28వ తేదీతో ముగియగా, ఓరియంటల్, ఒకేషనల్ పరీక్షలు శనివారం ముగిశాయి. కాగా, సోమవారం నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. దాదాపు 50 లక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి 25 వేల మంది ఉపాధ్యాయులను నియమించినట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్ 8వ తేదీ నాటికి మూల్యాంకనం పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించామని పదో తరగతి పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

9న తిరుమల శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీన శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. ఉదయం 3 గంటలకు సుప్రభాతం నిర్వహించి, అనంతరం ఆలయాన్ని శుద్ధి చేయనున్నారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల నడుమ విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తర్వాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 9వ తేదీన శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాలను టీటీడీ రద్దు చేసింది.

శ్రీచైతన్య బ్రాండ్ అంబాసిడర్‌గా హీరోయిన్ శ్రీలీల



హైదరాబాద్: శ్రీచైతన్య విద్యాసంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ హీరోయిన్ శ్రీలీల వ్యవహరించనున్నట్లు విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మశ్రీ శనివారం తెలిపారు. విద్యా రంగంలో ఎన్నో సంచలన విజయాలు నమోదు చేస్తూ ఐఐటీ, జేఈఈ, నీట్‌లలో గతేడాది మూడు నంబర్ వన్ ర్యాంకులు సాధించిన ఘనచరిత్ర శ్రీచైతన్య విద్యాసంస్థలదేనని పేర్కొన్నారు. విద్యా సంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీలను నియమించడం ద్వారా తమ సంస్థ ప్రజలకు మరింత చేరువ అవుతుందని చెప్పారు. శ్రీలీల మాట్లాడుతూ...విద్యా రంగంలో శ్రీచైతన్య ఒక అద్వితీయమైన శక్తి అని, విద్యార్థులను విజయ తీరాలకు చేర్చే దిక్సూచి అని అన్నారు.

మనల్నీ మోసుకెళ్తుంది!

'న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్' అనే మరో రాకెట్ తయారీకి ఇస్రో శ్రీకారం

- భవిష్యత్‌లో చేపట్టే భారీ ప్రయోగాలకు వీలుగా రూపకల్పన
- **2028** నాటికి ప్రయోగాత్మక పరీక్ష..
- **2035** నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి..
- మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలకూ ఎన్‌జీఎల్‌వీనే..

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)

భవిష్యత్‌లో భారీ ప్రయోగాలకు తెర తీస్తున్న ఇస్రో.. అందుకు తగ్గట్లుగా అత్యాధునిక రాకెట్ తయారీకి శ్రీకారం చుట్టింది. ఈ రాకెట్‌కు న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్(ఎన్‌జీఎల్‌వీ) అని నామకరణం చేసింది. ఇస్రో తొలినాళ్లలో చేపట్టిన రోహిణి సౌండింగ్ రాకెట్‌ల ప్రయోగాల తర్వాత.. 40 కిలోల నుంచి 5,000 కిలోల బరువున్న ఉపగ్రహాలను మోసుకెళ్లే ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం3, ఎస్ఎస్ఎల్‌వీ అనే ఆరు రకాల రాకెట్లను ఇప్పటివరకు అభివృద్ధి చేసింది. త్వరలో మానవ సహిత ప్రయోగంతో పాటు వ్యోమగాముల్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లి.. తిరిగి సురక్షితంగా తీసుకొచ్చే ప్రయోగాన్ని కూడా చేపట్టాలని ఇస్రో భావిస్తోంది. వీటితో పాటు అత్యంత బరువుండే సమాచార ఉపగ్రహాలను జీటీఓ ఆర్బిట్‌లోకి పంపేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటోంది. ఈ నేపథ్యంలో న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ 20 వేల కిలోల బరువుండే ఉపగ్రహాలను భూమికి సమీపంలోని లియో ఆర్బిట్‌లోకి, 10 వేల కిలోల బరువుండే ఉపగ్రహాలను జీటీఓ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టే సామర్థ్యంతో ఎన్‌జీఎల్‌వీ తయారీని ఇస్రో చేపట్టింది. రూ.1,798 కోట్ల అంచనా వ్యయంతో



కూడిన ఈ ప్రాజెక్టును 2008 డిసెంబర్ 22న కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. సెమీ క్రయోజనిక్ దశ అభివృద్ధితో పాటు రాకెట్ భాగాలను రూపొందించేందుకు ఇస్రో కృషి చేస్తోంది. ఎన్‌జీఎల్‌వీ రాకెట్‌లోని అన్ని దశలను విడివిడిగా ప్రయోగించి.. పరీక్షించనుంది. 2028 నాటికల్లా మొదటి టెస్ట్ వెహికల్‌ను, దాని సామర్థ్యాన్ని పరీక్షించి.. 2035 నాటికి పూర్తి స్థాయిలో ఎన్‌జీఎల్‌వీ రాకెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.

ఎన్‌జీఎల్‌వీ విశేషాలు..

ఎన్‌జీఎల్‌వీ రాకెట్ ఎత్తు	రాకెట్ వెడల్పు	3
75 మీటర్లు	**5** మీటర్లు	దశల్లోనే రాకెట్ ప్రయోగం

- పీఎస్ఎల్‌వీ ఎక్స్‌ఎల్ తరహాలో ఎన్‌జీఎల్‌వీ రాకెట్‌కు ఆరు స్ట్రాపాన్ బూస్టర్లుంటాయి. కోర్ అలోన్ దశలో 160 టన్నుల సెమీ క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగిస్తారు
- క్రయోజనిక్ దశలో 30 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగిస్తారు
- ఇది ఫాల్కన్ రాకెట్, అట్లాస్–వీ, ప్రోటాన్–ఎం, లాంగ్ మార్చ్–58 రాకెట్‌లకు దీటుగా ఉంటుంది. ఇటీవల ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. 2030–35 నాటికి మానవ సహిత అంతరిక్షయానం, అత్యంత బరువైన సమాచార ఉపగ్రహాల ప్రయోగాలకు ఇది వీలుగా ఉంటుందని వివరించారు.

షార్‌లో మూడో లాంచ్‌ప్యాడ్

షార్ కేంద్రంలో మూడో ప్రయోగ వేదికను నిర్మించేందుకు ఇస్రో సిద్ధమవుతోంది. ఇప్పటికే శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో రెండు ప్రయోగ వేదికలు, 4 వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగులు అందుబాటులో ఉన్నాయి. ఎన్‌జీఎల్వీ కోసం మూడో ప్రయోగ వేదిక అవసరమని ఇస్రో గుర్తించింది. ఇప్పటికే శ్రీహరికోటలో స్థలాన్ని కూడా ఎంపిక చేసినట్టు సమాచారం. భవిష్యత్‌లో మ్యాన్ ఆన్ ద మూన్ ప్రయోగంతో పాటు అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపించి.. సురక్షితంగా తీసుకువచ్చే ప్రయోగాలు, చంద్రయాన్–4లో చంద్రుడి మీదకు రోబోను పంపించే ప్రయత్నాలు వంటి ప్రయోగాల కోసం మూడో ప్రయోగ వేదికను నిర్మించేందుకు ఇస్రో సిద్ధమైంది.

వైభవంగా ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం

- హాజరైన 3 లక్షల మంది భక్తులు
- తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద బ్రహ్మ రథంగా ప్రసిద్ధి



అశేష భక్తజనుల మధ్య కొనసాగుతున్న ఖాద్రీశుడి రథోత్సవం

కదిరి: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మ రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. పోటెత్తిన భక్తజనం స్వామివారిని దివ్యరథంపై దర్శించుకుని పరవశించిపోయారు. తొలుత స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8.12 గంటలకు వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్.మక్బూల్ అహ్మద్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తదితరులు రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఉత్సాహంగా రథం ముందుకు సాగింది. స్వామివారు తిరువీధుల గుండా విహరిస్తూ మధ్యాహ్నం 12.54 గంటలకు యథాస్థానం చేరుకున్నారు. మూర్తిపల్లి, బేరిపల్లి, కుటాగుళ్ల, నాగిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామస్తులు రథానికి వెనుకవైపు నుంచి సంద్ర మొద్దులు, తెడ్లు వేస్తూ రథ గమనాన్ని నియంత్రిస్తూ వచ్చారు. సుమారు మూడు లక్షల మందికి పైగా భక్తులు రథోత్సవానికి విచ్చేసినట్లు అధికారుల అంచనా. తమిళనాడు ఆండాల్ అమ్మవారి శ్రీవల్లిపుత్తూరు రథం, తంజావూరు జిల్లాలోని తిరువార్ రథం తర్వాత దేశంలోనే అతిపెద్ద బ్రహ్మరథంగా కదిరి తేరు ప్రసిద్ధిగాంచింది. తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద బ్రహ్మరథం కూడా ఇదే.

నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల మరో ఘనత

- సీతాకోక చిలుకలపై ప్రతిపాదిత ప్రాజెక్టుకు ఐఐటీ హైదరాబాద్ ఆమోదం
- విద్యార్థులను అభినందించిన ట్రిపుల్ ఐటీ డైరెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్

నూజివీడు: ఏలూరు జిల్లా, నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు మరో ఘనత సాధించారు. సీతాకోక చిలుకలు సమాచారాన్ని చేరవేసుకునే విధానంలోని సాంకేతికతను పరిగణనలోకి తీసుకొని అదే సాంకేతికతను ఏరియల్ రోబోటిక్ ప్లాట్‌ఫాం ద్వారా అమలు చేయడం కోసం నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు రూపొందించిన ప్రతిపాదిత ప్రాజెక్టును ఐఐటీ హైదరాబాద్‌లోని అటానమస్ నావిగేషన్ ఫౌండేషన్ ఆమోదించింది. ట్రిపుల్ ఐటీలో ఈఈఈ మూడో సంవత్సరం చదువుతున్న జస్వంత్, పావని ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను పంపారు. అటానమస్ నావిగేషన్ ఫౌండేషన్ దేశవ్యాప్తంగా బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులకు ఫెలోషిప్ రూపంలో సపోర్ట్ అందించడం ద్వారా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను కెరీర్‌గా తీసుకునేలా ప్రోత్సహిస్తోంది. ఈ ప్రాజెక్ట్ సలహాదారుల్లో ఒకరైన ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జాడ చక్రవర్తి ఐదేళ్ల నుంచి 'కమ్యూనికేషన్ మెథడాలజీ ఆఫ్ బటర్ ఫ్లై' అనే అంశంపై పనిచేస్తున్నారు. ఆయన లండన్ ఇంపీరియల్ కాలేజీకి సమర్పించిన పరిశోధన పత్రంతో విజిటింగ్ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. ప్రాజెక్ట్ గురించి చక్రవర్తి మాట్లాడుతూ సీతాకోక చిలుకలు వాటి సహజ ఆవాసాల్లో ప్రత్యేకమైన కమ్యూనికేషన్ మెథడాలజీని కలిగి ఉంటాయి, ఈ మెథడాలజీని అనుకరించడానికి ఉద్దేశించిన మల్టీ–డ్రోన్ ప్లాట్‌ఫాంను విద్యార్థులు నిర్మించబోతున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ కింద విద్యార్థులు అటానమస్ నావిగేషన్ ఫౌండేషన్ నుంచి రూ.3 లక్షలు, ఆర్జీయూకేటీ నుంచి రూ.2 లక్షలు స్పాన్సర్‌షిప్ పొందనున్నారని వివరించారు. దీనికి సంబంధించిన నివేదికను ఆరు నెలల్లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులిద్దరినీ నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్, ఏవో టి.చంద్రశేఖర్, అకడమిక్స్ డీన్ ఎస్.రత్నాకర్, ఈఈఈ హెచ్‌వోడీ పి.శ్రావణి కనక కుమారి అభినందించారు.

విశాఖలో విద్యార్థిని ఆత్మహత్యపై విచారణకు కమిటీ

- ముగ్గురు సభ్యులతో ఏర్పాటు చేసిన సాంకేతిక విద్యా శాఖ
- 24 గంటల్లో వివరణాత్మక నివేదిక ఇవ్వాలన్న కమిషనర్



మృతదేహం వద్ద విచారం వ్యక్తం చేస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి, ఎమ్మెల్యే పెట్ల

సాక్షి, అమరావతి/మహారాణిపేట(విశాఖ దక్షిణ)/నాతవరం (అనకాపల్లి జిల్లా): విశాఖ జిల్లా కొమ్మాదిలోని చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమో విద్యార్థిని రూపశ్రీ బలవన్మరణంపై సాంకేతిక విద్యా శాఖ విచారణకు ఆదేశించింది. సంఘటన పూర్వాపరాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి 24 గంటల్లోపు వివరణాత్మక నివేదిక అందించాలని కమిషనర్ చదలవాడ నాగరాణి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమిస్తున్నామన్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.చంద్ర శేఖర్ నేతృత్వంలో విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ మెటలర్జీ విభాగం అధిపతి డాక్టర్ కె.రత్నకుమార్, సివిల్ ఇంజినీర్‌లో లెక్చరర్ డాక్టర్ కె.రాజ్యలక్ష్మి సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యాసంస్థలోని ఫ్యాకల్టీ లైంగిక వేధింపుల కారణంగానే తాను చనిపోతున్నానని, తనలాగే కాలేజీలో పలువురు విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని తండ్రికి మెసేజ్ చేసి రూపశ్రీ చనిపోయిన విషయం తెలిసిందే.

నిందితులపై కఠిన చర్యలు తప్పవు: మహిళా కమిషన్

కళాశాల అధ్యాపకులే కీచకులై లైంగిక వేధింపులతో విద్యార్థిని మరణానికి కారకులవడం పట్ల రాష్ట్ర మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థిని రూపశ్రీ ఆత్మహత్యకు కారకులైన వారికి కఠిన శిక్షపడేలా అన్ని చర్యలు చేపడతామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి, సభ్యురాలు జయశ్రీ అన్నారు. రూపశ్రీ మృతదేహాన్ని శనివారం రాత్రి స్వగ్రామమైన నాతవరం మండలం ఎ.పి.పురం పంచాయతీ శివారు ఉప్పరగూడెం తీసుకు వచ్చారు. అక్కడకి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమలతో కలిసి వెంకటలక్ష్మి.. రూపశ్రీ మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. రూపశ్రీ తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాలిక ఆత్మహత్య విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి.. బాధిత కుటుంబాన్ని ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకముందు విశాఖ కేజీహెచ్‌లో రూపశ్రీ భౌతికకాయానికి జయశ్రీ నివాళులర్పించారు. విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్‌తో మాట్లాడిన జయశ్రీ.. దీనిపై సమగ్ర విచారణ జరిపి రాష్ట్ర మహిళా కమిషన్‌కు నివేదిక సమర్పించాలని కోరారు. బాలిక మృతికి చైతన్య కాలేజీ యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. అమ్మాయిలకు వేధింపులు ఎదురవుతున్నపుడు వెంటనే 'దిశ' పోలీసు స్టేషన్‌లోగానీ, పోలీసులకు గానీ తెలియజేయాలని సూచించారు. 'దిశ' యాప్ ద్వారా ఒక కాల్ చేస్తే.. మీ రక్షణ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు.

పెళ్లిలో భర్తతో డాన్స్.. కొన్ని గంటల్లోనే మృతి

పార్వతీపురం మన్యం జిల్లా దబ్బగెడ్డలో పెళ్లింట విషాదం

మక్కువ: పెళ్లైన ఆనందంలో భర్తతో కలిసి డాన్స్ చేసిన నవ వధువు కొన్ని గంటల వ్యవధిలోనే మృతి చెందిన విషాద ఘటన పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం దబ్బగెడ్డలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. దబ్బగెడ్డ గ్రామానికి చెందిన భాస్కరరావుతో పార్వతీపురం మండలం కొత్తవలస గ్రామానికి చెందిన అఖిల(20)కు శుక్రవారం రాత్రి పెళ్లి జరిగింది. మాంగల్యధారణ అనంతరం శనివారం తెల్లవారు జామున 3 గంటల వరకు ఊరేగింపు సాగింది. డీజే పాటలకు భర్తతో కలిసి అఖిల డాన్స్ చేసింది. అనంతరం నీరసంగా ఉందంటూ నిద్రలోకి జారుకుంది. తర్వాత బంధువులు వెళ్లి లేపగా, ఎంతకూ లేవకపోవడంతో వెంటనే మక్కువ పీహెచ్‌సీకు తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య సేవలు అందిన అనంతరం మెరుగైన చికిత్స కోసం సాలూరు సీహెచ్‌సీకు తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అఖిలకు తల్లిదండ్రులు లేరు. నానమ్మ, తాతయ్యల వద్దే పెరిగింది. ముందు రోజు ఉపవాసం ఉండటం, పెళ్లి తర్వాత డాన్స్ వేయడం వల్ల డీహైడ్రేషన్‌కు గురై మృతి చెంది ఉండవచ్చునని గ్రామస్తులు, బంధువులు భావిస్తున్నారు.



పెళ్లి ఊరేగింపులో భర్తతో కలిసి, చిరునవ్వు చిందిస్తున్న అఖిల

మద్దిచెట్టు నుంచి నీటి ధార

20 లీటర్ల మేర సేకరణ ● పాపికొండలు నేషనల్ పార్క్‌లో వింత సంఘటన

రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): దట్టమైన అటవీ ప్రాంతంలో మద్ది చెట్టు నుంచి ధారగా నీరు రావడం అటవీ అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. పాపికొండలు నేషనల్ పార్క్‌లోని ఇందుకూరు రేంజ్ పరిధి కింటుకూరు అటవీ ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. రంపచోడవరం డీఎఫ్‌వో నరేందిరన్ సిబ్బందితో కలిసి శనివారం కింటుకూరు అటవీ ప్రాంతానికి తనిఖీ నిమిత్తం వెళ్లారు. నల్లమద్ది చెట్టుకు బొడుపులు ఉన్నచోట కత్తితో గాటు పెట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. దీంతో గాటు పెడుతుండగానే నీరు ధారలా బయటకు వచ్చింది. దీనిపై డీఎఫ్‌వో మాట్లాడుతూ నల్లమద్ది చెట్టులో నీరు నిల్వ చేసుకునే వ్యవస్థ ఉందని, అందుకు తగ్గట్టుగా అవసరాలకు నీటిని చెట్టు తనలో దాచుకుందన్నారు. చెట్టు నుంచి సుమారు 20 లీటర్లు నీరు వచ్చినట్లు తెలిపారు. నీటిని రుచి చూసిన ఆయన తాగేందుకు ఉపయోగపడదని తెలిపారు. నల్లమద్ది చెట్టు బెరడు మొసలి చర్మంలా ఉండడంతో దీనిని క్రోకోడైల్ బర్క్ ట్రీ అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు.



కింటుకూరు అటవీ ప్రాంతంలో నల్లమద్ది చెట్టుకు గాటు పెడుతున్న ఫారెస్ట్ సిబ్బంది



చెట్టు నుంచి ధారగా వస్తున్న నీరు


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం । 31 । మార్చి । 2024



ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్
ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ విజయవాడ నగరంలో శనివారం నిర్వహించారు.
-IIలో▸



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.50 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఆదాయం రూ.11.05 లక్షలు
నెమలి(గంపలగూడెం): వేణుగోపాలస్వామి ఆలయం హుండీ కానుకల లెక్కింపులో రూ.11.05 లక్షల ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ వెంకట సాంబశివరావు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరీ (సోమ)
విజయవాడ	6.25	4.42
జగ్గయ్యపేట	6.28	4.49
మచిలీపట్నం	6.24	4.43
గుడివాడ	6.25	4.45

జోరుగా ప్రచార పర్వం



విజయవాడ సెంట్రల్ అయోధ్యనగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్

- ఇంటింటి ప్రచారంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమగ్నం
- పార్టీలో భారీగా చేరుతున్న నాయకులు
- విజయవాడ నగరంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో పార్టీలు ఎన్నికల ప్రచారంపై ఫోకస్ పెట్టాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గడప గడప పేరుతో నియోజకవర్గాలను చుట్టేశారు. ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన మేలును వివరించారు. నియోజకవర్గంలో బీసీ సభలు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వంలో కల్పించిన ప్రాధాన్యం, అందించిన సంక్షేమ ఫలాలను తెలియజేశారు. పోలింగ్‌కు మే 13 వరకు సమయం ఉండటంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకొంటున్నారు.

జెట్ స్పీడుతో వెలంపల్లి

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ ప్రజల్లోకి చొచ్చుకొని వెళ్తున్నారు. ఓటర్లలో జోష్ నింపుతున్నారు. ప్రత్యర్థి బొండా ఉమాకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. బొండా అవినీతి, దౌర్జన్యాలను ఎండగడుతూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని వివరిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. బొండా ఉమా తీరు నచ్చని పలువురు టీడీపీ నేతలు వెలంపల్లి శ్రీనివాస్, ఎంపీ కేశినేని ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జెండా కప్పుకున్నారు. దీనికితోడు ఎంపీ కేశినేని నాని సైతం తన వంతుగా ప్రచారంలో వెలంపల్లితో కలిసి పాల్గొంటున్నారు. వార్ వన్‌సైడేననే భావనకు తీసుకొచ్చారు.

దూసుకుపోతున్న దేవినేని అవినాష్

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆయన కుటుంబసభ్యులు సైతం విస్తృతంగా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు, అభివృద్ధి, సంక్షేమ ఫలాల గురించి ఓటర్లకు వివరిస్తున్నారు. అవినాష్, పార్టీ సీనియర్ నేత యలమంచిలి రవి, ఎంపీ కేశినేని నానిలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలిపించి అవినాష్ గెలుపే లక్ష్యంగా సమష్టి కృషితో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఎంపీ కేశినేని నాని సమావేశాలు, ప్రచారాల్లో పాల్గొంటూ భారీ మెజార్టీతో తనను, అవినాష్‌ను గెలిపించాలని కోరుతున్నారు.



విజయవాడ పశ్చిమంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్

వెస్ట్‌లో సమష్టిగా

విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో అభ్యర్థి ఆసిఫ్ చాపకింద నీరులా తన పని చేసుకుంటూపోతున్నారు. ప్రధాన సామాజిక వర్గాల ముఖ్యులతో సమావేశం అవుతూ తమకు సహకరించాలని కోరుతున్నారు. వ్యాపార సముదాయాలు, మార్కెట్లపైన ఫోకస్ పెట్టారు. వైఎస్సార్ సీపీకి బాగా పట్టున్న నియోజకవర్గం కావడంతో భారీ మెజార్టీ దక్కించుకొనే విధంగా పావులు కదుపుతున్నారు. జనసేన తరఫున టికెట్టు ఆశించి భంగపడ్డ పోతిన మహేష్ సామాజిక వర్గానికి చెందినవారు వైఎస్సార్ సీపీకి దన్నుగా నిలుస్తున్నారు.

పేటలో భానుకు జననీరాజనం

జగ్గయ్యపేటలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రతిరోజు గ్రామాల్లో తిరుగుతూ పార్టీపెద్దలు, కార్యకర్తలను కలుపుకొని ఓటర్లను కలుసుకుంటున్నారు. జగ్గయ్యపేటకు సంబంధించి అభివృద్ధి తానే చేశానని, సంక్షేమ ఫలాలు అందరికీ అందిచామని, మరోసారి అశీర్వదించాలని ఓటర్లను కోరుతున్నారు. ఆయన చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది.

పార్టీ క్యాడర్‌లో ఉత్తేజం

నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామాల్లో ఈయన చేస్తున్న ప్రచారం ఓటర్లలో జోష్ నింపుతోంది. ఎమ్మెల్యేకు తోడుగా సోదరుడు ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ సైతం ప్రచారంలో అండగా నిలుస్తున్నారు. నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ, పార్టీ క్యాడర్‌లో ఉత్తేజం నింపుతున్నారు.



ఎనికేపాడులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి చంద్రశేఖర్

సామాన్యుడికి అందలం

మైలవరం నియోజకవర్గంలో సామాన్యుడైన తనకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించారని, అందరూ ఆశ్వీరదించాలని సర్నాల తిరుపతిరావు ఓటర్లను అర్థిస్తున్నారు. ఎంపీ కేశినేని నానితో కలిసి చేసే ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తోంది. డబ్బు కాదు ముఖ్యం ప్రజాభిమానం, విశ్వసనీయత అవసరమని చేస్తున్న ప్రచారం నియోజకవర్గ ప్రజలను ఆలోచించేలా చేస్తోంది.

తిరువూరులో ముమ్మరం

తిరువూరులో ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ ఓటర్లను తనదైన శైలిలో ఆకట్టుకుంటున్నారు. ఆయన సతీమణి సుధారాణి ప్రచారంలో తోడుగా ఉంటున్నారు. ఎంపీ కేశినేని నాని సైతం నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్ ప్రచారానికి ఆ పార్టీ సామాజిక వర్గానికి చెందిన నేతలే దూరంగా ఉంటున్నారు.

ఇంటింటికీ ప్రచారం

పెనమలూరు నియోజకవర్గంలో మంత్రి జోగి రమేష్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో ప్రజలను అక్కున చేర్చుకొంటున్నారు. గ్రామాల్లోనే బస చేసి ఇంటింటికి తిరుగుతున్నారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు నుంచి ప్రచారం ప్రారంభించారు. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

భక్తులకు మజ్జిగ పంపిణీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులకు దేవదాయ శాఖ కమిషనర్ కె.సత్యనారాయణ మజ్జిగ పంపిణీ చేశారు. శనివారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రామారావు ప్రసాదాలు ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రానికి విచ్చేసిన కమిషనర్ సత్యనారాయణ స్వయంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. దాతల విరాళాలతో సుమారు రెండు నెలల పాటు మజ్జిగ చలివేంద్రాన్ని నడుపుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు దేవస్థానం చేస్తున్న సేవ అభినందనీయమని తెలిపారు.

హోంగార్డ్ కుటుంబాలకు ఆర్థిక చేయూత



విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డ్‌గా విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన టి.కమలకు, హోంగార్డ్‌గా విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన జి.గంగాధరరావు కుటుంబానికి కమిషనరేట్ పరిధిలోని హోంగార్డులు ఆర్థిక ఆసరా కల్పించారు. కమల, గంగాధరరావు కుటుంబాలకు హోం గార్డులు అందరూ కలిసి వారి ఒక్కరోజు వేతనాన్ని సమకూర్చారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో టి.కమలకు రూ.5 లక్షలు, గంగాధరరావు భార్య నాగలక్ష్మికి రూ.5 లక్షల చెక్కులను ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ కమాండెంట్ జి.చంద్రబాబు, డీఎస్పీ కె.వి.ఎస్.ఎన్.పరమేశ్వరరావు, ఆర్ఐ కె.సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

జనసేన మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా బాలశౌరి



సాక్షి, మచిలీపట్నం: జనసేన మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి పేరు ఖరారైంది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బాలశౌరి పేరును అధికారికంగా ప్రకటిస్తూ శనివారం ప్రకటన విడుదల చేసింది. 2019లో వైఎస్సార్ సీపీ ఎంపీగా గెలుపొందిన ఆయన రెండు నెలల క్రితం జనసేనలో చేరారు. ఎన్నికల నేపథ్యంలో టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడంతో అభ్యర్థి ప్రకటనలో తీవ్ర జాప్యం జరిగింది. ఆయన్ను ఎంపీగా కాకుండా అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా పంపడానికి పార్టీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ఇటీవలే చర్చ జరిగింది. చివరకు ఆయన్ను మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఇదిలా ఉండగా అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి ఆశావహులు అధికంగా ఉండటంతో అక్కడ సర్వే చేస్తున్నామని, రిపోర్టు ఆధారంగా అక్కడ అభ్యర్థిని ప్రకటిస్తామని పార్టీ పేర్కొంది.

దుర్గమ్మకు కానుకగా పగడాల దండ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు శనివారం బంగారం పూసలతో తయారుచేసిన పగడాల దండను కానుకగా సమర్పించారు. బర్కత్‌పురకు చెందిన చెరువు ఆంజనేయశాస్త్రి దంపతులు రూ.2 లక్షల విలువైన 25 గ్రాముల బంగారపు దండను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.1.07 కోట్లు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారికి భక్తులు హుండీల ద్వారా రూ.1.07 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడిగా సమర్పించారు. అమ్మవారి మండపంలో శనివారం కానుకలను లెక్కించారు. 64 రోజులకు గాను నగదు రూపంలో రూ.1,07,31,211, బంగారం 135 గ్రాములు, వెండి 350 గ్రాములు వచ్చినట్లు ఈవో కె.రమేష్‌నాయుడు తెలిపారు. అలాగే విదేశీ నగదు యూఎస్‌ఏ డాలర్లు 9, ఆస్ట్రేలియా 50, సింగపూర్ 30 డాలర్లు వచ్చాయన్నారు. కానుకలను ఆలయ సిబ్బందితో పాటు పరిటాలకు చెందిన శ్రీదుర్గా శివసాయి సేవా సమితి సభ్యులు, గ్రామానికి చెందిన భక్తులు లెక్కించారు. దేవదాయశాఖ అధికారులు పర్యవేక్షించారు.

ఉత్సవాల ద్వారా రూ.50.60 లక్షల ఆదాయం...

చిన్న తిరునాళ్ల మహోత్సవాల ద్వారా ఆలయానికి రూ.50,60,405 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.20,10,375, సేవల ద్వారా రూ.2,87,700, దర్శనాల ద్వారా రూ.8,46,350, కేశఖండనశాల టికెట్స్ ద్వారా రూ.2,87,480, తాత్కాలిక షాప్‌ల అద్దె ద్వారా రూ.16,21,000, డొనేషన్స్ ద్వారా రూ.7,500 వచ్చాయన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయన్నారు.

రిటైర్డ్ పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు

విజయవాడస్పోర్ట్స్: ప్రజలకు సుదీర్ఘకాలం పాటు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులకు ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ఎస్‌బీ ఏడీసీపీ కనకరాజు ఆత్మీయ వీడ్కోలు పలికారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఐలు కె.శ్రీనివాసరావు (సీసీఆర్‌బీ), ఎస్.వి.ప్రసాద్‌నాయుడు (దిశా), ఆర్.వెంకటేశ్వరరెడ్డి (సీసీఎస్), ఎం.టిన్నిపాల్ (సీఏఆర్), ఏఎస్ఐ ఎం.డి.వజీర్ (సీఏఆర్)లను సన్మానించారు. పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించినందుకు అభినందించారు.

గో బ్యాక్ నినాదంతో చంద్రబాబును తరిమికొట్టాలి

- పేదల పింఛను పంపిణీ విధుల నుంచి వలంటీర్లను తొలగించడం దారుణం
- ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలోని పేదలు, కార్మికులంతా గో బ్యాక్ బాబు నినాదంతో చంద్రబాబును తన సొంత తెలంగాణ రాష్ట్రానికి తరిమికొట్టాలని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) పిలుపునిచ్చారు. విజయవాడ గవర్నర్‌పేట బీసెంట్ రోడ్డులో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డితో కలిసి శనివారం విజయవాడలో ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. లెనిన్ సెంటర్, బీసెంట్ రోడ్డులోని వస్త్ర, బంగారు దుకాణాలతో పాటు ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి వివరాలున్న కరపత్రాలను పంపిణీ చేశారు. కేశినేని మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో పేదలు, కార్మికులు, కర్షకులు చంద్రబాబు అండ్‌కోను బంగాళఖాతంలో కలిపేయాలని సూచించారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పేదలే విజయం సాధిస్తారన్నారు. పేదల పింఛను పంపిణీ విధుల నుంచి వలంటీర్లను తొలగించాలని ఈసీ ఆదేశాలు జారీ చేయడం దురదృష్టకరమన్నారు. ఏ విధంగా ఈసీ గైడ్‌లైన్స్ ఇచ్చిందో పరిశీలించాల్సి ఉందని తెలిపారు. అర్హులందరికీ ఒకటో తేదీనే సామాజిక పింఛన్లు అందేలా చూడాలని ఈసీని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకే చేరుస్తున్న వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు, ఆయన బ్యాచ్ మొదట్నుంచి కుట్రలు చేస్తుందని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు పేదలు, ఆటో రంగ కార్మికులంటే చిన్నచూపు అని తెలిపారు.



బీసెంట్ రోడ్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ కేశినేని శ్రీనివాస్ తదితరులు

సామాజిక న్యాయం పాటిస్తూ....

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ అట్టడుగు వర్గాల వారికి, డ్రైవర్లకు ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తే చంద్రబాబు అవహేళన చేయడం ఆయన పేద వ్యతిరేక భావాలకు నిదర్శనమని చెప్పారు. ఆనాడు నందమూరి తారకరామారావు కర్షకులు, కార్మికుల కోసం పార్టీ ఏర్పాటు చేశారని, ఆయన ఐడియాలజీని చంద్రబాబు సప్తసముద్రాల్లో ముంచేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, సాక్షాత్తు పరిపూర్ణానంద స్వామే చెప్పారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మళ్లీ పేదల ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, వంగవీటి నరేంద్ర, డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు, ఒగ్గు విక్కీ, చల్ల సుధాకర్, నాదర్ శ్రీను, గోగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

- అర్బన్‌లో ఓటింగ్ శాతం పెంపునకు కృషి
- జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



2 కే రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సీపీ టీకే రాణా, జేసీ సంపత్‌కుమార్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటు అంటే ఏదో రాజకీయ పార్టీలకు సంబంధించిందనే భావన నుంచి బయటపడి.. ప్రజాస్వామ్య వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడే గొప్ప వజ్రాయుధమనే విషయాన్ని గుర్తించాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణం వద్ద శనివారం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టీకే రాణా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడి.. దేశ భవిష్యత్తును నిర్దేశించేది ఓటు హక్కు అని చెప్పారు. ఈ అంశాన్ని ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాలలతో పాటు విద్యా సంస్థల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ వినూత్నంగా ఓటరు జాగృతి కార్యక్రమాలు ఏర్పాటుచేశామన్నారు. గత ఎన్నికల్లో విజయవాడ అర్బన్ పరిధిలో సగటున 66 శాతం ఓటింగ్ నమోదైందని, దీనిని 85 శాతానికి పెంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రలోభాలు లేని వాతావరణంలో ఎథికల్ ఓటింగ్ ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమవుతందని పేర్కొన్నారు.

ఓటు వినియోగం నైతిక బాధ్యత....

పోలీస్ కమిషనర్ టీకే రాణా మాట్లాడుతూ ఓటు చాలా అమూల్యమైనదని.. ఎంతో మంది త్యాగాలు, ఎన్నో విప్లవాలు, పోరాటాల ఫలితంగా అత్యున్నత ప్రజాస్వామ్యం మనకు లభించిందన్నారు. దీన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా గత ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయని.. అందువల్ల ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు వివరించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మే 13న నిర్వహించే పోలింగ్‌లో అందరూ ఓటు వేసి ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం సందర్భంగా ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా నేను 2కే రన్‌ను విజయవంతంగా పూర్తి చేశాను.. తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకుంటాను.. అంటూ ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వీప్ జిల్లా నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు, కేఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ.మహేష్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్టులు) సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్, సీఎంవోహెచ్ రత్నావళి, ఏసీపీ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దేశ పురోగతిలో మహిళల పాత్ర కీలకం

విజయవాడ కల్చరల్: దేశ పురోగతిలో మహిళల పాత్ర విస్మరించలేనిదని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు అన్నారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, వివిధ రంగాల్లోని మహిళలకు భారత మహిళా శిరోమణి పురస్కారాల ప్రదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయబాబు మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ విజయాలు సాధిస్తున్నట్లు తెలిపారు. విజయనగరం మొదటి అడిషనల్ జడ్జి గందూరి రంజని మాట్లాడుతూ మహిళా సాధికారతను స్వాగతించాలన్నారు. న్యాయవాద వృత్తిలో వేలాది మంది మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ వ్యవస్థాపకుడు కొల్లూరి, సినీ నటుడు కాదంబరి కిరణ్ కుమార్ మాట్లాడారు. మగవాని ప్రతి విజయంలోనూ మహిళా శక్తి ఉంటుందని చెప్పారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా అక్కగా ఆమె ముందుకు నడిపిస్తుందన్నారు. కార్యక్రమాన్ని ఎక్స్‌రే కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, కోశాధికారి సీహెచ్‌వీ సుబ్బయ్య, సభ్యుడు రవికిరణ్ నిర్వహించారు. ధనదుర్గ, వెంకటరమణ, అన్నేకుసుమ, కె.శారద, ఉమాదేవి, డాక్టర్ కేవీఎల్ సుకన్యారావు, దోసపాటి పద్మజ, పిల్లి లక్ష్మీ తులసి, యక్కటి విజయదుర్గా పావని, మెహరున్నీసా, డాక్టర్ సరిత, బత్తుల మహేశ్వరి, టీజీ పద్మావతి, అంజనిలకు పురస్కారాలు ప్రదానం చేశారు.

క్లుప్తంగా

కేవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ కేంద్రీయ విద్యాలయ నంబర్ 1లో 2024-25 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతి, బాలవాటిక-3లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆదిశేషశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31, 2024 నాటికి 6 నుంచి 8 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లలు ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మొదటి తరగతి కోసం దరఖాస్తును ఆన్‌లైన్‌లో https://kvsonlineadmission.kvs.gov.in బాలవాటిక-3 కోసం, విద్యాలయ ప్రాంగణంలో దరఖాస్తు తీసుకోవచ్చని తెలిపారు పూర్తిచేసిన బాలవాటిక-3 దరఖాస్తులను కేంద్రీయ విద్యాలయ ప్రాంగణంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సమర్పించవచ్చని పేర్కొన్నారు. మొదటి తరగతి, బాలవాటిక-3 రిజిస్ట్రేషన్ ఏప్రిల్ ఒకటో తేదీ 10 గంటలకు ప్రారంభమై 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని వివరించారు. మరింత సమాచారానికి కేంద్రీయ విద్యాలయ వెబ్‌సైట్ https://nolvijayawada.kvs.ac.inలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

మచిలీపట్నం పీఎంశ్రీ కేవీలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2024-25కు 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆరేళ్ల వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. 2వ తరగతి అంతకన్నా ఎక్కువ తరగతుల్లో చేరడానికి ఖాళీలను బట్టి ఆఫ్‌లైన్ మోడ్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. అడ్మిషన్, రిజిస్ట్రేషన్ ఫారాలు విద్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

బాలికను మోసగించిన యువకుడి అరెస్ట్

నాగాయలంక: గ్రామానికి చెందిన బాలికను మోసగించిన యువకుడిని నాగాయలంక పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం స్థానికురాలైన బాలిక(15)ను నాగాయలంకకు చెందిన పిన్నినవభరత్ అనే యువకుడు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి ఆమెను తీసుకెళ్లిపోయాడు. దీనిపై బాలిక తండ్రి ఈ నెల 22వ తేదీ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేశారు.

ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సదరు బాలిక పోలీసుస్టేషన్‌కు వచ్చి జరిగిన విషయాలు చెప్పింది. బాలికను మోసం చేసిన భరత్ కోసం అన్వేషిస్తున్నారు. శనివారం ఉదయం వక్కపట్లవారిపాలెం లాకుల వద్ద నిందితుడిని అరెస్ట్ చేశారు. మధ్యవర్తుల సమక్షంలో అదుపులోకి తీసుకున్న భరత్‌ను అవనిగడ్డ జెఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో శనివారం రన్ ఫర్ జీసస్ (క్రీస్తు కోసం పరుగు) నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును స్వాగతిస్తూ కాగడాలు వెలిగించి ఆనందోత్సాహాలతో పరుగు సాగించారు. ఏపీ ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చిస్, నగర క్రైస్తవ సంఘాల సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన ఈ రన్ బెంజిసర్కిల్ సమీపంలోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చి వద్ద ప్రారంభమై పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, మదర్ థెరిస్సా విగ్రహం, జమ్మిచెట్టు సెంటర్, శిఖామణిసెంటర్, రెడ్‌సర్కిల్ మీదగా సూర్యారావుపేటలోని సెయింట్ పాల్స్ బసిలికా చర్చి వరకూ కొనసాగింది. రన్‌ను విజయవాడ కతోలిక పీఠం బిషప్ మోస్ట్ రెవరెండ్ తెలగతోటి జోసఫ్ రాజారావు, సీఎస్ఐ కృష్ణా గోదావరి డయాసిస్ బిషప్ తంటేపూడి జార్జి కార్నేలియస్‌తో కలిసి వైఎస్సార్ సీపీ విజయవాడ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కాగడాలు వెలిగించి ప్రారంభించారు. ఆయన విశ్వాసులతో కలిసి మదర్‌థెరిస్సా విగ్రహం వరకు రన్‌లో పాల్గొన్నారు. అక్కడ మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బిషప్ జోసెఫ్ రాజారావు మాట్లాడుతూ.. సిలువ మరణం ద్వారా పునరుత్థానుడైన క్రీస్తు సందేశం ప్రపంచ శాంతికి సందేశం కావాలన్నారు. మానవునికి సిలువ శక్తినిస్తుందని, సిలువ మరణాన్ని జయిస్తుందని పేర్కొన్నారు. సీఎస్ఐ బిషప్ కార్నేలియస్ మాట్లాడుతూ.. 'రన్ ఫర్ జీసస్' ప్రపంచ శాంతికి నాంది కావాలని పిలుపునిచ్చారు. అన్ని క్రైస్తవ సంఘాలు ఒకే వేదిక మీదకు వచ్చి ప్రపంచ శాంతికోసం 14 ఏళ్లుగా ఏసు కోసం పరుగు నిర్వహిస్తూ క్రైస్తవుల ఐక్యతను తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ కతోలిక పీఠం మోన్సిన్యోర్ రెవరెండ్ మువ్వల ప్రసాద్, నిర్వాహకులు రెవరెండ్ అల్లూరి విశ్వప్రసాద్, బెల్లంకొండ శివాజీ రాజు, ఎస్.జయకుమార్‌బాబు, శీలం ప్రవీణ్, రెవరెండ్ రబ్బూనీ, సిరిపురపు గ్రిటన్, రెవరెండ్ ఐ.కరుణానిధి తదితరులు పాల్గొన్నారు. ఈ రన్‌లో వేలాదిగా క్రీస్తు విశ్వాసులు పాల్గొని జయహో క్రీస్తు రాజా.. జయం జయం, మృత్యుంజయుడైన క్రీస్తు జయం జయం అంటూ నినదించారు.



'రన్ ఫర్ జీసస్' ర్యాలీలో కాగడాలు పట్టుకుని నడుస్తున్న తెలగతోటి జోసెఫ్, రాజారావు, టి జార్జ్ కార్నేలియస్, దేవినేని అవినాష్, క్రైస్తవ సంఘాలు

అనధికార లే ఔట్లు ధ్వంసం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ అనుమతి లేకుండా అక్రమంగా వేసిన లే ఔట్లను అధికారులు ధ్వంసం చేశారు. మైలవరం మండలం మైలవరం, పొందుగుల, సబ్జాపాడు గ్రామాల్లో శనివారం ప్రభుత్వ అనుమతి లేకుండా వేసిన అక్రమ లే ఔట్లను సీఆర్‌డీఏ అధికారులు పొక్లెయిన్లతో తొలగించారు. వ్యవసాయ భూముల్లో అక్రమంగా వేసిన లే ఔట్లను గుర్తించి సర్వే రాళ్లను తొలగించాలని సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ భూములకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రోడ్లను నిర్మించి ప్లాట్లుగా విడగొట్టి ప్రజలకు విక్రయిస్తే ప్రభుత్వాదాయానికి భారీగా గండిపడుతుందని పేర్కొన్నారు. పొందుగుల గ్రామంలోని సర్వే నెంబర్ 425-1ఏ1, 1ఏ3, 1బీ1, 1బీ3, 48-2(పి), 475-2(పి), 478-3(పి), సబ్జాపాడు గ్రామంలో సర్వే నెంబర్ 82-1ఏ, 1బీ, 2ఏ,2బీ నంబర్లలో లే ఔట్లను ధ్వంసం చేశామన్నారు. అనధికార లే ఔట్లలో ప్లాట్లు విక్రయిస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి లే ఔట్లలో ప్లాట్లు కొని మోసపోవద్దని హెచ్చరించారు. ఇలాంటిచోట భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వరని పేర్కొన్నారు. అనధికార లే ఔట్లు, అక్రమ నిర్మాణాలు చేపడితే వివరాలు 70955 99838 నంబరుకు వాట్సాప్ చేయాలన్నారు. 0866- 2527154 నంబరులో సంప్రదించాలని కోరారు.



మైలవరం మండలంలో అక్రమ లే ఔట్లను ధ్వంసం చేయిస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

8 కేజీల గంజాయి స్వాధీనం

రామవరప్పాడు: ఆర్టీసీ బస్సులో ఇద్దరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న 8 కేజీల గంజాయిను పోలీసులు గూడవల్లి చెక్ పోస్టు వద్ద శుక్రవారం రాత్రి స్వాధీనపరుచుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల సందర్భంగా డీసీపీ అదిరాజ్ సింగ్ రాణా నేతృత్వంలో సెంట్రల్ ఏసీపీ భాస్కర రావు పర్యవేక్షణలో సిబ్బంది గూడవల్లి చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలు చేశారు. ఈనెల 29న రాత్రి విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపి తనిఖీలు నిర్వహించారు. బస్సులో అనుమానాస్పదంగా ఉన్న అసోం, నవగావ్ జిల్లాకు చెందిన అబ్దుల్ రఫిక్, బెంగుళూరుకు చెందిన ముజామిల్ బాషా బస్సు దిగి పారిపోయేందుకు ప్రయత్నించారు. వీరిని అదుపులోకి తీసుకుని బ్యాగ్‌లను సోదాలు చేశారు. ఒక్కొక్క బ్యాగ్‌లో 4 కేజీల చొప్పున రెండు బ్యాగ్‌లలో 8 కేజీల గంజాయి ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి బెంగుళూరు తీసుకెళ్తున్నట్లుగా విచారణలో గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిద్దరినీ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో పటమట సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ సతీష్ కుమార్, ఎస్ఎస్‌టీ టీమ్ ఇన్‌చార్జి జి. సతీష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

పెనుగంచిప్రోలులో ఉద్రిక్తం

- ఇరువర్గాల మధ్య దాడులు
- ఒకరికి తీవ్రంగా, ముగ్గురికి స్వల్పగాయాలు

పెనుగంచిప్రోలు: ఇరు వర్గాల మధ్య జరిగిన దాడిలో ఒకరికి తీవ్ర గాయాలవ్వగా.. మరో ముగ్గురు స్వల్ప గాయాలైన ఘటన గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెనుగంచిప్రోలు గ్రామంలో డౌన్ సెంటర్‌లోని ఎస్సీ కాలనీ, పక్కనే ఉన్న బీసీ కాలనీకి చెందిన యువకుల మధ్య మూడు రోజులుగా ఘర్షణలు, దాడులు జరుగుతున్నాయి. దీనిపై స్థానిక పీఎస్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ క్రమంలో బీసీ కాలనీకి చెందిన గుంజి యాదగిరి మరి కొందరు కత్తి, కర్రలు, స్క్రూ డ్రైవర్‌తో ఎస్సీ కాలనీలకు చెందిన వారిపై దాడి చేశారు. యాదగిరి ఎస్సీ కాలనీకి చెందిన నందికోలు రాజేష్‌ను కత్తితో పొట్టలో పొడవటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఐదుమళ్ల గోపాలరావు, విఘ్నేష్, గేర నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని మొదట పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, అనంతరం జగ్గయ్యపేటకు మెరుగైన వైద్యం కోసం రాజేష్‌ను విజయవాడ తరలించారు. ఘటన గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత కలిగించింది. దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకోవాలంటూ డౌన్ సెంటర్‌లో ఎస్సీ కాలనీవాసులు బైఠాయించారు. దాడి చేసిన యాదగిరి కుటుంబానికి చెందిన కూరగాయల దుకాణం ఎస్సీ కాలనీకి చెందిన యువకులు ధ్వంసం చేయటంతో పాటు ఇళ్లపై దాడులు చేశారు. ఘటనా స్థలానికి ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో నందిగామ సబ్ డివిజన్ సీఐ, ఎస్ఐలతో పాటు సిబ్బంది, ఏఆర్ సిబ్బంది మోహరించారు.



తీవ్రంగా గాయపడిన రాజేష్

బస్సు ఢీ.. యువకుడి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు మృతి చెందాడు. ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోట నివాసి కావటి దుర్గారావు కూలీ పని చేస్తుంటాడు. ఆయనకు భార్య ఆదిలక్ష్మి, కుమారుడు సందీప్ అలియాస్ సన్నీ(19), కుమార్తె ఉన్నారు. సందీప్ ఎంజీ రోడ్డులో ఓ హోటల్ వద్దజ్యూస్ షాప్‌లో పని చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంపై షాపు నుంచి తిరిగి ఇంటికి బయలుదేరాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో సత్యంగారి హోటల్ సమీపంలోని జంక్షన్‌లో జాతీయ రహదారిని దాడుతున్నాడు. అప్పుడు వారధి నుంచి బస్టాండ్ వైపు అతివేగంగా హారన్ కొట్టుకుంటూ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. సందీప్ కిందపడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావమైన అతను ఘటనా స్థలంలోనే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని మేనమామ ఎస్.దాసు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమన్వయంతో పని చేయండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఈవీఎం కమిషనింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ ఢిల్లీరావు శనివారం వీఎంసీ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఆర్వో స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఇందిరాగాంధీ స్టేడియాన్ని సందర్శించారు. అక్కడ తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వేసవి దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పేదలకు సాయం అందించడంలో ఎల్లప్పుడు ముందుంటామని దేవినేని సుధీర అన్నారు. స్థానిక 8వ డివిజన్‌లో నివాసం ఉండే మాచర్ల ప్రశాంత్‌కు కళాశాల ఫీజు చెల్లించేందుకు వైఎస్సార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ ఆధ్వర్యంలో 15 వేల రూపాయలను శనివారం అందజేశారు. విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవినేని క్రాంతి, యలమంచిలి అరుణ, కొల్లి రవి, తుమ్మల రాంబాబు, పొట్లూరి రవి, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు తక్షణమే క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజాగళం యాత్రలో శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులుపై చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలను ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఖండించారు. టిప్పర్ డ్రైవర్‌కు జగన్ ఎమ్మెల్యే సీటు ఇచ్చాడని అవహేళనగా మాట్లాడి చంద్రబాబు తాను కులోన్మాది అని మరోమారు నిరూపించుకున్నారని అన్నారు. పేదల పట్ల, ప్రత్యేకంగా మాదిగల పట్ల చంద్రబాబుకు చులకన భావమని పేర్కొన్నారు. ఉన్నత విద్యావంతుడైన మాదిగ కులానికి చెందిన వీరాంజనేయులు పొట్టకూటికోసం డ్రైవరు వృత్తి చేయడం నేరమా? అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు ఎస్సీల్లో ఎవరైనా పుడతారా? అని, బీసీల తోకలు కత్తిరిస్తా అంటూ కులోన్మాదంతో వ్యవహరించి ఆయా వర్గాల ఆగ్రహానికి గురైన విషయాన్ని గుర్తుచేశారు. వీరాంజనేయులును అవమానించే రీతిలో వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటేయండి



గుణదల(విజయవాడ తూర్పు): సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటేయాలని మాచవరం సీఐ గుణరామ్ తెలిపారు. గుణదల గంగిరెద్దుల దిబ్బ వైఎస్సార్ కాలనీ సచివాలయం వద్ద ఓటు హక్కుపై అవగాహనా కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాజ్యాంగం మనకిచ్చిన ప్రాథమిక హక్కుల్లో ఓటు హక్కు అత్యంత ప్రధానమైనదన్నారు. మన ఓటు ద్వారానే పాలకులను ఎన్నుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఓటుతో మన భవిష్యత్‌ను మనమే నిర్ణయించుకోవచ్చన్నారు. ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని సుపరిపాలనకు దోహదపడాలని కోరారు. ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలని సూచించారు. రాగద్వేషాలకు తావులేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఎటువంటి భయం లేకుండా పౌరులంతా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్‌రావు, స్థానికులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీవాగ్దేవి కూచిపూడి నృత్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శనివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరిగింది. శివాష్టకం, కొండలలో నెలకున్న కోనేటి రాయుడు వంటి పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కళావేదిక వద్ద చిన్నారుల నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను అభినందించడంతో పాటు వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

అత్యాధునికం.. అతి సమీపం

- యూపీహెచ్‌సీల్లో ఆధునిక సేవలు
- విజయవాడలో 41 యూపీహెచ్‌సీలు
- అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- పతి రోజూ 80 నుంచి 150 మందికి పరీక్షలు
- ప్రతి రోగికి ఐడీ క్రియేట్



లబ్బీపేటలో ఆధునిక రక్తపరీక్షల పరికరాలు



యూపీహెచ్‌సీలకు నిర్మించిన ఆధునిక భవనం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఒకప్పుడు పట్టణాల్లోని పేదలు వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం పెద్దాస్పత్రిలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా, తాము నివశించే ఇంటి సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. అక్కడ అన్ని రకాల పరీక్షలు చేయడంతో పాటు మందులు సైతం ఉచితంగా అందజేస్తున్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని సైతం నియమించింది. దీంతో ఇప్పుడు యూపీహెచ్‌సీలు పూర్తి స్థాయి వైద్యం అందించే ఆస్పత్రులుగా రూపాంతరం చెందాయి. ప్రతి సెంటర్‌లో వైద్యుడు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఫార్మశిస్టు, డేటాఎంటీ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, లాస్ట్‌గ్రేడ్ వర్కర్ సేవలు అందిస్తున్నారు. అంతేకాదు ప్రసవాలు సైతం చేసే స్థాయిగా చేరుకున్నారు. ఇటీవల సింగ్‌నగర్ యూపీహెచ్‌సీలో తొలిసారిగా ప్రసవం చేశారు.

నగరంలో యూపీహెచ్‌సీలు..

విజయవాడ నగరంలో 41 యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. తూర్పు నియోజకవర్గంలో 13 వైఎస్సార్ యూపీహెచ్‌సీలు ఉన్నాయి. భ్రమరాంబపురం, కృష్ణలంక, రాణిగారితోట, బాలాజీనగర్, రామలింగేశ్వరనగర్, లబ్బీపేట, పటమట అంబేడ్కర్‌కాలనీ, పటమటలంక, ఏపీఐఐసీ కాలనీ, క్రీస్తురాజుపురం, గుణదల గంగిరెద్దుల దిబ్బ, కార్మికనగర్, గులాంమొహిద్దీన్‌నగర్‌లలో సేవలు అందిస్తున్నాయి. వాటిలో భ్రమరాంబపురం, గుణదల గంగిరెద్దుల దిబ్బ, ఏపీఐఐసీ కాలనీల్లో ఒక్కో సెంటర్‌కు రూ. కోటిన్నర వ్యయంతో నూతన భవనాలు నిర్మాణం చేపట్టారు. వాటిలో డాక్టర్స్ రూమ్‌లు, 10 పడకలతో వార్డు, ల్యాబ్ వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

పెరిగిన ఓపీ రోగులు..

ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉండటంతో అవుట్ పేషెంట్స్ సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఒక్కో కేంద్రంలో ప్రతి రోజూ 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. అంతేకాకుండా ప్రతి రోగికి ఎలక్ట్రానిక్ రికార్డులు రూపొందిస్తూ ఐడీని క్రియేట్ చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ రికార్డులు రూపొందించడంలో యూపీహెచ్‌సీలు ముందున్నాయి.

అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు 182 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం అత్యాధునిక పరికరాలను సమకూర్చడంతో పాటు, వాటిపై పరీక్షలు చేసేందుకు అనుభవజ్ఞులైన ప్రొఫెసర్‌లతో ల్యాబ్ టెక్నీషియన్స్‌కు శిక్షణ ఇప్పించారు. దీంతో గర్భిణులు, బాలింతలు, రోగులకు అవసరమైన అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం



ఒకప్పుడు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళితే అక్కడ ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదు. అలంకార ప్రాయంగా ఉండేవి. ఏదైనా సమస్య ఉంటే పెద్దాస్పత్రికి వెళ్లమని చెప్పేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అన్ని రకాల జబ్బులకు ఇక్కడే వైద్యం చేస్తున్నారు. ఏదైనా పెద్ద సమస్య ఉంటే ప్రభుత్వాస్పత్రికి వెళ్లమని సూచిస్తున్నారు. కాలనీలో నివశించే పేదలకు యూపీహెచ్‌సీల్లో మంచి వైద్యం అందుతుంది.

– ఎండీ రెహానా నాహీద్, కార్పొరేటర్, 19వ డివిజన్

అందుబాటులో ఆధునిక సేవలు..



ఇప్పుడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆధునిక వైద్య సేవలు అందుతున్నాయి. ఇంటికీ సమీపంలోనే ఆధునిక వైద్యం అందుతుండటంతో ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా వైద్యం పొందగలుగుతున్నాం. అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. శాశ్వత వైద్యుడు అందుబాటులో ఉన్నారు. అవసరమైతే నిపుణులైన వైద్యులను టెలీ మెడిసిన్‌లో సంప్రదించి మందులు ఇస్తున్నారు.

– కసగోని జ్యోతి, కృష్ణలంక

వచ్చే ఐదేళ్లలో ఆటోనగర్ అభివృద్ధికి విశేష కృషి

- వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్
- ఏటీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం



ఏటీఏ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): వచ్చే ఐదేళ్లలో ఆటోనగర్ అభివృద్ధికి విశేష కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. జవహర్ ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మీయ సభకు ఏటీఏ అధ్యక్షుడు రాజనాల వేంకటరమణారావు అధ్యక్షత వహించారు. ఆటోనగర్ సమస్యలను వేంకటరమణారావు అవినాష్‌కు వివరించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. తాను లండన్‌లో ఉన్నత విద్యను పూర్తి చేశానని, తనకు వ్యాపారాలు లేవని, కేవలం ప్రజలకు సేవ చేసేందుకు మంచి మనస్సుతో ముందుకు వచ్చానన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. వ్యాపారులకు, కార్మికులకు ఒక నమ్మకాన్ని కల్పించే విధంగా నిరంతరం పనిచేస్తామని చెప్పారు.

అవినాష్‌కు సన్మానం..

గత ఐదేళ్లలో రూ.650 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఆటోనగర్ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని కోరారు. అనంతరం అవినాష్ ఏటీఏ సభ్యులు సన్మానించారు. మెకానిక్ సంఘంతో పాటు కార్పెంటరీ, పెయింటర్, లారీ బాడీబిల్డింగ్, సీట్ వర్కర్స్, గ్లాస్ వర్క్స్, ఎలక్ట్రీషియన్, ట్రాన్స్‌పోర్టు, వెల్డింగ్‌వర్క్స్, ఫౌండ్రీ, క్లచ్ అండ్ బ్రేక్ అసోసియేషన్లతో పాటు వివిధ సంఘాలకు చెందిన 200 మందికిపైగా ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏటీఏ ఉపాధ్యక్షులు అర్జా సత్యనారాయణ, కార్యదర్శి రావి రామచంద్రారావు, కోశాధికారి సయ్యద్ షా సాహెబ్ హుస్సేని, రామాయణపు సాంబయ్య, మేడిశెట్టి విజయ్‌కుమార్, ఎస్‌కే బందగీ, పార్టీ సీనియర్ నాయకులు ముసునూరి సుబ్బారావు, ఆళ్ల చెల్లారావు, అన్నె చిట్టిబాబు, రిజ్వాన్, దేవినేని సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు తాగునీటి సదుపాయం అభినందనీయం



పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించడం అభినందనీయమని నాల్గవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారామ్ అన్నారు. రాజీవ్‌నగర్‌లోని రాజీవ్ గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నందు కోస్టల్ బ్యాంక్ సీఎస్ఆర్ ఫండ్స్‌తో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటు, షెడ్‌లను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమంలో జడ్జి పి.రాజారామ్ మాట్లాడుతూ సోషల్ సర్వీసెస్ రెస్పాన్సిబిలిటీని కోస్టల్ బ్యాంక్ వీటిని అందించినందుకు అభినందించారు. ఆర్‌ఓ ప్లాంటును ఈ హైస్కూల్లో ఏర్పాటు చేయడానికి న్యాయవాది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ చంద్రగిరి రాధాకుమారి సహాయ సహకారాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంక్ ఏసీఎం ఎస్.మదనమోహన్, రామకృష్ణ, హైస్కూల్ హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, బీబీఏ ప్రెసిడెంట్ కె.చంద్రమౌళి, బీబీఏ జీఎస్ ఎ.రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే కాపుల సంక్షేమం, అభివృద్ధి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాస కుమార్



భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలోనే కాపు సామాజికవర్గం సంక్షేమం, అభివృద్ధి జరిగిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, కాపు నేత ఆకుల శ్రీనివాస కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాపులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు సీఎం జగన్ రానున్న ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 31 మందికి ఎమ్మెల్యే టికెట్లు, ఐదు ఎంపీ సీట్లు ప్రకటించారని తెలిపారు. కానీ టీడీపీ కూటమి 23 ఎమ్మెల్యే (టీడీపీ 14, జనసేన 9), మూడు ఎంపీ సీట్లు మాత్రమే ఇచ్చిందంటే కాపుల సంక్షేమంపట్ల వారికున్న చిత్తశుద్ధి తేటతెల్లమవుతుందని అన్నారు. కాపు సామాజికవర్గానికి జగన్ ప్రభుత్వం చేసిన మంచి గత 60 ఏళ్లలో ఏ ప్రభుత్వమూ చేయలేదని పేర్కొన్నారు. చంద్రబాబు ముసుగులో ఉన్నందునే పవన్ కల్యాణ్‌కు కాపులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కాపులకు చంద్రబాబు చేసిన సాయం రూ.1,340 కోట్లు మాత్రమేనని, కానీ సీఎం జగన్ ప్రభుత్వం కాపు నేస్తం ద్వారా అందించిన సాయం రూ.2,029 కోట్లని ఆకుల వివరించారు.

కాపులకు చేకూర్చిన లబ్ధి రూ.39,247 కోట్లు

గత 52 నెలల్లో 77 లక్షల మంది కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల లబ్ధిదారులకు డీబీటీ ద్వారా రూ.22,333 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.16,914 కోట్లు అందిందని తెలిపారు. మొత్తం మీద రూ.39,247 కోట్ల మేర సీఎం జగన్ ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందన్నారు. గత ఎన్నికలకు ముందు కాపులను బీసీల్లో కలుపుతానని చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చమని పోరాడిన ముద్రగడ కుటుంబాన్ని ఎంతగా హింసించిందో అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. తుని రైలు దహనం కేసులో కుట్రపూరితంగా వందలాది మంది కాపు యువతపై చంద్రబాబు కేసులు పెట్టిస్తే అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి వారందరిపై కేసులు ఎత్తి వేయించారని గుర్తు చేశారు. చంద్రబాబుపై దుమ్మెత్తిపోసిన పవన్ కల్యాణ్ తరువాత అతని పార్టీతో అనైతిక పొత్తు పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. అమరావతి రాజధాని అనేది ఒక కుల రాజధాని మాత్రమేనని, అక్కడ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజలు బతకగలరా అని ప్రశ్నించారు. రేపు పిఠాపురంలో పవన్‌ను ఓడించేది చంద్రబాబేనని తెలిపారు.

• ఉత్సాహంగా 2కే రన్



స్వీప్ కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 2కే రన్ ఉత్సాహంగా సాగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ప్రాంగణం నుంచి 2కే రన్‌ను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సీపీ టీకే రాణా తదితరులతో కలిసి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

తెలుగు భాష గొప్పతనాన్ని తెలుసుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఫాదర్ కిషోర్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తెలుగు భాష చాలా గొప్ప భాష అని, ఆ భాష గొప్పతనాన్ని నేటి యువతరం తెలుసుకొని భవిష్యత్ తరాలకు అందించాలని ఆంధ్రా లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిషోర్ చెప్పారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, సిద్ధార్థ విద్యాసంస్థల తెలుగు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషపై నీ పట్టు చూపెట్టు పేరుతో విద్యార్థులకు పోటీలు శనివారం సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో సాయంత్రం ముగింపు సభ జరిగింది. కిషోర్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని భాషల కంటే తెలుగు భాష చాలా గొప్పదన్నారు. సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ తెలుగు భాషపై విద్యార్థులకు మక్కువ పెంచడానికి తమ కళాపీఠం ఆధ్వర్యంలో ఇలాంటి పోటీలను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. తెలుగు వాక్యాలతో అంత్యాక్షరి పోటీలో ప్రథమ బహుమతి వైవీ.రావు(సిద్ధార్థ బీఈడీ కళాశాల విద్యార్థులు), ద్వితీయ బహుమతి(పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు), ప్రోత్సాహక బహుమతి జేకేసీ కళాశాల విద్యార్థులు గెలుపొందారు. ఆంగ్ల పదాలు వద్దు తెలుగు మాటలే ముద్దు అనే పోటీలో ప్రథమ బహుమతి కేబీఎస్ కళాశాల విద్యార్థి ఆర్.అమృత్, ద్వితీయ బహుమతి జేకేసీ కళాశాల విద్యార్థిని బి.సౌమ్య, ప్రోత్సాహక బహుమతి సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థి టి.సాయి చరణ్ గెలుచుకున్నారు. తల్లి తండ్రి గురువు స్నేహితుడు వీరిలో నచ్చిన వారికి ప్రేమ పూర్వక లేఖ రాయడం పోటీల్లో సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థి ఎస్.అభిలాష్ ప్రథమ బహుమతి, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్.కీర్తన ద్వితీయ బహుమతి, దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని ఎం. శ్రీవైష్ణవి ప్రోత్సాక బహుమతిని పొందారు. ఆంగ్ల పదాలకు తెలుగులో సమానార్థకాలు రాయడం అనే పోటీలో సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థి బి.అమర నారాయణ ప్రథమ బహుమతి, నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థి ప్రభు కిరణ్ ద్వితీయ బహుమతి, సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థి వెంకట నారాయణ శర్మ ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. సిద్ధార్థ కళాపీఠం కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, పీబీ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ విజయలక్ష్మి, సిద్ధార్థ అకాడమీ పాలనాధికారి టి.రమేష్, నిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ కె.సరళ, డాక్టర్ పి.నీరజ, ఎం.లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



10వ డివిజన్ టీచర్స్ కాలనీలో పర్యటిస్తున్న దేవినేని క్రాంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టామని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. గడప గడపకు మీ అవినాష్ అన్న కార్యక్రమంలో భాగంగా శనివారం దేవినేని క్రాంతి 10వ డివిజన్‌లోని టీచర్స్ ప్రాంతాల్లో పర్యటించారు. అదే విధంగా అవినాష్ సతీమణి దేవినేని సుధీర 4వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గడప గడపకు వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా దేవినేని క్రాంతి మాట్లాడుతూ సీఎం జగన్ పేదల పక్షపాతి అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసి, అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సుధీర మాట్లాడుతూ నవరత్నాలు పక్కాగా అమలు చేస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అందరూ అండగా నిలవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన దేవినేని అవినాష్ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమన్నారు. వైఎస్సార్ సీపీ నాల్గవ డివిజన్ అధ్యక్షుడు గల్లా రవి, 10వ డివిజన్ ఇన్‌చార్జి కరుటూరి హరీష్, కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

6న సిద్ధార్థలో విశ్లేషక్ - 2కే24



పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బిజినెస్ అనలిటిక్స్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు విశ్లేషక్ – 2కే24 పేరుతో ఏప్రిల్ 6వ తేదీన తమ కళాశాల ఆవరణలో వారు చదువుతున్న పాఠ్యాంశాలతో పాటు వివిధ సాంస్కృతిక అంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు చెప్పారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. బాబూరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ డేటా గేమ్, బిజినెస్ క్విజ్, స్టార్టప్ ఐడియా, స్పాట్ ఫొటోగ్రఫీ, మిస్టర్ అండ్ మిస్ అంశాల్లో విద్యార్థులకు పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులు ఈ పోటీలకు హాజరవుతారన్నారు. పోటీల విజేతలకు అదే రోజు సాయంత్రం బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

5వ డివిజన్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న దేవినేని అవినాష్, ముస్లింలు

గుణదల(విజయవాడతూర్పు): ముస్లింలు పవిత్రంగా ఆచరించే రంజాన్ ఉపవాస దీక్షలు పవిత్రతకు, శాంతికి ప్రతీక అని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. 5వ డివిజన్ సున్నపుబట్టీల సెంటర్‌లోని ఎ ఉమర్ మసీదులో శనివారం జరిగిన ఇఫ్తార్ విందులో దేవినేని అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే ఇఫ్తార్ విందు పవిత్రమైన ఆధ్యాత్మిక ప్రక్రియగా పోల్చారు. ముస్లింలు చేస్తున్న ఉపవాస దీక్షలకు దేవుడు మనకు మేలు చేస్తాడని అభిప్రాయపడ్డారు. ఇఫ్తార్ విందు ద్వారా మన ఆధ్యాత్మిక శక్తితో పాటు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ మీర్ హుసేన్, నాయకులు రిజ్వాన్, షబ్బీర్, నజీర్ పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న.. తెలుగు జాతికి గర్వకారణం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పీవీ నరసింహారావుతో ఎమ్మెల్యే విష్ణు (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న మన తెలుగు వాడైన మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు సేవలకు గుర్తుగా అందించడం తెలుగుజాతికి ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ సమగ్రాభివృద్ధికి పీవీ సేవలు ఆదర్శనీయమని, దేశ ఆర్థిక వ్యవస్థను తన సంస్కరణలతో గాడిన పెట్టిన మహామేధావి అని కొనియాడారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా నిరంతర సంస్కరణశీలిగా అంచెలంచెలు ఎదిగిన ఆయన జీవితం నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. మన దేశం ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కి ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఎదిగిందంటే అందులో పీవీ చేసిన కృషి ఎంతో ఉందన్నారు. ఆయన బహుభాషా కోవిదుడని.. 14 భాషలు మాట్లాడగలిగిన ఏకైక ప్రధాని అని గుర్తుచేశారు. అసాధారణమైన ప్రతిభ, జ్ఞానం పీవీ సొంతమని కీర్తించారు. దేశ చరిత్రలో నిరంతర సంస్కరణశీలిగా పీవీ నరసింహారావు చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణలకు ఆయనే ఆద్యుడని.. భూసంస్కరణల్లో భాగంగా తన ఆస్తిని ప్రభుత్వానికి అప్పగించినటువంటి మహోన్నత వ్యక్తి అని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాతో.. ముఖ్యంగా మచిలీపట్నం, విజయవాడ నగరంతో పీవీకి ప్రత్యేక అనుబంధం ఉండేదని ఎమ్మెల్యే అన్నారు. ఆ మహనీయుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. భావితరాలు పీవీ సేవలను స్మరించుకునే విధంగా సత్యనారాయణపురంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల అనంతరం సీఎం జగన్ చేతులమీదుగా పీవీ విగ్రహావిష్కరణ ఉంటుందని తెలిపారు.

వైరల్



ఆడపిల్లే అదృష్టదేవత

పైలట్ టీనా గోస్వామి ఆసక్తికరమైన వీడియోలను 'పైలట్ మమ్మీ' శీర్షికతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తుంటుంది. తాజాగా పోస్ట్ చేసిన ఒక బామ్మ వీడియో వైరల్‌గా మారింది. గ్రామీణత ఉట్టిపడే ఆహార్యంతో కనిపిస్తున్న ఒక బామ్మ అయోధ్య ధామ్‌కు వెళ్లే విమానంలోకి మెట్లకు నమస్కరిస్తూ ఎక్కింది. విమానంలో కనిపించిన పైలట్ టీనా గోస్వామిని ఆప్యాయంగా పలకరించింది. 'మన భారతీయ సనాతన సంస్కృతిలో ఆడపిల్ల.. మన లక్ష్మి' అంటూ టీనాను ఆశీర్వదించింది. బామ్మ కాళ్లకు గౌరవంగా నమస్కరించింది టీనా. రెండు మూడు రోజుల వ్యవధిలోనే ఈ వీడియో ముప్పై లక్షల వ్యూస్ దక్కించుకుంది. హృదయాన్ని హత్తుకునే ఈ వీడియో గురించి కామెంట్ సెక్షన్‌లో ప్రశంసలు వెల్లువెత్తాయి.

సంతకాన్ని జంతర్‌మంతర్ చేసినచో...

శూన్యంలో నుంచి కూడా కళను సృష్టించే నైపుణ్యం ఆర్టిస్ట్‌ల సొంతం. తాజా విషయానికి వస్తే... ఇండిగో ఫ్లైట్ అటెండెంట్ తెల్లకాగితంపై చేసిన సంతకాన్ని క్షణాల్లో అందమైన చిత్రంగా మార్చాడు రాబిన్ బార్. సంతకం నుంచి అప్పటికప్పుడు ప్రేయసీప్రియులను సృష్టించిన రాబిన్ బార్ ఇలాంటి అలాంటి ఆర్టిస్ట్ కాదు...రికార్డ్ హోల్డర్ స్పీడ్ పెయింటర్. జస్ట్...కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. రాబిన్ బార్‌పై నెటిజనుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.





వీల్‌చైర్‌లో వచ్చాడు... విల్‌పవర్ చూపాడు

వీల్‌చైర్‌కు పరిమితమైన ఈ యువకుడు విల్ పవర్ మాత్రం ఎప్పుడూ కోల్పోలేదు. స్నేహితుల సహాయంతో వీల్‌చైర్‌లో నుంచి రిషికేష్‌లో బంగీ జంప్ చేశాడు. ఈ వీడియోతో ప్రపంచవ్యాప్తంగా నెటిజనుల మనసు దోచుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 24 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'ఎవ్రీథింగ్ ఈజ్ పాసిబుల్ ఇఫ్ యూ డేర్' 'మోర్ పవర్ టు యూ, బాయ్'లాంటి కామెంట్స్ కనిపించాయి. చాలామంది హార్ట్ ఇమోజీలతో రియాక్ట్ అయ్యారు. గతంలో లెఫ్టినెంట్ కల్నల్ అవనీష్ బాజ్‌పాయ్ ఆర్టిఫిషియల్ లింబ్‌తో భటిండాలో 14,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

సెల్ఫ్-లవ్



వెనకటికి ఒక ఈగ ఇల్లలుకుతూ ఇంటి పనుల్లో పడి పేరు మరచిపోయిందట. చాలామంది మహిళలు ఇంటిపనుల్లో తలమునకలై పోయి తమ ఇష్టాలను మరచిపోతుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రొఫెసర్ ఫల్గుణి గృహిణుల కోసం ఒక వీడియో చేసింది.

'మహిళలు తమ భర్త, పిల్లల కోసం ఇష్టమైన వంటకాలను తయారుచేసే వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం చూశాను. మరి మీ కోసం ఎప్పుడు తయారు చేస్తారు? మీ కుటుంబ సభ్యులకు నచ్చిన వంటకాల గురించి మాత్రమే కాదు మీకు నచ్చిన వాటి గురించి కూడా దృష్టి పెట్టండి' అంటూ తనకు బాగా నచ్చిన వంటకాన్ని తయారుచేస్తున్న వీడియోను ఫల్గుణి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ వైరల్ క్లిప్ 1.4 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈ వీడియో క్లిప్ చూసి ఒక మహిళ ఇలా స్పందించింది... 'నీకు ఇష్టమైనది చేసి పెడతాను. ఏంచేయమంటావు అని అడిగింది అమ్మ. వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. పెళ్లయిన తరువాత ఇంటిపనుల్లో పడి నాకు ఇష్టమైన వంటకం ఏమిటో కూడా మరిచిపోయాను. ఈ వీడియో చూసిన తరువాత సెల్ఫ్-లవ్ ప్రాముఖ్యత గురించి రియలైజ్ అయ్యాను'

ధోనీ... ఈసారి ఇలా కానియ్!



ఎం.ఎస్. ధోనీ కెప్టెన్‌షిప్ క్వాలిటీస్ మాత్రమే కాదు సరికొత్త హెయిర్ స్టైల్, సరికొత్త బైక్ కూడా నెటిజనులకు ఆసక్తికరమే. తాజాగా ధోని 'డూడుల్ వీ3 ' ఇ-బైక్ రైడింగ్ వీడియో వైరల్ అయింది. రోజుల వ్యవధిలోనే 1.3 మిలియన్‌ల వ్యూస్‌తో దూసుకుపోతుంది. ధోని రైడింగ్ వీడియోలు వైరల్ కావడం కొత్త కానప్పటికీ ఎకో-ఫ్రెండ్లీ మోడ్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్‌ను ప్రమోట్ చేసే ఈ మేడ్-ఇన్-ఇండియా ఎలక్ట్రికల్ సైకిల్ వీడియో నెటిజనులలో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది.

హాయి హాయిగా... కూల్ కూల్‌గా!

ఎలాంటి క్యాప్షన్ లేకుండా రమీజ్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన చెన్నై ఆటోడ్రైవర్ వీడియో 3 కోట్ల ఎనభై ఎనిమిది లక్షలకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది. 'ఏమిటీ ఆటోడ్రైవర్ స్పెషాలిటీ?' అనే విషయానికి వస్తే... ఎండాకాలంలో చెన్నైలో వేడి అంతా ఇంతా కాదు. ఈ వేడిని తట్టుకోవడానికి సదరు ఆటోడ్రైవర్ ఎకో ఫ్రెండ్లీ ఏసీ ఫ్యాన్‌ను తయారుచేసి తన ఆటోలో బిగించాడు. ఆటోడ్రైవరే కాదు ప్రయాణికులు కూడా హాయి హాయిగా కూల్ కూల్‌గా ప్రయాణిస్తున్నారు.



వద్దమ్మా.. తప్పు!

ఈ మధ్య 'గైడింగ్ హ్యాండ్స్' అంటూ ఒక వీడియో వచ్చింది. అది వెక్కిరింత వీడియో. ఫోన్ చూసుకుంటూ తల ఎల్లవేళలా కిందకు దించి ఉండేవారిని చేయి పట్టి చేరవలసిన చోటుకు చేర్చే 'సహాయక చేతులను' భవిష్యత్తులో ఉపాధిగా చేసుకోవచ్చని అందులో చూపుతారు. అంటే అంధులను చేయి పట్టి నడిపించే వారికి మల్లే ఈ ఫోన్ బానిసలను చేయి పట్టి నడిపించి చార్జ్ తీసుకునే వ్యక్తులు భవిష్యత్తులో వస్తారన్న మాట. మనం ఫోన్‌కు శ్రుతి మించి ఎడిక్ట్ అయ్యామని చెప్పేందుకు ఈ వీడియో చేశారు. బండి మీద వెళుతూ ఫోన్ మాట్లాడితే ప్రమాదం అని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ వినడం లేదు. కొందరు హెల్మెట్‌లో దూర్చి మరీ ఫోన్ మాట్లాడుతూ ప్రమాదం బారిన పడతారు. మరికొందరు హెడ్‌ఫోన్స్‌తో మాట్లాడుతూ వెనకొచ్చే వాహనాల హారన్ వినక ప్రమాదంలో పడుతున్నారు. మొన్నటి మార్చి 26న బెంగళూరు విద్యారణ్యపురలో ఒక మహిళ ఇలా ఫోన్ బిగించి కట్టి మాట్లాడుతూ ఒక వ్యక్తి కెమెరాకు చిక్కింది. అతను షూట్ చేసి ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. అందరూ ఇలా చేయడం ప్రమాదం అన్నారు. ఈ ఎండల్లో ఫోన్ వేడెక్కి పేలినా ప్రమాదమే అని మరికొందరు హెచ్చరించారు. పోలీసులు ఏం చేస్తున్నారని కొందరు ప్రశ్నించారు. చివరకు వీడియో పోలీసుల వరకూ వెళ్లింది. బండి నంబర్ ఆధారంగా ఆ మహిళను గుర్తించి యలహంక ట్రాఫిక్ స్టేషన్ వారు 5 వేల రూపాయల ఫైన్ వేశారు. అవసరమా ఇదంతా?





హెల్త్



కుటుంబ సభ్యుల ఆరోగ్యం మీద పెట్టినంత శ్రద్ధ తమ విషయానికి వచ్చేసరికి మహిళలు గాలికి వదిలేస్తారు. కుటుంబ సభ్యులు కూడా అంతగా పట్టించుకోరు. దాంతో ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి, అది తీవ్రరూపం దాల్చేవరకు ఎవరూ సీరియస్‌గా తీసుకోరు. అలాంటి సమస్యల్లో 'డీప్ వీన్ థ్రాంబోసిస్' ఒకటి. ఇది స్త్రీ, పురుషులిద్దరికీ వచ్చే సమస్య అయినప్పటికీ... మహిళల్లో రిస్క్ ఫ్యాక్టర్స్ ఎక్కువ. గర్భధారణ నుంచి హార్మోన్ల సంక్లిష్టతల వరకు అనేక అంశాలు డీప్ వీన్ థ్రాంబోసిస్‌కు దారితీస్తాయి. రక్తనాళాల్లో... ప్రధానంగా చెడు రక్తాన్ని తీసుకెళ్లే సిరల్లో రక్తం గడ్డకట్టడాన్ని 'డీప్ వీన్ థ్రాంబోసిస్' (డీవీటీ)గా చెబుతారు. ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

మహిళకు డీప్ వీన్ థ్రాంబోసిస్ చేసే చేటు!

డీప్ వీన్ థ్రాంబోసిస్ అనేది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. కాలి సిరల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఇంచుమించు ప్రతి 20 మందిలో ఒకరికి... వారి జీవితకాలంలో డీప్ వీన్ థ్రాంబోసిస్ బాధపెడుతుంది.

మహిళల్లోనే ప్రభావం చూపడానికి కారణాలు...

1. **ప్రెగ్నెన్సీ :** స్త్రీలలో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపించడానికి గల కారణాలలో గర్భధారణ ఒకటి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం తర్వాత ఆరు వారాల వరకు ఈ ముప్పు ఉంటుంది. గర్భధారణ తర్వాత రక్తనాళాల్లో రక్తప్రవాహం కాస్త నెమ్మదించడం మామూలే. దాంతో రక్తం గడ్డ కట్టే అవకాశాలు పెరగడం.
2. **గర్భసంచి బాగా సాగడం:** దీంతో రక్తనాళాలపై ఒత్తిడి పడి రక్తం సాఫీగా ప్రవహించడానికి ఆటంకం కలుగుతుంది.
3. **నోటి ద్వారా తీసుకునే గర్భనిరోధక మాత్రలు:** వీటిల్లోని హార్మోన్లతో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. దాదాపు ప్రతి గర్భనిరోధక మాత్రలో ఈస్ట్రోజెన్, ప్రోజెస్టిన్ ఉండటంతో అవి రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టేలా చేసే అవకాశాలు పెరుగుతాయి. పైగా ఈస్ట్రోజెన్... కాలేయాన్ని ప్రేరేపించి... రక్తంలో ఉండే బ్లడ్ క్లాటింగ్ ఫ్యాక్టర్ రక్తం గడ్డకట్టేలా చేసే ఫైబ్రినోజెన్‌ను ఎక్కువగా స్రవింపజేస్తుంది. దీనికితోడు గర్భనిరోధక మాత్రల్లో వాడే కొన్ని రకాల కాంబినేషన్స్ పిల్స్ వల్ల ఈ ముప్పు మరింత పెరుగుతుంది. అందువల్ల గర్భనిరోధక మాత్రలు వాడే వారు డాక్టర్ సలహా మేరకే వాడాలి.
4. **హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ:** మెనోపాజ్ తర్వాత తీసుకునే హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీలోని మందుల్లో ఈస్ట్రోజెన్, ప్రోజెస్టిన్ కాంబినేషన్ ఉంటుంది. ఈ ఈస్ట్రోజెన్ పైన పేర్కొన్న ప్రభావాన్నే చూపడంతో డీప్ వీన్ థ్రాంబోసిస్ ముప్పు పెరుగుతుంది. అందువల్ల ఈస్ట్రోజెన్ మందుల్ని చర్మానికి అంటించే ప్యాచ్‌ల రూపంలో ఇస్తే ఈ ముప్పు తగ్గుతుంది.
5. **జీవనశైలి అంశాలు:** శారీరక శ్రమ లేకుండా ఒకేచోట ఎక్కువసేపు కూర్చుని ఉండటం, స్థూలకాయం, పొగతాగడం వంటివి రక్తప్రవాహానికి ఆటంకం కలిగిస్తాయి. స్మోకింగ్ ద్వారా దేహంలోకి చేరే నికోటిన్ రక్తాన్ని గడ్డకట్టేలా చేస్తుంది.

వేర్వేరుగా లక్షణాల తీవ్రత...

డీప్ వీన్ థ్రాంబోసిస్‌లో రకరకాల లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఆ లక్షణాలన్నీ అందరిలోనూ కనిపించకపోవచ్చు. దానికితోడు లక్షణాల తీవ్రతలో కూడా మార్పులుండవచ్చు. కొందరిలో రక్తపు గడ్డ చిన్నదిగా ఉంటే కొందరిలో అసలు ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. సమస్య దానంతట అదే సమసిపోవచ్చు కూడా.



కొన్ని సాధారణ లక్షణాలు...

- రక్తం గడ్డ కట్టినచోట చర్మం వాపు (ముఖ్యంగా కాలు, పాదం వంటివి)
- చర్మం ఎర్రబారడం, అక్కడ వేడిగా ఉన్నట్లు అనిపించడం
- ఒక్కోసారి చర్మంలోంచి రక్తనాళాలు కనిపించడం
- కాలిలో డీవీటీ ఏర్పడినప్పుడు కాలు బలహీనంగా ఉన్నట్లు అనిపించడం
- రక్తనాళాలు గట్టి పడడం

ఈ లక్షణాలు అకస్మాత్తుగా కనిపించినా లేదా కాలం గడుస్తున్న కొద్దీ తీవ్రత పెరుగుతూ పోతున్నా వెంటనే డాక్టర్‌కు చూపించాలి. కొన్నిసార్లు రక్తనాళంలో ఏర్పడ్డ ఈ గడ్డ (క్లాట్) రక్తప్రవాహంలో కొట్టుకుపోతూ, గుండె రక్తనాళాల్లోకి చేరి, గుండెస్పందనలను ఆపివేసే 'పల్మనరీ ఎంబాలిజమ్' అనే కండిషన్‌కు దారితీసే ప్రమాదం ఉంటుంది.



నివారణ...


- మంచి సమతులాహారం తీసుకోవడం అంటే పొట్టు తీయని కాయధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు, తాజా పండ్లు తీసుకుంటూ బరువు పెరగకుండా చూసుకోవడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ముఖ్యంగా మహిళలు రోజుకు కనీసం 30 నిమిషాల వ్యాయామం చేయడం వల్ల రక్తప్రవాహం సాఫీగా మారి రక్తపు గడ్డలు ఏర్పడకుండా ఉంటుంది.
- తగినన్ని నీళ్లు, ద్రవాహారాలు తీసుకుంటూ ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండటం.
- ఒకే చోట స్థిరంగా కూర్చుని ఉండకుండా కాసేపు నడక, స్ట్రెచ్చింగ్ వంటివి చేస్తూ ఉండటం.
- దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు అదేపనిగా వాహనంలో కూర్చుని ఉండకుండా తరచూ బ్రేక్ తీసుకోవటం.
- రక్తనాళాల్లో రక్తప్రవాహం సాఫీగా సాగేందుకు కంప్రెషన్ స్టాకింగ్ వంటివి వాడటం.
- గర్భం దాల్చిన మహిళల కుటుంబ సభ్యుల్లో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చిన ఆరోగ్య చరిత్ర ఉంటే ముందే డాక్టర్‌కు ఈ విషయాన్ని చెప్పడం మంచిది.

చికిత్స...

డీవీటీ వచ్చే అవకాశాలున్న వారు సపోర్ట్ స్టాకింగ్స్ / కంప్రెషన్ స్టాకింగ్స్ వాడటం.

రక్తాన్ని పలచబార్చే మందులైన యాంటీ కోయాగ్యులెంట్స్ వాడటం..

- **క్లాట్ బస్టర్స్ / థ్రాంబోలైటిక్స్ చికిత్స :** చిన్న పైప్ (క్యాథెటర్) ద్వారా రక్తం గడ్డకట్టిన చోటికి థ్రాంబోలైటిక్స్ అని పిలిచే మందును పంపి, రక్తపుగడ్డను చెదరగొట్టే ఔషధాల్ని వాడటం.



డాక్టర్ నరేంద్రనాథ్ మేడ,
కన్సల్టెంట్ వాస్క్యులార్ &
ఎండో వాస్క్యులార్ సర్జన్

మెడి టిప్
చెవుల సంరక్షణ కోసం...!


చెవులను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...
- పల్లెటూళ్లలో వేసవి సెలవులు రాగానే ఈత నేర్చుకోవడం కోసం పిల్లలు నీటి కుంటలు, చెరువులకు వెళ్తుంటారు. చెరువుల్లోని మురికి నీరు చెవుల్లోకి చేరి ఇన్ఫెక్షన్లు రావచ్చు. అందువల్ల ఈత నేర్చుకోవాలనుకునే పిల్లలు పరిశుభ్రమైన నీళ్లలోనే దిగాలి.
- చెవులను శుభ్రం చేయడానికి కొందరు గోరు వెచ్చగా కాచిన కొబ్బరి నూనె, ఆముదం చెవుల్లో పోస్తారు. ఇలా ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదు.
- అపరిశుభ్రమైన నీటితో తయారు చేసే ఐస్‌క్రీముల వంటివాటితో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వస్తాయి. అవే ఇన్ఫెక్షన్లు చెవులకూ సోకే ప్రమాదం ఉంది. కాబట్టి చెవి, గొంతు, ముక్కు... భాగాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్తను మరింతగా పాటించాలి.

పై జాగ్రత్తలు పాటించాక కూడా... గులివి, చీము వంటి సమమస్యలతో పాటు... చెవిపోటు ఎక్కువగా వస్తున్నా, సరిగా వినిపించకపోయినా... వీలైనంత త్వరగా ఈఎన్‌టీ వైద్యనిపుణులను సంప్రదించాలి.

గుండె పెరగడం అంటే..?

గుండె పెరిగే సమస్యను ఇంగ్లిష్‌లో హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ అనీ, వైద్య పరిభాషలో కార్డియో మెగాలీ అని అంటారు. నిజానికి ఇదేమీ వ్యాధి కాదు. కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు (మెడికల్ కండిషన్లు) కారణంగా కనిపించే ఒక లక్షణం. గుండె ఎందుకు విస్తరిస్తుందో, అందుకు కారణమయ్యే ఆరోగ్య సమస్యలేమిటో, దీని నివారణ, చికిత్స ప్రక్రియలను తెలుసుకుందాం.

రక్తాన్ని సరఫరా చేసే ఓ పంప్ లాంటిది గుండె. ఈ పంపు బలహీనమైనప్పుడు శరీరానికి అవసరమైన రక్తాన్ని సరఫరా చేయలేదు. ఈ పరిస్థితినే హార్ట్ ఫెయిల్యూర్ అంటారు. గుండెపై ఒత్తిడి పెరిగినప్పుడు గుండె విస్తరిస్తుంది. కొందరిలో ఈ పరిస్థితి తాత్కాలికం కాగా... మరికొందరిలో ఎప్పటికీ మందులు వాడటం, చికిత్స కొనసాగించడం అవసరం కావచ్చు. ఈ సమస్య తీవ్రమైనదా కాదా అన్నది గుండె పెరగడానికి కారణమైన అంశాన్ని బట్టి ఉంటుంది.



గుండె పెరగడం... రకాలు...

గుండె కాస్త పెరిగినప్పటికీ... ఒక దశ వరకూ అది మామూలుగానే పనిచేస్తుంది. ఒక దశకు చేరాకే అనర్థాలు కనిపిస్తాయి. గుండె పెరిగిన కారణాలూ, తీరును బట్టి ఇందులో కొన్ని రకాలు ఉంటాయి. అవి...

- డయలేటెడ్ కార్డియోమయోపతి కారణంగా గుండె పెరిగితే ఇందులో గుండె కింది గదులు (వెంట్రికిల్స్) రెండూ పెరుగుతాయి.
- అధిక రక్తపోటు కారణంగా గుండె ఎడమవైపు కింది గది మందంగా మారవచ్చు. ఇలా కండరం మందంగా మారి గుండె పెరగడాన్ని 'హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి' అంటారు.
- ఒక్కోసారి ఏ కారణమూ లేకుండానే గుండెపెరగవచ్చు లేదా ఇతమిత్థంగా కారణం తెలియక పోవచ్చు. ఈ పరిస్థితిని ఇడియోపథిక్ డయలేటెడ్ కార్డియో మయోపతి అంటారు.

కారణాలు...

- గుండె కండరానికి ఇన్ఫెక్షన్ (మయోకార్డైటిస్) వచ్చేలా చేసే వైరల్ ఇన్ఫెక్షన్లు.
- గుండెకు ఉండే నాలుగు కవాటాల్లో ఏదైనా దెబ్బ తినడం వల్ల కొన్ని గదుల్లోకి రక్తం ఎక్కువగా వెళ్తూ ఉండటం.
- గుండె చుట్టూరా ఉండే ఒక పొరలోకి ద్రవాలు చేరడం వల్ల ఇలా జరగడాన్ని పెరికార్డియల్ ఎఫ్యూజన్ అంటారు. దీన్ని ఎక్స్-రే ద్వారా కనుగొంటారు.
- రక్తహీనత వల్ల అన్ని అవయవాలకూ ఆక్సిజన్ తగినంతగా అందదు. అలా అందించే ప్రయత్నంలో గుండె మరింత ఎక్కువగా పని చేయాల్సి రావడంతో.
- మహిళల్లో గర్భధారణ సమయంలో గుండె పెరిగే కండిషన్ అయిన పెరిపార్టమ్ కార్డియోమయోపతి వల్ల.
- కార్డియాక్ అమైలాయిడోసిస్ అనే కండిషన్‌లో రక్తంలో అమైలాయిడ్ ప్రోటీన్ మోతాదులు పెరగడంతో (ఇందులో గుండె గోడలు మందంగా మారతాయి).
- దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడేవారిలో
- థైరాయిడ్ గ్రంథి స్రావంలో అసమతుల్యతల వల్ల
- పల్మనరీ హైపర్‌టెన్షన్ అనే హైబీపీ ఉన్నవారిలో రక్తపోటు వల్ల గుండె మరింత ఎక్కువగా పనిచేయాల్సి రావడంతో గుండె కుడివైపు గదులు పెరగవచ్చు.
- మద్యం తాగేవారిలో లేదా మాదకద్రవ్యాలు తీసుకునేవారిలో దీర్ఘకాలంలో గుండె పెరిగే ప్రమాదం ఉంది.
- కొందరిలో జన్యు సమస్యల కారణంగా పుట్టుకతోనే గుండె, దాని విధుల్లో తేడాలు రావడంతో పాటు గుండె పెరగవచ్చు.

లక్షణాలు...
- శ్వాస సరిగా అందకపోవడం
- కాళ్ల / పాదాల వాపు
- బరువు పెరగడం (ముఖ్యంగా దేహం మధ్యభాగంలో... సెంట్రల్ ఒబేసిటీ)
- తీవ్రమైన అలసట
- కొందరిలో గుండెదడ లేదా గుండె లయ తప్పడం.

నిర్ధారణ పరీక్షలు: కొన్ని రక్తపరీక్షలు, ఛాతీ ఎక్స్-రే, సీటీ లేదా ఎమ్మారై స్కాన్, ట్రెడ్‌మిల్‌పై చేయించే స్ట్రెస్ పరీక్ష, అరుదుగా గుండె కండరాన్ని సేకరించి చేసే బయాప్సీ.

చికిత్స... గుండె పెరగడానికి కారణమైన అంశం ఆధారంగా చికిత్స చేస్తారు. ఉదాహరణకు...
- గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకి ఏర్పడటం వల్ల వచ్చే కరోనరీ ఆర్టరీ డిసీజ్‌లో ఆ అడ్డంకి తొలగింపు ద్వారా.
- రక్తపోటును నియంత్రించే మందుల్ని వాడటం ద్వారా.
- గుండె కవాటాలలో లోపాల వల్ల గుండె పెరిగితే వాల్వ్‌లకు తగిన రిపేరు చేయడం లేదా శస్త్రచికిత్స ద్వారా.
- మద్యపానం లేదా మాదక ద్రవ్యాల వల్ల గుండె పెరిగితే ఆ అలవాటును మాన్పించడం ద్వారా.

ఇతర మందుల వాడకంతోనూ... కాళ్లవాపులు అధికంగా ఉన్నప్పుడు అధికంగా మూత్రం వచ్చేలా చేసే డై-యూరెటిక్స్‌తో
- రక్తపోటు పెరిగినప్పుడు యాంజియోటెన్సిన్ - కన్వర్టింగ్ ఎంజైమ్ ఇన్హిబిటార్స్, బీటా బ్లాకర్స్ వంటి మందులతో.
- రక్తాన్ని పలచబార్చే యాంటీ కోయాగ్యులెంట్స్‌తో.
- గుండె లయ తప్పినప్పుడు యాంటీ అరిథ్మియా డ్రగ్ అనే మందును వాడతారు.
- గుండె కొట్టుకోవడం ఆగితే ఇంప్లాంటబుల్ కార్డియోవెర్టర్ డీ ఫిబ్రిలేటర్‌తో తిరిగి గుండె కొట్టుకునేలా చేస్తారు.
- గుండె స్పందనల వేగం పెరిగినా లేదా తగ్గినా క్రమబద్ధం చేసే 'పేస్‌మేకర్' అమర్చడం ద్వారా.
- లెఫ్ట్ వెంట్రిక్యులార్ అసిస్ట్ డివైస్ (ఎల్‌వీఏడీ) అనే ఉపకరణాన్ని.. గుండెమార్పిడి శస్త్రచికిత్స అవసరమైన వారు తమకు సరిపడే గుండెకోసం వేచి చూస్తున్నప్పుడు...
- గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకులు (బ్లాక్స్) చాలా ఎక్కువగా ఉన్నప్పుడు బైపాస్ శస్త్రచికిత్సతో...
- చివరి ప్రత్యామ్నాయంగా గుండె మార్పిడి (హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్) చికిత్సతో పరిస్థితిని చక్కదిద్దుతారు.



డా. కరుణాకర్ రాపోలు
ఇంటర్‌వెన్షనల్
కార్డియాలజిస్ట్